ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

site.singidinews.com

ఆదివారం 22 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 156 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

ఫెడ్ వడ్డీరేట్లతో అమెరికా

ఆర్థిక వ్యవస్థకు నష్టం

వడ్డీరేట్లు తగ్గించకపోతే వృద్ధికి విఘాతమే: ట్రంప్

భారత్‌లో తక్కువ వడ్డీరేట్లు.. 7 శాతం జీడీపీ వృద్ధిపై ప్రశంసలు

ఫెడరల్ రిజర్వ్‌పై రాజకీయ ధోరణి ఆరోపణలు

వడ్డీరేట్లు తగ్గిస్తే అమెరికా జీడీపీ 15–20 శాతానికి...

2





సోనియా రాజకీయ ప్రస్థానంపై

పుస్తకం రాస్తా

పది కీలక ప్రశ్నలతో బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే

మారుతి యాజమాన్యం నుంచి నేషనల్ హెరాల్డ్ వరకు ప్రస్తావన

2

వికసిత్ భారత్ నిర్మాణంలో ఐఐటీల పాత్ర కీలకం

పరిమితులను అధిగమించి.. అవకాశాలను సృష్టించుకోవాలి

రాబోయే 20 ఏళ్లు అత్యంత కీలకం.. విద్యార్థులకు ప్రధాని మోదీ పిలుపు



ఆలోచనా విధానంలోని అడ్డంకులను తొలగించుకున్నప్పుడే ఏ దేశమైనా తన అసలైన సామర్థ్యాన్ని గుర్తించి, అభివృద్ధి పథంలో ముందుకు సాగగలుగుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గత కొన్నేళ్లుగా భారత్ ఇదే సూత్రంతో ముందుకు సాగుతూ తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతోందని పేర్కొన్నారు.

ఖరగ్‌పూర్, నవంబర్ 21 (సింగిడి)

2

ఎన్‌డీఏ పాలనలో బిహార్‌లో అభివృద్ధి పరుగులు

12 ఏళ్లలో 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం

రూ.34,470 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం

ఆధునిక వంతెనకు 'నీతీశ్ సేతు'గా నామకరణం: ప్రధాని మోదీ







తెలంగాణ ఎగుమతుల్లో

68 శాతం వృద్ధి

తయారీ, ఏరోస్పేస్ రంగాల్లో గణనీయమైన పురోగతి

మహబూబ్‌నగర్ వంటి జిల్లాలకూ అభివృద్ధి ఫలాలు

2

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పెట్టుబడులకు ప్రోత్సాహం

క్యూర్, ప్యూర్, రేర్‌తో రాష్ట్రవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాల విస్తరణ

తెలంగాణ రాష్ట్ర ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధి నమోదవడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గత మూడేళ్లలో రాష్ట్ర ఎగుమతులు అంతకు ముందు మూడేళ్లతో పోలిస్తే 68 శాతం పెరిగాయని వెల్లడించారు. తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, ఎగుమతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు.

ఏరోస్పేస్, ఇంజినీరింగ్ రంగాల్లో వృద్ధి

రాష్ట్రంలో ఏరోస్పేస్, ఇంజినీరింగ్ రంగాల ఎగుమతులు గణనీయంగా పెరుగుతున్నాయని సీఎం తెలిపారు. పారిశ్రామికాభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడం, పెట్టుబడులను ఆకర్షించడం, తయారీ రంగానికి ప్రోత్సాహం అందించడం ద్వారా ఈ పురోగతి సాధ్యమవుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర పారిశ్రామిక సామర్థ్యాన్ని మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి ఫలాలు

మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లోనూ ఎగుమతులు, పారిశ్రామిక కార్యకలాపాలు వృద్ధి చెందడం సానుకూల పరిణామమని రేవంత్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి హైదరాబాద్‌కే పరిమితం కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తోందనడానికి ఇది నిదర్శనమని వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, క్రియాశీలక పాలనతో వ్యాపారాలకు అనుకూల పరిస్థితులు కల్పిస్తున్నామని తెలిపారు. సాధించిన ప్రగతి కేవలం ఆరంభం మాత్రమేనని వ్యాఖ్యానించారు.

- హైదరాబాద్, నవంబర్ 21 (సింగిడి)

ఏరోస్పేస్ రంగంలో

మరో భారీ పెట్టుబడి!

సఫ్రాన్ సంస్థ నుంచి రూ.4,000 కోట్ల పెట్టుబడికి ప్రతిపాదన

డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సులో ఎంఓయూ కుదిరే అవకాశం

ఫ్రాన్స్‌లోని సఫ్రాన్ తయారీ కేంద్రాన్ని సందర్శించిన భట్టి విక్రమార్క

2



హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఏరోస్పేస్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఫ్రాన్స్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాత విమాన ఇంజిన్ల తయారీ సంస్థ సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ తెలంగాణలో సుమారు రూ.4,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ భారీ పెట్టుబడి ప్రతిపాదన కార్యరూపం దాల్చితే రాష్ట్రంలో ఏరోస్పేస్, విమాన విడిభాగాల తయారీ రంగాలకు మరింత ఊతం లభించనుంది. డిసెంబర్ 2026లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ఈ పెట్టుబడికి సంబంధించి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరే అవకాశం ఉంది.

ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా శనివారం పారిస్ సమీపంలోని ఎవ్రీ-కార్బెల్‌లో ఉన్న సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ తయారీ కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, ఇప్పటికే కొనసాగుతున్న కార్యకలాపాల విస్తరణ, కొత్త తయారీ యూనిట్ల ఏర్పాటుపై చర్చించారు. బోయింగ్, ఎయిర్‌బస్ వంటి అంతర్జాతీయ విమాన తయారీ సంస్థలకు ఇంజిన్లను సరఫరా చేస్తున్న సఫ్రాన్ వంటి ప్రపంచ స్థాయి సంస్థ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకు రావడం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి కీలక పరిణామం. హైదరాబాద్‌లో సఫ్రాన్ సంస్థ ఇప్పటికే గణనీయమైన స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

పారిస్ (సింగిడి)

అయ్యప్ప భక్తులకు భారీ ఊరట

విమాన క్యాబిన్‌లోనే 'ఇరుముడి కట్టు' తీసుకెళ్లేందుకు గ్రీన్ సిగ్నల్

అధికారిక ఉత్తర్వులు జారీ

2



శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులు విమానంలోని క్యాబిన్ బ్యాగేజీలో పవిత్ర ఇరుముడి కట్టును తీసుకెళ్లేందుకు వరుసగా మూడో ఏడాది కూడా కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బీసీఏఎస్, సీఐఎస్ఎఫ్ , ఎయిర్‌పోర్ట్ నిర్వాహకులకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారిక ఆదేశాలు జారీ చేసింది. నవంబర్ 12, 2026 నాటి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గత ఏడాది జారీ చేసిన నిబంధనలే యథాతథంగా కొనసాగనున్నాయి.

న్యూఢిల్లీ (సింగిడి)

2029 నాటికి దేశాన్ని

డ్రగ్స్ రహిత దేశమే లక్ష్యం

డ్రగ్ ఫ్రీ ఇండియాకు అందరూ సహకరించాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పంజాబ్‌లో డ్రగ్స్‌తో యువత నిర్వీర్యం

2

హైదరాబాద్‌లో కూడా విచ్చలవిడిగా సరఫరా : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి





మరోసారి యలహంక

ప్యాలెస్ వివాదం

2

షర్మిలను అడ్డుకునేందుకు కోర్టుకెళ్లిన జగన్

సిలికాన్ బిల్డర్స్ లిమిటెడ్ పేరిట దేవనహళ్లి కోర్టును ఆశ్రయించిన జగన్

పెళ్లి కార్డు ఇచ్చేందుకు బెంగళూరు వెళ్లనున్న షర్మిల

ఇందిరమ్మ బీమాకు శ్రీకారం

క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక మొదలు

పేద కుటుంబాలకు రూ.5 లక్షల ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం

2

కుటుంబ పెద్దకు వర్తించే ఈ పథకానికి పూర్తి ప్రీమియం ప్రభుత్వానిదే

క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొదలు... ఈ నెల 23 నుంచి క్లస్టర్ల వారీగా ప్రత్యేక క్యాంపుల నిర్వహణ

రేషన్, ఆధార్ కార్డుల ఆధారంగా 18 నుంచి 59 ఏళ్లలోపు వారికి అవకాశం



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చింది. పేద కుటుంబాల్లోని పెద్ద దిక్కుకు రూ. 5 లక్షల బీమా భద్రత కల్పించే ఈ పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సిద్దిపేటలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన నేపథ్యంలో, ప్రభుత్వం పూర్తి మార్గదర్శకాలు విడుదల చేసింది. అసెంబ్లీ ఎన్నికల హామీలో భాగంగా అమలు చేస్తున్న ఈ పథకం కింద లబ్ధిదారులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. పూర్తి ప్రీమియం ప్రభుత్వమే భరిస్తుంది. కుటుంబ పెద్దగా ఉన్న వ్యక్తికి మాత్రమే ఈ బీమా వర్తిస్తుంది. ఒకవేళ కుటుంబంలో ఒకరి కన్నా ఎక్కువ మంది సంపాదించేవారు ఉంటే, ఎవరి పేరుపై బీమా చేయాలో ఆ కుటుంబమే నిర్ణయించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

హైదరాబాద్, నవంబర్ 21 (సింగిడి)

వచ్చే ఎన్నికల్లో మళ్లీ

గోల్ కొడతాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

మీడియా చిట్‌చాట్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2

ప్రజల్లోకి ఎలా వెళ్లాలో, ఎన్నికల ఆట ఎలా ఆడాలో తమకు బాగా తెలుసని.. బాగా ఆడి వచ్చే ఎన్నికల్లో మళ్లా గోల్ కొడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నట్లుగానే ఇప్పుడు కూడా పార్టీలో కష్టపడే అంకితభావం కలిగిన నాయకులు, కార్యకర్తల బలమైన టీమ్ ఉందన్నారు.

హైదరాబాద్, నవంబర్ 21 (సింగిడి)



సామాన్య కార్యకర్తలు.. మహిళలకు

పదవుల్లో అధిక ప్రాధాన్యం

వైసీపీ కుట్రలను తిప్పికొట్టిన ఓటర్లకు హ్యాట్సాఫ్..

ముగ్గురు నేతలు అలగడం నాకు నచ్చలేదు: సీఎం చంద్రబాబు

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి అండగా ప్రజలు: సీఎం

జిల్లా పరిషత్ ఎన్నికల్లో 96.42 శాతం స్ట్రయిక్ రేట్ సాధించినట్లు వెల్లడి

స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ పన్నిన కుట్రలు, కుతంత్రాలను ప్రజాస్వామ్యబద్ధంగా తిప్పికొట్టిన రాష్ట్ర ఓటర్లకు హ్యాట్సాఫ్ చెబుతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారనే విషయాన్ని ఈ తీర్పు మరోసారి రుజువు చేసిందని స్పష్టం చేశారు. ఎన్నికలు జరగకుండా ఆపేందుకు కోర్టుల్లో 63 పిటిషన్లు వేసి, బీసీ రిజర్వేషన్లు, డీలిమిటేషన్ పేరిట అడ్డంకులు సృష్టించారని, హింసకు పాల్పడుతూ ఎదురు ఫిర్యాదులు చేసిన వైసీపీ డ్రామాలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదని సీఎం మండిపడ్డారు.

2

మంగళగిరి, నవంబర్ 21 (సింగిడి)



ఇందిరమ్మ బీమాకు శ్రీకారం

ప్రాథమికంగా రేషన్ కార్డు ఆధారంగా అర్హులను గుర్తించి, ఆ తర్వాత ఆధార్ కార్డును కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నెల 19న ఇది ప్రారంభం కాగా డిసెంబర్ 18 వరకు నెల రోజుల పాటు లబ్ధిదారుల నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. ఈ నెల 23వ తేదీ నుంచి మూడు నాలుగు గ్రామ పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు కార్యాలయాల్లోనూ వివరాలు నమోదు చేసుకోవచ్చు. 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించిన 18 నుంచి 59 ఏళ్ల వయస్కులు ఈ పథకానికి అర్హులు. గతంలో నిర్వహించిన 'సీఏ' సర్వే ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 1.15 కోట్ల కుటుంబాలకు ఈ పథకాన్ని అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. నమోదు ప్రక్రియను పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్లను నోడల్ అధికారులుగా నియమించారు. లబ్ధిదారుడి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబర్ వంటి వివరాలను సేకరించి, ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారు. క్యాంపు స్థాయిలో భౌతిక రిజిస్టర్‌ను కూడా నిర్వహిస్తూ పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది

సోనియా రాజకీయ ప్రస్థానంపై పుస్తకం రాస్తా

న్యూఢిల్లీ, నవంబర్ 21 (సింగిడి)

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాజకీయ ప్రస్థానంపై పుస్తకం రాయనున్నట్లు బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ప్రకటించారు. ఈ రచన వ్యక్తిగత విమర్శలకు పరిమితం కాకుండా, ఆమె రాజకీయ జీవితంలోని కీలక పరిణామాలు, వివాదాలు, పలు చారిత్రక అంశాలను సమగ్రంగా ప్రస్తావించేలా ఉంటుందని తెలిపారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా సోనియా గాంధీకి సంబంధించి పది ప్రశ్నలను సంధించారు. మారుతి సంస్థతో సంబంధాలు, నేషనల్ హెరాల్డ్ వ్యవహారం, బోఫోర్స్ వివాదం, యూపీఏ హయాంలో ఆమె రాజకీయ పాత్ర వంటి అంశాలను పుస్తకంలో ప్రస్తావించనున్నట్లు వెల్లడించారు.

మారుతి యాజమాన్యంపై ప్రశ్నలు

సోనియా గాంధీ మారుతి సంస్థకు యజమానిగా ఎలా మారారని నిశికాంత్ దూబే ప్రశ్నించారు. 1970లో సంజయ్ గాంధీకి చెందిన మారుతి ప్రాజెక్టుతో మారుతి టెక్నికల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఉన్న సంబంధాలు, ఆ సంస్థలో సోనియా గాంధీకి ఉన్నట్లు తాను పేర్కొంటున్న వాటాలపై వివరాలు వెల్లడించాలని అన్నారు. విదేశీ పౌరసత్వం ఉన్న సమయంలోనే ఆమె సంస్థలో కీలక పదవులు ఎలా చేపట్టారంటూ పలు ఆరోపణలు చేశారు. ఇవన్నీ తన పుస్తకంలో ప్రస్తావిస్తానని తెలిపారు.

నేషనల్ హెరాల్డ్, బోఫోర్స్‌పై ఆరా

నేషనల్ హెరాల్డ్ పత్రికను కొనుగోలు చేసిన విధానం, బోఫోర్స్ వివాదం వెనుక ఉన్న పరిణామాలపై కూడా పుస్తకంలో వివరాలు ఉంటాయని దూబే పేర్కొన్నారు. 2004 నుంచి 2014 వరకు యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రధానమంత్రి కంటే సోనియా గాంధీకి ఎక్కువ రాజకీయ ప్రాధాన్యం ఉండేదా? అనే ప్రశ్నను కూడా లేవనెత్తారు. ఈ అంశాలపై తన రచనలో వివరణ ఇస్తానని వెల్లడించారు.

రాజకీయ సంబంధాలు.. పది ప్రశ్నలు

సోనియా గాంధీ, మేనకా గాంధీ మధ్య విభేదాలకు అసలు కారణాలేమిటి? 2008 బీజింగ్ ఒలింపిక్స్‌కు అప్పటి ప్రధాని స్థానంలో సోనియా తన కుటుంబంతో కలిసి ఎందుకు వెళ్లారు? మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారాం కేసరి ధోతి వివాదం వెనుక కథ ఏమిటి? మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, సోనియా గాంధీ మధ్య విభేదాలు ఎందుకు వచ్చాయి? 1999లో కాంగ్రెస్‌లో ఆమెకు ఎవరు ద్రోహం చేశారు? రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలలో రాజకీయంగా ఎవరికి ప్రాధాన్యం ఇస్తారు? వంటి ప్రశ్నలను దూబే తన పోస్టులో ప్రస్తావించారు.

'వేచి చూడండి' అంటూ వ్యాఖ్య

తాను రాయబోయే పుస్తకం వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకునే రచన కాదని, సోనియా గాంధీ రాజకీయ జీవితానికి సంబంధించిన అంశాలను వెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నమని నిశికాంత్ దూబే పేర్కొన్నారు. 'వేచి చూడండి' అంటూ తన పోస్టును ముగించారు. కాగా, మారుతి సంస్థ యాజమాన్యం, ఇతర అంశాలపై దూబే చేసిన వ్యాఖ్యలు ఆయన ఆరోపణలుగానే ఉన్నాయి. వాటిపై కాంగ్రెస్ పార్టీ నుంచి తక్షణ స్పందన వెలువడలేదు.

ఎన్‌డీఏ పాలనలో బిహార్‌లో అభివృద్ధి పరుగులు

న్యూఢిల్లీ, నవంబర్ 21 (సింగిడి)

బిహార్‌లో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కుంభకోణాలు, అవినీతి గురించే చర్చ జరిగేదని, ప్రస్తుతం పెట్టుబడులు, అభివృద్ధి, నేరస్తులపై కఠిన చర్యల గురించి ప్రజలు మాట్లాడుకుంటున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రంలో పాలన మారడంతో అభివృద్ధి దిశగా కీలకమైన మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాల పాటు 'గరీబీ హఠావో' నినాదంతో ప్రజలను మభ్యపెట్టిందని, తమ ప్రభుత్వం కేవలం 12 ఏళ్లలోనే సుమారు 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చిందని వెల్లడించారు. శనివారం బిహార్ మాజీ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ గౌరవార్థం నిర్మించిన ఆధునిక వంతెనకు 'నీతీశ్ సేతు'గా నామకరణం చేసి ప్రారంభించిన అనంతరం వైశాలిలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం

బిహార్‌లో గత ప్రభుత్వాల పాలనకు, ప్రస్తుత ఎన్‌డీఏ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మోదీ వివరించారు. గత మూడు దశాబ్దాలుగా రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, నీతీశ్ కుమార్ అందించిన సుపరిపాలనను ప్రస్తుత ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, ఆయన బృందం కొనసాగిస్తున్నారని అన్నారు. దివంగత నేత రామ్ విలాస్ పాశ్వాన్ కలలను తమ ప్రభుత్వం సాకారం చేస్తోందని పేర్కొన్నారు. పేదల జీవితాలను సులభతరం చేయడం, వారికి కనీస అవసరాలు, మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది కుటుంబాలకు భరోసా కల్పించగలిగామని చెప్పారు.

80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు

దేశవ్యాప్తంగా సుమారు 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు అందిస్తున్నామని ప్రధాని వెల్లడించారు. లక్షలాది పేద కుటుంబాలకు శాశ్వత గృహాలు నిర్మించి ఇవ్వడం ద్వారా వారికి భద్రత కల్పించామని తెలిపారు. ఉచిత వైద్య చికిత్స పథకాలతో సామాన్యులపై వైద్య ఖర్చుల భారం తగ్గిందని చెప్పారు. పేదలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం వల్లే దేశం పేదరికంపై విజయం సాధించే దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

100 ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభం

బిహార్‌లో పట్టణ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో వైశాలిలో 100 ఎలక్ట్రిక్ బస్సులను ప్రధాని జెండా ఊపి ప్రారంభించారు. ప్రజా రవాణాను సౌకర్యవంతంగా మార్చడంతోపాటు కాలుష్యాన్ని తగ్గించడం, పర్యావరణహిత ప్రయాణ సదుపాయాలను విస్తరించడం ఈ బస్సుల ప్రవేశం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ రవాణా వ్యవస్థలో ఈ బస్సులు కీలక పాత్ర పోషించనున్నాయి.

రూ.34,470 కోట్ల అభివృద్ధి పనులు

వైశాలి పర్యటన సందర్భంగా రోడ్డు అనుసంధానం, ఇంధనం, పట్టణ మౌలిక సదుపాయాలు, నీటి వనరులు, విద్య, ఆరోగ్య సంరక్షణ, రవాణా తదితర కీలక రంగాలకు చెందిన సుమారు రూ.34,470 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేశారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల అవసరాలు నెరవేరుతున్నాయని కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే ఈ అభివృద్ధి సాధ్యమవు

తెలంగాణ ఎగుమతుల్లో 68 శాతం వృద్ధి

తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా రూపొందించిన క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళిక రాష్ట్రవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలను గణనీయంగా పెంచుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రణాళిక ద్వారా పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల విస్తరణకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

వికసిత్ భారత్ నిర్మాణంలో ఐఐటీల పాత్ర కీలకం



పరిమితులను అధిగమించి, కొత్త అవకాశాలను సృష్టించుకోవాలనే సంకల్పంతో దేశం ప్రగతిపథంలో పయనిస్తోందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని.. దేశం సాధించిన అభివృద్ధి, సాంకేతిక పురోగతి, పేదరిక నిర్మూలన, విద్యారంగంలో సాధిస్తున్న విజయాలను వివరించారు.

పేదలకు సాధికారతే లక్ష్యం

గతంలో ఎర్రకోట నుంచి పేదరిక నిర్మూలనపై నినాదాలు చేయడం, వాటికి సంబంధించిన ఫైళ్లు తయారు చేయడం వరకే పాలన పరిమితమయ్యేదని మోదీ విమర్శించారు. తమ ప్రభుత్వం గత 12 ఏళ్లలో పేదలకు సాధికారత కల్పించేలా విధానాల్లో సమూల మార్పులు తీసుకొచ్చిందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రపంచ బ్యాంకు నివేదికను ప్రస్తావిస్తూ.. గత 12–13 ఏళ్లలో దేశంలో సుమారు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడించారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని వివరించారు.

సాంకేతిక రంగంలో భారత్ దూకుడు

ఎడ్లబండ్ల ప్రయాణం నుంచి బుల్లెట్ రైళ్ల వరకు, ఉత్తరాల నుంచి సోషల్ మీడియా సందేశాల వరకు భారత్‌లో గణనీయమైన పరివర్తన చోటుచేసుకుందని ప్రధాని వివరించారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ దేశం కొత్త శిఖరాలను అధిరోహిస్తోందన్నారు. ముఖ్యంగా సెమీకండక్టర్ మిషన్ వంటి కీలక రంగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతికి ఐఐటీ ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థుల సహకారం ఎంతో ఉందని అభినందించారు. పరిశోధన, ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధిలో యువత మరింత చురుగ్గా భాగస్వాములు కావాలని సూచించారు.

సమరయోధుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

పశ్చిమ బెంగాల్ ఎన్నో గొప్ప ఆలోచనలకు బలాన్నిచ్చిన నేల అని, జాతీయ ఉద్యమాలకు రూపునిచ్చిన గడ్డ అని మోదీ కొనియాడారు. ఒకప్పుడు స్వాతంత్ర్య సమరయోధుల కోసం నిర్బంధ శిబిరం ఉన్న ప్రదేశంలోనే నేడు ఐఐటీ ఖరగ్‌పూర్ ఏర్పాటైందని గుర్తుచేశారు. ఈ చారిత్రక నేపథ్యాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలని, ఆనాటి స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలు, ఆలోచనలు, త్యాగాల నుంచి స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. దేశం కోసం పనిచేయాలనే తపన ప్రతి విద్యార్థిలో ఉండాలని ఆకాంక్షించారు.

వికసిత్ భారత్‌లో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక భూమిక

ఐఐటీ ఖరగ్‌పూర్ తన 75 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిందని ప్రధాని పేర్కొన్నారు. భారత్ వికసిత్ భారత్ లక్ష్యం వైపు అడుగులు వేస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థకు ఉన్న 75 ఏళ్ల అనుభవం దేశ అభివృద్ధికి, ఆవిష్కరణలకు ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్య, పరిశోధన, సాంకేతిక పురోగతి రంగాల్లో ఐఐటీ ఖరగ్‌పూర్ అందిస్తున్న సేవలు దేశ ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలకమని అన్నారు.

నేషన్ ఫస్ట్‌తో ముందుకు సాగాలి

రాబోయే 20 ఏళ్లు భారతదేశ భవిష్యత్తును నిర్ణయించే అత్యంత కీలకమైన కాలమని మోదీ పేర్కొన్నారు. ఈ కాలంలో యువత తమ ప్రతిభ, ఆలోచనలు, ఆవిష్కరణలతో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. వ్యక్తిగత లక్ష్యాల కంటే జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ 'నేషన్ ఫస్ట్' అనే మంత్రంతో ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

ఏరోస్పేస్ రంగంలో మరో భారీ పెట్టుబడి!

ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు వేగంగా అనుమతులు కల్పించే ప్రభుత్వ విధానాలు తెలంగాణకు ప్రధాన బలమని వివరించారు. సఫ్రాన్ ప్రతినిధులతో జరిగిన సమావేశం ఎంతో ఫలప్రదంగా సాగిందని, డిసెంబర్‌లో జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు పారిస్ నుంచి సంస్థ ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించినట్లు తెలిపారు.
హైదరాబాద్‌లో సఫ్రాన్ ఇప్పటికే లీప్ విమాన ఇంజిన్లకు అవసరమైన రొటేటింగ్ పార్ట్స్ తయారీ కేంద్రం, సఫ్రాన్ ఎలక్ట్రికల్ అండ్ పవర్ తయారీ యూనిట్‌తో పాటు విమాన ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతుల కోసం ప్రపంచంలోనే అతిపెద్ద కేంద్రాల్లో ఒకటైన లీప్ ఎంఆర్ఓ సదుపాయాన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో తన తయారీ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు సంస్థ ఆసక్తి చూపుతోంది. సఫ్రాన్ సంస్థ అంతర్జాతీయ కార్యకలాపాలు, పౌర, సైనిక విమానాల ఇంజిన్ల రూపకల్పన, తయారీ, నిర్వహణ విధానాలను ఉప ముఖ్యమంత్రికి సంస్థ ప్రతినిధులు వివరించారు. అనంతరం తయారీ విభాగాన్ని సందర్శించిన భట్టి విక్రమార్క విమాన ఇంజిన్ల విడిభాగాల తయారీ, అసెంబ్లీ ప్రక్రియలను పరిశీలించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత కచ్చితత్వంతో కూడిన విడిభాగాలను తయారు చేస్తున్న విధానాలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ పర్యటనలో డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, సఫ్రాన్ సంస్థ ఇండస్ట్రియల్ అండ్ సప్లై చైన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లారెంట్ మజౌ, ఇండస్ట్రియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ రొటేటింగ్ పార్ట్స్ డైరెక్టర్ జూలియన్ డి'ఒరాజియో తదితరులు పాల్గొన్నారు. రూ.4,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనను ఖరారు చేసేందుకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ సఫ్రాన్ సంస్థ ప్రతినిధులతో తదుపరి సంప్రదింపులు కొనసాగించనుంది.

అయ్యప్ప భక్తులకు భారీ ఊరట

శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి విమానాల్లో వెళ్లే భక్తులకు కేంద్ర ప్రభుత్వం మరోసారి తీపికబురు అందించింది. భక్తులు తమ వెంట తీసుకెళ్లే పవిత్రమైన 'ఇరుముడి కట్టు'ను విమానంలోని క్యాబిన్‌లో అనుమతించే వెసులుబాటును వరుసగా మూడో ఏడాది కూడా కొనసాగిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. ఈ మేరకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల కాపీని ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు.

భక్తుల విశ్వాసాలకు పెద్దపీట వేసిన కేంద్రం

"స్వామియే శరణం అయ్యప్ప!" అంటూ తన పోస్ట్ ప్రారంభించిన మంత్రి రామ్మోహన్ నాయుడు.. శబరిమల యాత్రికులు పవిత్ర ఇరుముడిని తమ వెంట తీసుకెళ్లడం శతాబ్దాలుగా వస్తున్న భక్తి సంప్రదాయమని పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, వరుసగా మూడో సంవత్సరం కూడా విమాన క్యాబిన్‌లో ఇరుముడిని తీసుకెళ్లేందుకు అనుమతులు కొనసాగిస్తున్నామని తెలియజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. యాత్రకు సిద్ధమవుతున్న ప్రతి ఒక్కరిపై ఆ అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

బీసీఏఎస్, సీఐఎస్ఎఫ్ అధికారులకు కీలక ఆదేశాలు

విమానాశ్రయాల్లో సెక్యూరిటీ తనిఖీల సమయంలో అయ్యప్ప భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పౌర విమానయాన మంత్రిత్వ శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ పద్మ అగ్నిహోత్రి పేరుతో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ డైరెక్టర్ జనరల్‌కు అధికారిక లేఖ పంపారు.
బీసీఏఎస్ పంపిన లేఖను ప్రస్తావిస్తూ.. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాంతీయ కార్యాలయాలు, సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది, అలాగే ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, జాయింట్ వెంచర్/పీపీపీ విమానాశ్రయ నిర్వాహకులకు వెంటనే తగిన సూచనలు జారీ చేయాలని కేంద్రం ఆదేశించింది.

నిబంధనలు యథాతథం.. భక్తులకు తప్పిన ఇబ్బందులు

నిషేధిత వస్తువుల నిర్వహణకు సంబంధించి గత ఏడాది నవంబర్ 28, 2025న జారీ చేసిన 'AvSec ఆర్డర్ నం. 11/2024'కు సంబంధించిన 'అదెండమ్-I' నిబంధనలు ప్రస్తుతం అమల్లో ఉన్నాయని, వాటిని యథాతథంగా పాటించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. సాధారణంగా విమాన క్యాబిన్ బ్యాగేజీలో కొబ్బరికాయ, నెయ్యి వంటి వస్తువులపై ఆంక్షలు ఉంటాయి. అయితే ఈ ప్రత్యేక మినహాయింపు కొనసాగడం వల్ల తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా శబరిమల వెళ్లే లక్షలాది మంది అయ్యప్ప భక్తులు తమ ఇరుముడిని చెక్-ఇన్ లగేజీలో కాకుండా, అత్యంత భక్తిశ్రద్ధలతో తమ చేతిలోనే విమాన క్యాబిన్‌లో తీసుకెళ్లే వీలు కలిగింది.

ఫెడ్ వడ్డీరేట్లతో అమెరికా ఆర్థిక వ్యవస్థకు నష్టం

న్యూఢిల్లీ, నవంబర్ 21 (సింగిడి)

అమెరికా ఫెడరల్ రిజర్వ్ (ఫెడ్) అనుసరిస్తున్న వడ్డీరేట్ల విధానంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అధిక వడ్డీరేట్ల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని ఆరోపించారు. ఫెడ్ రాజకీయ ధోరణితో వ్యవహరిస్తోందని, ఆర్థికంగా బలంగా ఉన్న సమయంలోనూ వడ్డీరేట్లను తగ్గించకపోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. భారత్‌లో వడ్డీరేట్లు తక్కువగా ఉన్నప్పటికీ జీడీపీ వృద్ధి సుమారు 7 శాతంగా నమోదవుతోందని ప్రస్తావించారు. అమెరికాలోనూ వడ్డీరేట్లు తగ్గిస్తే ఆర్థిక వృద్ధి మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రపంచ దేశాల్లోనే అమెరికాలో వడ్డీరేట్లు అత్యంత తక్కువగా ఉండాలని ఆకాంక్షించారు.

ఫెడ్ విధానాలపై అసంతృప్తి

ఫెడరల్ రిజర్వ్ వ్యవహారశైలిపై ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉన్నప్పుడు, దేశ పరపతి పెరుగుతున్నప్పుడు వడ్డీరేట్లను తగ్గించాల్సి ఉంటుందని అన్నారు. అయితే ఫెడ్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అధిక వడ్డీరేట్ల వల్లే అమెరికా ఆర్థిక వృద్ధి మందగిస్తోందని, ఇది దేశ ఆర్థిక భవిష్యత్తుకు నష్టం కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. ఫెడ్ వడ్డీరేట్లను తగ్గిస్తే అమెరికా జీడీపీ వృద్ధి 15 నుంచి 20 శాతానికి చేరుకునే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. తద్వారా దేశ అప్పులను కూడా వేగంగా తీర్చవచ్చని పేర్కొన్నారు.

భారత్‌ను ఉదాహరణగా చూపిన ట్రంప్

భారత్‌లో వడ్డీరేట్లు తక్కువగా ఉన్నప్పటికీ ఆర్థిక వృద్ధి మెరుగ్గా కొనసాగుతోందని ట్రంప్ ప్రస్తావించారు. భారత జీడీపీ వృద్ధి సుమారు 7 శాతంగా ఉందని పేర్కొంటూ.. అమెరికా కూడా ఇదే తరహాలో తక్కువ వడ్డీరేట్ల విధానాన్ని అనుసరించాలని అభిప్రాయపడ్డారు. కొన్ని దేశాలు అమెరికా సహకారం, ఆర్థిక వ్యవస్థ వల్లే ఉన్నత స్థాయికి చేరుకున్నాయని వ్యాఖ్యానించారు. అందువల్ల అమెరికాలోనే అత్యంత తక్కువ వడ్డీరేట్లు ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

ఫెడ్, ఆర్‌బీఐ నిర్ణయాలపై చర్చ

అమెరికాలో ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో ఈ ఏడాది సెప్టెంబరులో ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు కథనంలో పేర్కొన్నారు. 2023 తర్వాత వడ్డీరేట్ల పెంపు ఇదే తొలిసారని వివరించారు. డిసెంబరులోనూ మరోసారి వడ్డీరేట్ల పెంపు ఉండవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. మరోవైపు భారత్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అక్టోబరులో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు (0.25 శాతం) పెంచింది. ఈ నేపథ్యంలో భారత్, అమెరికా కేంద్ర బ్యాంకుల వడ్డీరేట్ల విధానాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

వచ్చే ఎన్నికల్లో మళ్లీ గోల్ కొడతాం

ఎన్‌డీఎస్ఏ సూచనలు, నిపుణుల నివేదికల ఆధారంగానే కాళేశ్వరానికి మరమ్మతులు చేపడుతున్నామని చెప్పారు. శనివారం తనను కలిసిన కొంతమంది మీడియా మిత్రులతో చిట్‌చాట్ సందర్భంగా ఆయన మాట్లాడారు.

కేసీఆరే సమాధానం చెప్పాలి

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, లోప భూయిష్టమైన డిజైన్లు, నిర్మాణంలో పాటించని సాంకేతిక ప్రమాణాలే ప్రధాన కారణమని ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన పునాది భద్రత విషయంలో శాస్త్రీయ ప్రమాణాలను పక్కనపెట్టి, డీపీఆర్‌లో పేర్కొన్న నిర్మాణ విధానానికి భిన్నంగా సీకెంట్ పైల్ విధానాన్ని ఎందుకు ఎంచుకున్నారో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.డీపీఆర్‌లో డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని ప్రతిపాదించి, ఆ తర్వాత క్షేత్రస్థాయిలో సీకెంట్ పైల్ కట్‌ఆఫ్ విధానాన్ని అనుసరించడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని మంత్రి ప్రశ్నించారు. ఇంతటి భారీ ప్రాజెక్టులో నిర్మాణ పద్ధతులను మార్చే ముందు సమగ్ర భూగర్భ పరిశోధనలు, సాంకేతిక అధ్యయనాలు, నిపుణుల అభిప్రాయాలు తీసుకోవాల్సి ఉండగా, అప్పటి ప్రభుత్వం వాటిని ఏ మేరకు పాటించిందో ప్రజలకు వివరించాలన్నారు.డయాఫ్రమ్ వాల్, సీకెంట్ పైల్ రెండూ భూగర్భంలో నీటి ప్రవాహాన్ని నియంత్రించడానికి, పునాదుల భద్రతకు ఉపయోగించే ఇంజినీరింగ్ నిర్మాణ విధానాలే. అయితే వాటి నిర్మాణ పద్ధతుల్లో గణనీయమైన తేడా ఉందని మంత్రి తెలిపారు. కానీ మేడిగడ్డ విషయంలో సీకెంట్ పైల్స్ నిర్మాణంలో నాణ్యతా నియంత్రణ, పునాది భద్రతకు సంబంధించిన లోపాలు వెలుగులోకి వచ్చాయని మంత్రి పేర్కొన్నారు. దేశంలో ఏ బ్యారేజ్ నిర్మాణం కూడా ఈనాటి వరకు సీకెంట్ పైల్ పద్ధతిలో నిర్మించలేదని స్పష్టం చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ప్రకారం మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడానికి ప్రణాళిక, డిజైన్, నిర్మాణ నాణ్యత, నిర్వహణలోని లోపాలు సమష్టిగా కారణమయ్యాయని మంత్రి వివరించారు. బ్యారేజీ పునాది కింద ఉన్న ఇసుక తరలిపోవడం, పునాదికి తగినంత బేరింగ్ సామర్థ్యం లేకపోవడం, అప్‌స్ట్రీమ్ సీకెంట్ పైల్స్‌పై బ్యారేజీ భారం ప్రభావం చూపడం వంటి అంశాలను ఎన్‌డీఎస్ఏ గుర్తించిందని తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో ఒకే తరహా డిజైన్, నిర్మాణ విధానాలు అనుసరించారని మంత్రి తెలిపారు. మేడిగడ్డలో ఎదురైన సమస్యలు మిగతా రెండు బ్యారేజీలకూ తలెత్తే ప్రమాదం ఉందని ఎన్‌డీఎస్ఏ హెచ్చరించిందన్నారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి బదులుగా సీకెంట్ పైల్ విధానాన్ని ఎంచుకోవడానికి ఉన్న సాంకేతిక ప్రాతిపదిక ఏమిటి? ఈ మార్పులకు ఎవరు అనుమతించారు? నిపుణుల కమిటీలు ఏం సూచించాయి? నిర్మాణ సంస్థలకు ఈ ప్రత్యేక విధానంలో ఎంతటి అనుభవం ఉంది? నాణ్యతా ప్రమాణాలను ఎవరు పర్యవేక్షించారు? అనే ప్రశ్నలకు అప్పటి పాలకులు సమాధానం చెప్పాలన్నారు.

సామాన్య కార్యకర్తలు.. మహిళలకు

పదవుల్లో అధిక ప్రాధాన్యం

రాజకీయాల్లో డబ్బిస్తే ఓటేస్తారనే భావన పోయిందని, ఇటీవల ఒక ఓటరు అభ్యర్థి ఇచ్చిన డబ్బును ఏకంగా బ్యాలెట్ బాక్సులోనే వేసి తిరస్కరించడం ప్రజల చైతన్యానికి



ఏఎస్ఐలకు ఎస్సైలుగా పదోన్నతులు

వరంగల్ క్రైమ్ ప్రతినిధి నవంబర్ 21 (సింగిడి)

అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లుగా (ఏఎస్ఐలు) విధులు నిర్వహిస్తూ, సబ్-ఇన్స్పెక్టర్లుగా (ఎస్ఐలు) పదోన్నతి పొందిన అధికారులు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పదోన్నతి పొందిన వారిలో టి.కమల, ఎం.రాజేందర్, ఏ.సగాయమ్మ, వై.కాసులు, కె.పద్మ, ఎస్.లక్ష్మి , కె.సంతోష, సి. హెచ్.పద్మ ఉన్నారు. సీపీ నూతనంగా పదోన్నతి పొందిన ఎస్ఐలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో వ్యవహరిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

భవన నిర్మాణ నిబంధనలు పాటించాల్సిందే



హనుమకొండ ప్రతినిధి నవంబర్ 21 (సింగిడి)

భవన నిర్మాణ నిబంధనలను పక్కాగా పాటించిన వాటికే అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేస్తామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న స్పష్టం చేశారు. శనివారం ఫాతిమా నగర్, డి-మార్ట్ (కాజీపేట), ఎక్సైజ్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ కోసం నిర్మాత భవనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవన నిర్మాణ అనుమతుల కోసం అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని, మున్సిపల్ చట్ట నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ పరిశీలనలో సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రశాంత్, టీపీఎస్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపెండ్యాల పీఏసీఎస్ కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ రవి



హనుమకొండ ప్రతినిధి నవంబర్ 21 (సింగిడి)

ధర్మసాగర్ మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రవి శనివారం తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు కల్పిస్తున్న సదుపాయాలు, సంబంధిత నిర్వహణ రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ రవి అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తోట నాగరాజు, తహసీల్దార్ భావ్ సింగ్, సివిల్ సప్లై డీటీ భద్రు నాయక్, ఏఈఓ సరిత, సీఓ రాజిరెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలో విద్యార్థి ఎన్నికల నిర్వహణ



సిద్దిపేట, నవంబర్ 21 (సింగిడి)

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం, ఇబ్రహీం నగర్, లోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల, విద్యార్థులలో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు పాఠశాల స్థాయి విద్యార్థి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలు సందర్భంగా విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యత ఎన్నికల విధానం పోలింగ్ ప్రక్రియ ఓటు రహస్యత వంటి అంశాలను వివరించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ అధికారులు విద్యార్థులకు ఎన్నికల విధానాన్ని వివరించి, ఓటింగ్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించారు. ఓటు వేసిన విద్యార్థులకు వేలిపై సిరా గుర్తు పెట్టి ఓటు హక్కు వినియోగించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెరగడంతోపాటు, బాధ్యతమైన పౌరులుగా ఎదగడానికి, నాయకత్వ లక్షణాలు, పెంపొందించుకోవడానికి ఎంతో దోహదపడుతుందని స్థానిక ప్రిన్సిపాల్ పి. సతీష్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశ్రీలత, చంద్రశేఖర్, రజిని, శ్రీకాంత్, సంతోష్, విజయ భాస్కరాచారి, మంజుల, స్వాతి, రిజ్వాన బేగం, దివ్య, అనిత, ప్రవీణ్, కొమురయ్య, లింగమూర్తి , నాగేశ్వర్, శ్రీనివాస్, రాజు, శ్రీవిద్య, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

యాచారం–మంచిప్ప రహదారిపై పులి సంచారం

ప్రయాణికుల్లో ఆందోళన!..దట్టమైన అటవీ ప్రాంతంలో వన్యప్రాణి కదలికలు
రాత్రివేళ ప్రయాణాలపై భయాందోళనలు.. పులి సంచారంపై అప్రమత్తమైన అటవీశాఖ.. ప్రజల భద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి

కామారెడ్డి గాంధారి,
నవంబర్ 21 (సింగిడి):

సదాశివనగర్ మండలంలోని యాచారం–మంచిప్ప ప్రధాన రహదారిపై పులి సంచారం స్థానికంగా కలకలం రేపుతోంది. ఇటీవల ఈ మార్గంలో పులి కనిపించిందన్న సమాచారంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికుల్లో ఆందోళన నెలకొంది. దట్టమైన అటవీ ప్రాంతం గుండా వెళ్లే ఈ రహదారిపై వన్యప్రాణుల కదలికలు ప్రజలను అప్రమత్తం చేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్న పరిస్థితి కనిపిస్తోంది.రాత్రి ప్రయాణాలంటేనే భయం!యాచారం–మంచిప్ప రహదారి అటవీ ప్రాంతం గుండా సాగుతుండటంతో ఈ మార్గంలో నిత్యం వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. గ్రామాల మధ్య రాకపోకలు సాగించే ప్రజలు, ఉద్యోగులు, రైతులు, అత్యవసర పనులపై వెళ్లేవారు ఈ రహదారిపైనే ఆధారపడుతున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో పులి సంచారం వెలుగులోకి రావడంతో రాత్రివేళల్లో ప్రయాణించే వారు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఒంటరిగా ప్రయాణించే వారు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పులి ఎక్కడ సంచరిస్తుందో, ఎప్పుడు రహదారిపైకి వస్తుందో తెలియక ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.ప్రజల భద్రతపై అటవీ శాఖ దృష్టి సారించాలిపులి సంచారంపై అటవీశాఖ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. రహదారి పరిసరాల్లో పులి కదలికలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలతో పర్యవేక్షణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని కోరుతున్నారు. పులి సంచారం నిర్ధారణ అయితే ప్రజలకు ఎలాంటి ప్రమాదం కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులకు సహాయం అందించే ఏర్పాట్లు చేయాలని స్థానికులు సూచిస్తున్నారు. అదే సమయంలో వన్యప్రాణులకు ఎలాంటి హాని కలగకుండా, వాటి సహజ ఆవాసాలకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.రాకపోకలకు ఇబ్బందులు.. అధికారుల స్పందన కోసం ఎదురుచూపులుఈ రహదారిపై పులి సంచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే పులి కదలికలకు సంబంధించి అటవీశాఖ అధికారుల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. పులి సంచారం నిజమేనా? ఏ ప్రాంతంలో కదలికలు గుర్తించారు? ప్రజల భద్రత కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకుండా అటవీశాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, పులి సంచారం గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని స్థానికులు కోరుతున్నారు.ప్రయాణికులకు సూచనలుయాచారం–మంచిప్ప రహదారిపై



ప్రయాణించే వారు అప్రమత్తంగా ఉండాలి. పులి కనిపించినట్లయితే దాని దగ్గరకు వెళ్లడం, ఫొటోలు లేదా వీడియోలు తీసేందుకు ప్రయత్నించడం చేయకూడదు. పులిని రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా సురక్షిత దూరంలో ఉండాలి. పులి కదలికలు కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలి.

అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేయాలి

సిద్దిపేట, నవంబర్ 21 (సింగిడి)





సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో శనివారం జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల పై ఎంపిడిఓ, ఎంపీఓ, ఏపిఓ, ఏపిఎం, హౌసింగ్ ఏఈలతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష నిర్వహించారు. జెడ్పీ సిఈఓ రమేష్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, హౌసింగ్ పి డి భగవంత్ రావు, డిపిఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకానికి సంబంధించి జాబ్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పురోగతిని పరిశీలించిన, వెరిఫికేషన్‌లో వెనుకబడిన మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను సకాలంలో పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న జాబ్ కార్డుల వెరిఫికేషన్‌ను ప్రాధాన్యతగా తీసుకొని నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని నీరు పేద ప్రజలకు స్వంత ఇంటి కల నెరవేర్చడం కోసం ఈ పథకం అమలు చేస్తుందని తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతి ఆశించిన స్థాయిలో లేదని అసహనం వ్యక్తం చేశారు. మంజూరైన ప్రతీ ఇల్లు మార్కింగ్ చేయాలని, రోజువారీగా ఒక టార్గెట్ పెట్టుకుని పూర్తి చేయాలని, జిల్లాలో లబ్ధిదారులు గృహాలు బేస్ మెంట్, గోడలు, స్లాబ్, ప్లాస్టింగ్, ఫినిషింగ్ స్థాయి ఎన్ని, ఎంత మందికి ఏ ఏ స్థాయిలో పే మెంట్ వచ్చింది. ఎన్ని పెండింగ్ లో ఉన్నాయనీ సమీక్షిస్తూ వంద శాతం గ్రౌండింగ్ చేసి ప్రతీ ఒక్క లబ్ధిదారుడు మంచి నాణ్యతతో వేగంగా ఇళ్లు నిర్మించుకునేలా పని చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ గృహాల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని, ఇందిరమ్మ గృహాల నిర్మాణాల్లో రాష్ట్రంలో జిల్లాను ముందు వరుసలో నిలిచేలా పని చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు 50 కేజీల సిమెంట్ బస్తా 230 రూపాయలకే అందించాలని నిర్ణయించిందని, గ్రామాల్లో అధికారులు లబ్ధిదారులు వివరాలను యాప్ లో నమోదు చేస్తే సిమెంట్ బస్తాను 230 రూపాయలకే లభిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఇందిరమ్మ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జిల్లాలో వివిజి రామ్ జి పథకం కింద చేపడుతున్న పనులు, కూలీల హాజరు మరియు రోజువారీ పనుల పురోగతిపై సమీక్షించారు. నేటికి జిల్లాలోని 26 మండలాల పరిధిలో గ్రామ పంచాయతీలలో 1,88,054 మంది యాక్టివ్ వేజ్ సీకర్స్ ఉన్నారు. వీరిలో 39,702 మంది కూలీలు పనుల కోసం డిమాండ్ నమోదు చేసుకున్నారు. 21,580 మంది కూలీల హాజరు నమోదు చేశారు. పనుల అమలులో మరింత పురోగతి సాధించాలని, గ్రామ పంచాయతీల వారీగా కూలీలకు పని కల్పన, హాజరు నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతీ గ్రామ పంచాయతీలో పనులు సక్రమంగా నిర్వహించేలా, కూలీలకు పని కల్పించడంలో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. "జలసిరి" కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత, పొలానికి పంటకుంట, గ్రామానికి నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం ముగిసిందని ఎవ్వరు కూడా అలసత్వం ప్రదర్శించవద్దని, ఇచ్చిన టార్గెట్ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి. ఎల్ నీ నో ప్రభావం వల్ల పంటలు పండించడానికి నీరు లేనటువంటి రైతులు, కూలీలకు ఈ జలసిరి లో చేపట్టిన పనుల ద్వారా వారికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. నీటి సంరక్షణ పనులను మండలం వారిగా ఒక ప్రణాళిక ప్రకారం ప్రతీ గ్రామంలో రైతులను, ప్రజాప్రతినిధులను, అధికారులందరూ సమన్వయ పరిచి ఇచ్చిన లక్ష్యాన్ని తప్పనిసరిగా చేరుకోవాలని ఆదేశించారు.

10 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి

మానకొండూర్, నవంబర్21(సింగిడి)



మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి లవుడ్యా చమాన్ లాల్ రూ.10 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డాడు.ఫిర్యాదుదారుడి కోడలికి వితంతు పెన్షన్ మంజూరు చేయించేందుకు కార్యదర్శి రూ.10 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఫిర్యాదుదారుడి ఇంట్లో డబ్బులు తీసుకుంటుండగా ఏసిబి అధికారులు వలపన్ని పట్టుకున్నారు.అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు నిర్భయంగా ఏసిబి టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

ముత్తారంలో జీవిత బీమా పథకం ప్రారంభం

మానకొండూర్, నవంబర్21(సింగిడి)



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముత్తారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మారావేణి రాజయ్య ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఐక్యతతోనే ఆర్థిక అభివృద్ధి సాధ్యం

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 21 (సింగిడి) :

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పెద్దపల్లి పట్టణంలోని 18వ వార్డు తెనుగువాడలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరతరాలుగా చేపల వేటనే వృత్తిగా మలుచుకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారుల శ్రమకు సమాజంలో తగిన గుర్తింపు రావాల్సిన అవసరం ఉందన్నారు. మత్స్యకారుల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని, సంఘటితంగా ఉన్నప్పుడే సమాజంలో గౌరవం, అభివృద్ధి సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. మత్స్యకారుల సంక్షేమం, ఆర్థిక పురోగతితో పాటు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు.ఈ వేడుకల్లో గంగుల సంతోష్, మౌటం నర్సింగం, భూతగడ్డ తిరుపతి, భూతగడ్డ సారయ్య, కొలిపాక లక్ష్మణ్, వేల్పుల రాజేశం, మౌటం శంకర్, ఆశాలు, వేల్పుల కనుకయ్య, వేల్పుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రైతుదే.. ధర నిర్ణయం దళారులదేనా?

కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల పడిగాపులు.. లింగంపేటలో రైతులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మద్దతు ధర ఎప్పుడు అందిస్తారు? రైతుల కన్నీళ్లు తుడిచేది ఎవరు? ప్రభుత్వ చిత్తశుద్ధిపై ప్రశ్నలు

కామారెడ్డి ప్రతినిధి:
నవంబర్ 21 (సింగిడి)



ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే సమయంలోనూ అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. పెట్టుబడులు పెట్టి, అప్పులు చేసి, కుటుంబ సభ్యుల శ్రమను ధారపోసి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే అక్కడ కూడా రైతులకు ఆశించిన భరోసా లభించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో రైతులకు ఆ ధర అందుతోందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట మండలంలో ధాన్యం కల్లాల వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులు, వారి ఆవేదన మరోసారి తెరపైకి వచ్చాయి. రైతుల కష్టాలను తెలుసుకునేందుకు నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ధాన్యం కల్లాల వద్దకు వెళ్లి రైతులను పరామర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లింగంపేటలో రైతుల కన్నీటి గాథధాన్యం విక్రయించేందుకు ఎదురుచూస్తున్న రైతులను జాజాల సురేందర్ కల్లాల వద్ద కలుసుకుని మాట్లాడారు. పంట పండించేందుకు చేసిన అప్పులు, పెట్టుబడులు, కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురవుతున్న ఇబ్బందులను రైతులు ఆయనకు వివరించారు. పంట చేతికొచ్చిన ఆనందం కంటే దాన్ని అమ్ముకుని అప్పులు తీర్చుకోవాలనే ఆందోళనే ఎక్కువగా ఉందని రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న జాప్యాలు, తూకం, తేమ శాతం, నాణ్యత పరీక్షలు, రవాణా ఖర్చులు వంటి సమస్యలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయనే ఆవేదన వ్యక్తమవుతోంది. పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన తర్వాత కూడా ఎప్పుడు విక్రయమవుతుందో, ఎప్పుడు డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయో తెలియని పరిస్థితి రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. మద్దతు ధర ఎప్పుడు అందిస్తారని ప్రభుత్వంపై ప్రశ్నలు సంధించారు. రైతులు ఇన్ని కష్టాలు పడుతూ పంట పండిస్తుంటే వారికి సరైన మద్దతు ధర కల్పించడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. రైతులు ధాన్యం కల్లాల వద్ద పడిగాపులు కాస్తూ కన్నీరు మున్నీరవుతున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి, ప్రకటించిన మద్దతు ధరను అందించాలని కోరారు.



విద్యుత్ లైన్లకు తగిలి గడ్డి కట్టలు దగ్ధం

కామారెడ్డిప్రతినిధి నవంబర్ 21(సింగిడి)

కామారెడ్డి జిల్లా గాంధారి మండలం మత్తు సంగేం గ్రామంలో విద్యుత్ లైన్లకు తగిలి గడ్డి కట్టలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.50 వేల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు చిన్నోళ్ల సాయిలు ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలో వ్యవసాయ పొలాల మీదుగా వెళ్తున్న 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ లైన్లు కిందకు వేలాడుతుండటంతో ఈ ప్రమాదం జరిగినట్లు రైతు తెలిపారు. విద్యుత్ తీగలు తగలడంతో గడ్డి కట్టలు పూర్తిగా కాలిపోయాయని, దీంతో తీవ్రంగా నష్టపోయానని ఆయన వాపోయారు.అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదనవ్యవసాయ పొలాల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ లైన్ల సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ స్పందించలేదని రైతు ఆరోపించారు. లూజ్ లైన్లకు మధ్యలో ఇంటర్ పోల్స్ ఏర్పాటు చేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు.ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వ్యవసాయ పొలాల్లో ప్రమాదకరంగా వేలాడుతున్న 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ లైన్లకు అవసరమైన చోట అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. మరోసారి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రాణనష్టం సంభవించకముందే సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.రైతుకు జరిగిన నష్టానికి తగిన పరిహారం అందించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

మాదిగ హక్కుల కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలి

సిద్దిపేట, నవంబర్ 21 (సింగిడి)



మాదిగ హక్కుల సాధన కోసం మరో పోరాటానికి జాతి సిద్ధం కావాలని, పార్టీలకతీతంగా మాదిగ నాయకులంతా ఉద్యమంలో ముందుండాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు.శనివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, అంబేద్కర్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ప్రకటించిన ఇందిరమ్మ బీమా పథకాన్ని స్వాగతిస్తూ, పేదలకు ప్రయోజనం చేకూర్చే ఈ పథకాన్ని తీసుకొచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కమిటీలను పటిష్టంగా నిర్మించి, గ్రామస్థాయి వరకు సంఘాన్ని విస్తరించి ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని నాయకులు తెలిపారు. మాదిగ హక్కుల సాధన కోసం మరో పోరాటానికి సమాయత్తమవుతామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుకటి జనార్దన్ మాదిగ, కవ్వంపల్లి రవి మాదిగ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాతరి రోజా రాణి మాదిగ, నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు ఆదరి సరిత మాదిగ, జిల్లా నాయకులు నల్ల నరేందర్ మాదిగ, సప్పిడి పోచయ్య మాదిగ, బండారి అశోక్ మాదిగ, తాటిపల్లి బాబు మాదిగ, ప్రభాకర్ మాదిగ, శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఎడిటోరియల్

Editorial

బాధ్యత గల భారతీయ యువత నిర్మాణంలో ఎన్‌సిసి కృషి

(22 నవంబర్ "ఎన్‌సిసి దినోత్సవం" సందర్భంగా)



హెచ్. ఎన్. కుంజ్రూ కమిటీ సిపార్సుల ఆధారంగా 15 జూలై 1948న పార్లమెంట్‌లో 31వ చట్టం ద్వారా 38,500 యువ కెడెట్లతో ప్రారంభమైన నేషనల్ కెడెట్ కోర్స్(ఎన్‌సిసి) లేదా జాతీయ యువసైనిక దళం గత 76 ఏండ్లుగా నేడు 20 లక్షల మంది యువతకు ఎన్‌సిసి శిక్షణనిస్తూ దేశ యువతను సుశిక్షితులను చేయడంలో ఘన విజయాలు నమోదు చేసుకుంటూ నేడు 22 నవంబర్ 2026న (నవంబర్ నాలుగవ ఆదివారం రోజున) 78వ "ఎన్‌సిసి దినోత్సవాన్ని" ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నది. ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన యువభారతంలో నేటి యువతకు అవసరమైన క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, నిస్వార్థ సేవానిరతి, దేహదారుఢ్యం, సార్వ్రక్రీడల స్ఫూర్తి పెంపొందించడం, యువతను త్రివిధ దళాల పట్ల ఆకర్షించడం, మానసిక వికాసం, బాధ్యతగల పౌరుల నిర్మాణం లాంటి ఉత్తమ గుణాలు అలవడే విధంగా నిర్దిష్టమైన కార్యాచరణ అమలు చేస్తూ నేడు ప్రపంచంలోనే అతి పెద్ద యూనిఫామ్ ధరించే యువశక్తిగా ఎన్‌సిసి అందరి మన్ననలు పొందడం హర్షదాయకం. "ఏకత – క్రమశిక్షణ" లేదా "యునిటీ అండ్ డిసిప్లైన్" అనే నినాదంలో ముందుకు సాగుతున్న ఎన్‌సిసిలో ఆర్మీ, నావీ, ఏయిర్ ఫోర్స్ అనే త్రివిధ యువదళాలు ఉన్నాయి.

ఎన్‌సిసి మహోన్నత లక్ష్యాలు:

ప్రతి ఏట నవంబర్ మాసం నాలుగవ ఆదివారం రోజున, అనగా 22 నవంబర్ 2026న దేశవ్యాప్తంగా 78వ జాతీయ యువ సైనిక దళం దినోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ఎన్‌సిసి శిక్షణ, పాఠ్యాంశాల్లో త్రివిధ దళాల పరిచయం, దేశ మిలటరీ చరిత్ర, యుద్ధ నైపుణ్యాలు, దేశ సమగ్రత, ఆయుధాల శిక్షణ, సాయుధ కవాతులు, జాతీయ సమైక్యత ప్రాధాన్యం, మత సామరస్యం, లౌకిక వాదం, పర్యావరణ పరిరక్షణ, ప్రథమ చికిత్స, యుద్ధనీతి లాంటి అనేక అంశాల్లో బోధనతో పాటు శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతుంది. శిక్షణ పొందిన యువతకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ ఏ, బి, సి అనే పత్రాలను అందజేస్తారు.

ఈ సర్టిఫికెట్లు పొందిన యువతకు పలు ప్రభుత్వరంగ సంస్థలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో శిక్షణలు కల్పిస్తారు.

ఎన్‌సిసి విస్తరణ:

ఢిల్లీ ప్రధాన కేంద్రంగా సేవలందిస్తున్న ఎన్‌సిసిలో దేశవ్యాప్తంగా 17 డైరెక్టరేట్లు, 96 ఎన్‌సిసి గ్రూపులు, 684 ఆర్మీ యూనిట్లు, 69 నావల్ యూనిట్లు, 61 ఎయిర్‌ఫోర్స్ యూనిట్ల ద్వారా పాఠశాల (8,9,10 తరగతులు), కళాశాల(11, 12, డిగ్రీ, పిజీ)లకు చెందిన ఎంపిక చేసిన విద్యార్థినీవిద్యార్థులకు శిక్షణ సేవలను అందుతున్నాయి. ఆర్మీ యువతకు ఖాకీ, నావల్ కెడెట్లకు తెలుపు, ఏయిర్‌ఫోర్స్ కెడెట్లకు స్కై బ్లూ రంగు యూనిఫామ్ డ్రస్సులు ఉంటాయి. శిక్షణలో భాగంగా విద్యాలయాల్లో తరగతులు/కవాతులు, శిబిరాల ద్వారా ఆయుధ శిక్షణలు, యూత్ ఎక్సఛేంజ్ పథకాలు లాంటి పలు అంశాలు అమలు పరుస్తారు. నేడు కేంద్ర ప్రభుత్వం చొరవతో గతంలో 14 లక్షల కెడెట్ల నుంచి ప్రస్తుతం 20 లక్షల కెడెట్లకు శిక్షణలు ఇస్తూ, రానున్న రోజుల్లో 30 లక్షల వరకు పెంచడానికి దశాబ్దకాల ప్రణాళికలు అమలు పరుస్తున్నారు.

ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్‌సిసి:

నేడు తెలంగాణ/ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ఎన్‌సిసి సేవలు హైదరాబాదు కేంద్రంగా ఎన్‌సిసి జైరెక్టరేట్ నాయకత్వంలో ప్రతి ఏట 1.4 లక్షల మంది కెడెట్లు శిక్షణ పొందుతున్నారు. తెలంగాణలో 4 ఎన్‌సిసి గ్రూపులు, ఆంధ్రలో 5 గ్రూపులతో 67 ఎన్‌సిసి బెటాలియన్లు శిక్షణలో నిమగ్నం అయ్యాయి. ప్రతి విద్యార్థికి ఎన్‌సిసి శిక్షణను విధిగా నేర్పించాలనే వాదం ఎంతో కాలంగా వినిపిస్తున్నది. దీనిని వాలంటరీ సంస్థగా కాకుండా కంపల్సరీ శిక్షణగా నేటి యువతకు దేశభక్తిని నూరి పోయాల్సి ఉందనే వాదనలు సర్వత్ర వినిపిస్తున్నాయి. కొన్ని దేశా?? విద్యా విధానంలోనే ఇలాంటి శిక్షణలను సెలబస్‌గా అమలు చేయడం, డిగ్రీ తర్వాత కొంత కాలం పాటు తప్పనిసరిగా సైన్యంలో పని తేయడం అమలు జరుగుతున్న విషయాలను మరువరాదు.

ఒక అమాయక యువకుడు లేదా యువతిని బాధ్యతగల ఆకర్షణీయ వ్యక్తిత్వం కలిగిన పౌరుడిగా తీర్చి దిద్దడంలో ఎన్‌సిసి చేస్తున్న కృషిని ప్రస్తుతిద్దాం, మన పిల్లలకు ఎన్‌సిసి శిక్షణను తప్పనిసరి చేద్దాం.

కెప్టెన్ : డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి
అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ (రి)
9949700037

అపర అన్నవరం...
మరో శబరి మల



దేవాలయము తెలంగాణలో ఎంతో ప్రసిద్ధి గాంచిన ఏకైక శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయము.

కొండకు దాదాపు 1.కి.మీ. దూరాన పరమ పవిత్రమైన గోదావరి నది ప్రవహిస్తున్నది. భక్తులు అందు స్నానమాచరించి శ్రీ స్వామి వారిని దర్శించుకొనుట పరిపాటి. ఈ దేవస్థానములో ఎక్కువ సంఖ్యలో శ్రీ స్వామి వారి వ్రతమును చేసుకుంటారు. కుంకుమార్చనలు, అష్టోత్తరములు, అభిషేకము, హారతులు, ఇత్యాది అర్చనలు చేయించుకొని భక్తులు భగవదనుగ్రహ పాత్రులు అవుతున్నారు.

గోదావరి తీరాన ఒక గుట్టపై సత్యనారాయణ స్వామి, అదే ప్రాంతంలో పక్కన ఎత్తైన ప్రదేశంలో అయ్యప్ప స్వామి వెలసి, తెలంగాణలో అపర అన్నవరంగా, మరో శబరిమలైగా పెరిన్నకగన్న గూడెం గుట్ట విశేష ప్రాధాన్యత కలిగి ఉంది.

ఈ నెల 22నుండి 24వరకు కార్తీక పౌర్ణమి జాతర నిర్వహణకై దేవస్థానం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, అర్చకులు, కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాల నిర్వహణకై తగు ఏర్పాట్లు గావిస్తున్నారు.

మారహిత శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీన విష్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనము, అంకురారోపణము, అగ్ని ప్రతిష్ఠ, నిత్య హవనము, బలిహరణం, తీర్థప్రసాద వితరణ, గోధూళిక సమూహూర్తమున తులసీ కల్యాణం, 23న నిత్య హవనము, బలిహరణము, 24న కార్తీక పౌర్ణమి రోజున నిత్య హవనం, బలిహరణం, మహా పూర్ణాహుతి, యజ్ఞ పరి సమాప్తి, మహదాశీర్వచనం, తీర్థ ప్రసాదాల వితరణ తదితర ఉత్సవ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో మంచిర్యాల, కరీంనగర్, జగిత్యాల ఆర్టీసీ వారు ప్రత్యేకంగా బస్సులు నడప నున్నారని ఈఓ శ్రీనివాస్ సంకటాల వివరించారు.

– రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

22 నుండి గూడెం సత్యనారాయణ స్వామి కార్తీక పౌర్ణమి జాతర

"శ్రీ రత్నగిరీశాయ గౌతమీ తీరవాసినే, ఆదినారాయణాయ శ్రీసత్య దేవాయ మంగళమ్", తెలంగాణ ప్రాంతంలోనే అరుదైనదై, పవిత్ర గోదావరి నదీ తీరాన గుట్టపై వెలసి, సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ధర్మపురికి 11కిలో మీటర్ల దూరాన మంచిర్యాల జిల్లా సరిహద్దున దండేపెల్లి మండలం గూడెం వద్ద భక్తుల పాలిటి వరదునిగా వాసి కెక్కిన సర్వజన బాంధవుడైన గూడెం రమా సహిత సత్యనారాయణ స్వామి కార్తీక పౌర్ణమి జాతర వేడుకలు నవంబర్ 22 నుండి అత్యంత వైభవంగా జరుగ నున్నాయి.



పూర్వము గూడెం గ్రామ వాస్తవ్యుడైన శ్రీ గోవర్ధన పెరుమాండ్ల స్వామి అనే చాత్తాద శ్రీ వైష్ణవునికి శ్రీ స్వామి, స్వప్న దర్శనం గావించి, మీగ్రామ శివారు రాట్నపు చెవులు కొండపై వెలిశాను అని చెప్పారట. అది స్వప్నమే కదా! అని విశ్వసించక మిన్నకుండి నాడట. కాని మరునాడు స్వప్నములో మళ్ళీ స్వామి రావడంతో... పెరుమాండ్ల స్వామి కొండ ఎక్కి, స్వామి వెలసిన చోటు కోసం వెతక నారంభించి తిరిగి తిరిగి ఎంత వెతికినా 'జాడ తెలియక పోవడంతో సాయంత్రం ఇంటి కేగి నిద్రకు ఉపక్రమించగా, నీవుండే జాడ తెలుసుకునేంత జ్ఞానము నాకెక్కడిది స్వామి? నన్ను మన్నించి దర్శనమివ్వు! అని మనసులో తలచుకొని నిద్రించడం జరిగింది. ఆ రాత్రి స్వప్నములో స్వామి అగుపించి ఆ కనపడుతున్న అదే రాట్నపు చెవుల కొండపై ఒక చిన్ననీటి కొలను (సారితే) దానికి దగ్గరగా ఉత్తర దిశలో ఉన్న గుహలో నేనున్నాను అని చెప్పి అదృశ్యమైనాడు. తెల్ల వారగానే ఆతృత పట్ట జాలక కొండపై వేగి కలలో అగుపించిన గుహలో వెదికితే, గుహలో చిన్న విగ్రహం దర్శన మిచ్చింది. విగ్రహాన్ని వెంటనే పెరుమాళ్లు పరుగున వెళ్ళి గోదావరిలో శుచిగా స్నానమాచరించి పూజా ద్రవ్యాలతో కొండ చేరుకొని విగ్రహమున్నచోట శుభ్రపరచి స్వామివారికి అభిషేకాదులు, పూజలు జరిపి నైవేద్యం పెట్టగా, విషయం తెలుసుకున్న. గ్రామ ప్రజలు కొండను చేరుకొని స్వామి దర్శనం చేసుకున్నారు. దైవ ప్రభావము చేత వారి కోరికలన్నియు తీరాయట. ఇలా కొండ పై దేవుడు వెలిశాడన్న వార్త ఊరూరా పాకి అందరూ దర్శనానికి రావడం మొక్కడము భక్తుల కోర్కెలు తీరడము, పెరుమాండ్లు ప్రతి రోజు స్వామి వారికి పూజాధికాలు, నిర్వహించడము ద్వారా స్వామి మహత్యము తొందరలో అందరికి తెలిసిపోవడము జరిగింది.

రోజులు గడిచిన కొలది శ్రీ పెరుమాండ్లు స్వామి ఆలోచించి శ్రీ సత్యనారాయణ స్వామి, రమాదేవి విగ్రహాలు పెద్దవి చేయించి భక్తుల సహకారముతో ఆలయ నిర్మాణము గావించి శ్రీ క్రోధి నామ సంవత్సర మాఘ శుద్ధ దశమి (1964) లో విగ్రహ ప్రతిష్ట చేశారు. కొండ పైకి వెళ్ళుటకై దారి, మంచి నీటి బావి త్రవ్వించారు. నాటి నుండి అసంఖ్యాక భక్తుల కోర్కెలు తీర్చుతూ శ్రీ స్వామి వారు నిత్య వినూత్న కళలతో వెలుగొందు చున్నాడు. ఈ

చరిత్ర మరచిన వీరనారి

ఝల్కారీబాయి జయంతి

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అంటే వెంటనే గుర్తుకు వచ్చేది ఝాన్సీ రాణి. 1857వ సంవత్సరం సిపాయిల తిరుగుబాటు ఒక చరిత్ర. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది ఝాన్సీ లక్ష్మీబాయి. బ్రిటిష్ పాలనకు లొంగక, వారికి తన రాజ్యం స్వాధీన పరచడానికి ససేమిరా ఇష్ట పడక, రాజ్య రక్షణ కోసం జరిగిన యుద్ధంలో ఝాన్సీ వీరోచిత పోరాటం, వీర మరణం గురించి అందరికీ తెలిసిందే. ఈ పోరాటంలో ఝాన్సీ లక్ష్మీబాయికి నమ్మిన బంటుగా, విశ్వాస పాత్రురాలిగా, ఆత్మార్పణం గావించిన ఒక వీరదళిత నారి గురించి చాలా మందికి తెలియదు. ఆమె ఝల్కారీబాయి... ఝల్కారీబాయి గురించి తెలుసుకోక పోవడం చరిత్రకు అన్యాయం జరిగినట్లే భావించాలి.

ఉత్తర భారతదేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి లక్ష్మీ బాయి. 1857లో అలజడి రేగడంతో ఝాన్సీ పట్టణం విప్లవ కారులకు నిలయంగా మారింది. లక్ష్మీబాయి స్వచ్ఛంద సైన్యాన్ని సమీకరించడం ద్వారా ఆత్మరక్షణ బలోపేతం చేసింది. మహిళలను కూడా సైన్యంలో చేర్చుకుని వారికి ఆయుధ శిక్షణను ఇవ్వనారం భించింది. ఆమె దగ్గర సైన్యాధ్యక్షు లుగా ఉన్న వారంతా ఆమె యుద్ధం చేస్తున్న కారణానికి మద్దతుగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారే. సెప్టెంబరు, అక్టోబరు 1857 లో ఆమె ప్రక్క రాజ్యాలైన దతియా, ఓర్చా రాజ్యాల నుంచి దాడిని విజయవంతంగా ఎదుర్కొన గలిగింది.

హిందువులకు ఆవు పవిత్రం, ముస్లింలకు, పంది అసహ్యం. కానీ ఆంగ్లేయులు వాడే తూటాలకు ఆవు కొవ్వును, పంది కొవ్వును వాడేవారు. అది సహించలేని సిపాయిలలో తిరుగుబాటు మొదలయ్యింది. ఇది గ్రహించిన ఆంగ్లేయులు హిందువులను, ముస్లింలను అనేక ఇబ్బందులకు గురిచేసారు. అది సహించలేని సిపాయిలు ఆంగ్లేయులపై తిరుగు బాటు చేయాలని సంకల్పించు కున్నారు. రాజ్యాన్ని ఆంగ్లేయులు ఆక్రమించుకోగా పారిపోయిన ఝాన్సీలక్ష్మీబాయి తాంత్యాతోపే మొదలైన తిరుగుబాటు దార్లతో చేయి కలిపి ఢిల్లీ, కాన్పూరు, బెద్, ఝాన్సీతోపాటు అన్నీ ప్రాంతాలలో ఒకేసారి తిరుగుబాటు చేయాలని నిర్ణయించు కున్నారు. కానీ బ్రిటీష్ వారు పెట్టిన బాధలకు ఓర్వలేని మంగల్ పాండే అనే భారతసిపాయి తిరుగుబాటు చేయడంపై ఆంగ్లేయులు అప్రమత్తమై ఝాన్సీ రాణిని నిర్బంధించి ఝాన్సి రాజ్యాన్ని కైవసం చేసుకున్నారు. ఇది భారత చరిత్రలో మొదటి స్వాతంత్ర్య సంగ్రామం. భారత నారీ క్షేత్రంలో మచ్చుతునక



ఝాన్సీ లక్ష్మీబాయి. అయితే ఈ సమరంలో ఝల్కారీబాయి అనే వీరనారి పాత్ర మరువ లేనిది.

ఝల్కారీబాయి (నవంబరు 22, 1830 -- 1858) భారతీయ మహిళా సైనికురాలు. 1857 సిపాయి తిరుగుబాటు సందర్భంగా జరిగిన ఝాన్సీ యుద్ధంలో ప్రముఖ పాత్ర పోషించింది. ఆమె ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యంలోని మహిళా విభాగంలో సైనికురాలు. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో సిపాయి తిరుగుబాటుగా, 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం'గా ప్రసిద్ధి గాంచిన 1857-58 నాటి వీరోచిత పోరాట ఘట్టంలో ఝాన్సీరాణి లక్ష్మీబాయికి ప్రతిరూపంగా కీలక భూమికను పోషించిన ఘనత దళిత బహుజన భూమిపుత్రిక ఝల్కారిబాయికే దక్కుతుంది. బుందేల్‌ఖండ్ ప్రాం తంలో ప్రజలు పాడుకునే జానపద బాణీల్లో ఝాన్సీలక్ష్మీబాయి సరసన ఝల్కారిబాయి సాహసాలను పాటల రూపంలో నేటికీ గుర్తు చేసుకోవడం విశేషం.

ఝాన్సీ సమీపంలోని భోజ్‌లా గ్రామంలో కోరీ కులానికి చెందిన సదోవర్ సింగ్, జమునాదేవి దంపతులకు నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబంలో 1830 నవంబర్ 22న జన్మించిన ఝల్కారిబాయి వీరనారిగా ఎదిగి, నేడు దళిత బహుజనుల ఆత్మగౌరవ పతాకగా మారింది. చిన్న వయసులోనే తల్లి మరణించడంతో తండ్రి పెంపకంలో గుర్రపుస్వారీ, కత్తిసాము వంటి యుద్ధ విద్యలు నేర్చుకుంది. అడవిలో పశువులను మేపుతున్న ఝల్కారిపై దాడి చేసిన చిరుత పులిని కేవలం చేతికర్రతో చాకచక్యంగా హతమార్చిన ఘటన సంచలనం రేపింది. ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యంలో ఆయుధ విభాగంలో పనిచేస్తున్న పూరణ్ సింగ్‌ను వివాహం చేసుకున్న ఝల్కారిబాయి, తదనంతర కాలంలో లక్ష్మీబాయికి సన్నిహితమై సైన్యంలో చేరి 'దుర్గావాహిని' మహిళా సాయుధ దళానికి నాయకత్వం వహించింది.

సిపాయి తిరుగుబాటు సందర్భంగా శత్రుసేనలతో జరిగిన యుద్ధంలో ప్రముఖ పాత్రను పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. 1858 ఏప్రిల్ 3న బ్రిటిష్ జనరల్ హగ్ రోజ్ నాయకత్వంలో బ్రిటిష్ సేనలు ఝాన్సీ రాజ్యాన్ని చుట్టు ముట్టాయి. ఆ దాడి నుంచి లక్ష్మీబాయి సురక్షితంగా తప్పిం చుకుని కల్పి ప్రాంతంలో పోరాడు తున్న తిరుగుబాటు నాయకులను కలుసు కోవడానికి అనువుగా, ఝల్కారీబాయి తానే ఝాన్సీ లక్ష్మీబాయి నంటూ కోట ముందు ప్రత్యక్షమై బ్రిటిష్ సేనలను ముప్పుతిప్పలు పెట్టింది. ఆ దాడిలో ఝాన్సీలక్ష్మీబాయి రూపంలో బందీగా పట్టుబడ్డ ఝల్కారిబాయిని గుర్తుపట్టిన బ్రిటిష్ సేనలు, తదనంతర కాలంలో ఆమెను విడిచిపెట్టారా లేదా చంపేశారా అన్నది చెప్పడానికి స్పష్టమైన ఆధారాలు లేవు. 1858 జూన్ 17,లో రెండో రోజు యుద్ధములో రాణి మరణించింది. ఈ ఝల్కారిబాయి సాహసంతో స్ఫూర్తి పొందిన దళిత బహుజన రాజకీయ పార్టీల కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఝల్కారిబాయి జీవితాన్ని, పోరాట ఘట్టాలను నాటకాలు, కథలుగా మలచి ఊరూరా ప్రచారం చేయడం జరిగింది. భారత ప్రభుత్వం, ఆమె జ్ఞాపకార్థం పోస్టల్ స్టాంపును విడుదల చేయడం గమనార్హం.

– రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

భారతీయ మహిళా శాస్త్రవేత్తలకు
శాశ్వత స్ఫూర్తి అసీమా చటర్జీ

నవంబర్ 22...అసీమా చటర్జీ వర్ధంతి

భారత దేశంలో శాస్త్రవేత్తలందరిలో అసీమా చటర్జీ (1917--2006) ప్రత్యేక స్థానం పొందారు. మహిళలకు అనేక సామాజిక ఆంక్షలు ఉన్న కాలంలో, ఆమె చేసిన విశిష్ట కృషి శాస్త్ర రంగంలో అద్భుతాలను సాధించేందుకు మార్గదర్శకమైంది. రసాయన శాస్త్రం, ముఖ్యంగా ఆర్గానిక్ కెమిస్ట్రీ మరియు ఫైటోమెడిసిన్ రంగాలలో ఆమె చేసిన కృషి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.



అసీమా చటర్జీ 1917 సెప్టెంబర్ 23న పశ్చిమ బెంగాల్‌లోని కలకత్తాలో జన్మించారు. చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి చూపించిన ఆమె, కుటుంబ ప్రోత్సాహంతో ఉన్నత విద్యను అభ్యసించ గలిగారు. 1936లో కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి రసాయన శాస్త్రంలో బాచిలర్ డిగ్రీ (డీ.సా.ష్ణ.) అందుకున్నారు. 1938లో మాస్టర్ డిగ్రీ (వీ.సా.ష్ణ.) పూర్తిచేశారు. 1944లో అదే విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ (ఫ్ష్ట్ర.ణ.) పొందారు. ఆ రోజుల్లో భారతదేశంలో, ముఖ్యంగా మహిళలకు, శాస్త్రవేత్తలుగా ఎదగడం ఒక అపూర్వమైన విషయం. ఆమె సంస్లేషిత కర్బన రసాయన శాస్త్రంలో వృక్ష ఉత్పత్తుల గూర్చి పరిశోధనలు చేశారు. ప్రఫుల్ల చంద్ర రే, ప్రొఫెసర్ ఎస్.ఎన్.బోస్ అధ్వర్యంలో పరిశోధనలు చేశారు. ఈమె 1940 లో కలకత్తా యూనివర్సిటీ యొక్క "లేడీ బ్రబోర్నే కాలేజి"లో చేరి రసాయన శాస్త్ర విభాగానికి అధిపతిగా ఉన్నారు. 1944 లో ఇండియా విశ్వ విద్యాలయంలో శాస్త్రీయ విజ్ఞానంలో డాక్టరేట్ పొందిన మొదటి మహిళగా నిలిచారు. అసీమా చటర్జీ పరిశోధనలు ప్రధానంగా భారతీయ ఔషధ మొక్కలు, వాటి అల్కలాయిడ్లు మరియు వాటి ఔషధ గుణాలపై కేంద్రీకృతమ య్యాయి. ఆమె జీవితం మొత్తం రసాయన శాస్త్రంలోని సవాళ్లను ఎదుర్కొంటూ, సమకాలీన సమస్యల పరిష్కారానికి దోహదం చేసేందుకు అంకితం చేశారు. వింకా మొక్కలలోని అల్కలా యిడ్లను ఉపయోగించి, క్యాన్సర్ చికిత్సలో ఉపయోగపడే కొన్ని ముఖ్యమైన ఔషధ సమ్మేళనాలను అభివృద్ధి చేశారు. ఈ పరిశోధనలు గ్లోబల్ మెడికల్ రంగంలో క్యాన్సర్ కీమోథెరపీకి ప్రణాళికాత్మకంగా మారాయి. మలేరియా వ్యాధిని నిరోధించడంలో ఆమె చేసిన కృషి విపరీతమైన ప్రాధాన్యతను పొందింది. భారతదేశంలో మలేరియా నివారణ కోసం రూపొందించిన కొత్త ఔషధాల్లో ఆమె కీలక పాత్ర పోషించారు. మూర్ఛ రోగ రుగ్మత నివారణకు అవసరమైన ఔషధాలను తయారు చేయడంలో ఆమె గణనీయమైన కృషి చేశారు. అసీమా చటర్జీ భారతదేశంలో లభించే మొక్కల ఔషధ గుణాలను విశ్లేషించడంలో విశేష కృషి చేశారు. ప్రత్యేకించి ఆయుర్వేద మరియు సంప్రదాయ ఔషధాల్లోని రసాయనాలను ఆధునిక శాస్త్రీయ పద్ధతులతో గుర్తించడంలో విశేషంగా శ్రమించారు. భారతదేశంలో అసీమా చటర్జీకి ఇచ్చిన అత్యున్నత పౌర పురస్కారాల్లో పద్మభూషణ్ (1975) ఒకటి. భారతీయ శాస్త్రవేత్తలకు ఇచ్చే గౌరవప్రదమైన శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు అవార్డు అందుకున్నారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సంస్థకు తొలి మహిళా అధ్యక్షురాలిగా పని చేసే గౌరవం లభించింది. భారత జాతీయ సైన్స్ అకాడమీ (×చీూూ) సభ్యురాలిగా, దేశ వ్యాప్తంగా శాస్త్రజ్ఞులకు మార్గ దర్శకురాలిగా నిలిచారు. అసెంబ్లీ ఆఫ్ నేషన్స్ మహిళా శాస్త్రవేత్తలలో ప్రముఖంగా నిలిచారు. "మహిళగా ఉన్నా శాస్త్ర రంగంలో అగ్రగామిగా ఎదగవచ్చు" అని నిరూపించిన అసీమా జీవితం మహిళా శాస్త్రవేత్తలకు ఆదర్శం. కష్టపడితే ఏదైనా సాధించగలం అనే నమ్మకానికి ఆమె జీవితం ఒక తార్కాణం.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్
ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

విద్యార్థుల హాజరు శాతం పెరగాలి..టీచర్లు నిత్యం పర్యవేక్షణ చేయాలి

విద్యాలయాలకు వచ్చేలా ప్రోత్సహించాలి...విద్యాలయాల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి..ఆన్లైన్ శిక్షణ తరగతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి... పేరెంట్ టీచర్ మీటింగ్ లు క్రమం తప్పకుండా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్ 21 (సింగిడి):



జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎఫ్ ఆర్ ఎస్, ఎఫ్ ఎల్ ఎన్, ఆన్లైన్ తరగతులు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.. విద్యాశాఖ, పంచాయతీ రాజ్ శాఖ, టీజీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా టీచర్లు, విద్యాధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అన్ని విద్యాలయాల విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. బడికి హాజరు కాకపోవడానికి కారణాలు తెలుసుకోవాలని, నిత్యం వచ్చేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బంది ఉంటే పరిష్కరించాలని స్పష్టం చేశారు.పనులకు అనుగుణంగా కూలీల సంఖ్య పెంచాలి.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయం నిర్మాణ పనులు పనుల్లో మరింత వేగం పెంచాలని ఆదేశించారు. పనులకు అనుగుణంగా కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులను మొదలుపెట్టాలని తెలిపారు. నాబార్డ్ నిధులతో విద్యాలయాల్లో చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం ఉష కింద గంభీరావు పేట, అగ్రహారంలో నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని, వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలిఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ ఆన్లైన్ తరగతులను అన్ని విద్యాలయాలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తప్పని సరిగా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రోజువారి, వారవారం పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆన్లైన్ తరగతులను వినియోగించుకోవాలని పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. క్రమం తప్పకుండా నిర్వహించాలిపేరెంట్ టీచర్ మీటింగ్లో అన్ని విద్యాలయాల్లో క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని మీటింగ్లకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.అభ్యాసన సామర్థ్యాలు మెరుగు పర్చాలి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మెరుగు పర్చాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థులు చదవడం, రాయడం, గణితం ఇతర పాఠ్యాంశాలు రాసి.. చదివేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులను రానున్న వార్షిక పరీక్షలకు ఒక ప్రణాళిక ప్రకారం ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని ఆదేశించారు. గత ప్రశ్నాపత్రాలు సాధన చేయించాలని సూచించారు. అన్ని పాఠ్యాంశాలు చదివి రాసేలా సాధన చేయించాలని స్పష్టం చేశారు. అన్ని విద్యాలయాల బాధ్యులు పకడ్బందీ ప్రణాళిక అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా విద్యాధికారి అన్ని అంశాలపై తరచూ సమీక్షలు నిర్వహించాలని, పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. మండల, జిల్లా స్థాయి విద్యా అధికారులు తమ పరిధిలోని అన్ని విద్యాలయాల్లో తరచూ తనిఖీలు చేయాలని సూచించారు.సమావేశంలో జిల్లా విద్యాధికారి విజయ సాగర్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, వివిధ మండలాల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ దినోత్సవ ఫ్లెక్సీ ఏర్పాటు

సిద్దిపేట, నవంబర్ 21(సింగిడి):

నవంబర్ 26వ తేదీ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి ఆశయాలు, రాజ్యాంగ నిర్మాణంలో వారు చేసిన అపార కృషి, సమాజానికి అందించిన సేవలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో సిద్దిపేట పట్టణంలోని 3వ వార్డు రంగధాంపల్లి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం జరిగింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్ర, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం కోసం వారు చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రజాస్వామ్య విలువలు, అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరికీ చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.



కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ నవంబర్ 21(సింగిడి)

జగిత్యాల జిల్లా కొండగట్టులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారి చందనోత్సవం, పుష్ప సంప్రోక్షణ కార్యక్రమం అనంతరం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి నిజరూప దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

పదోన్నతుల్లో ఎస్ ఆర్ పీ 1కు అన్యాయం

మంచిర్యాల, నవంబర్ 21 (సింగిడి):



సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, అర్హతకు అనుగుణంగా పదోన్నతులు లభించాల్సి ఉండగా.. ఎస్ఆర్పీ-1 గనిలో మాత్రం మూడేళ్లుగా కేటగిరీ ప్రమోషన్లు నిలిచిపోవడంపై కార్మికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడంలో ముందుంటున్నా పదోన్నతుల విషయంలో తమకు అన్యాయం జరుగుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఎస్ఆర్పీ-1 గని వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం గని మేనేజర్కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం ఒకే కుటుంబం.. ఒకే లక్ష్యం.. ఒకే గమ్యం అనే నినాదంతో ముందుకు సాగుతున్నప్పటికీ, పదోన్నతుల విషయంలో సమానత్వం పాటించడం లేదని విమర్శించారు. శ్రీరాంపూర్ డివిజన్లోని ఇతర గనులకు కేటగిరీ ప్రమోషన్లు కల్పిస్తూ ఎస్ఆర్పీ-1 గనిని మాత్రం విస్మరించడం వివక్షకు నిదర్శనమన్నారు.శ్రమకు గుర్తింపు ఏదీ?సింగరేణిలోనే అత్యధిక గ్రేడియంట్ కలిగిన గనుల్లో ఒకటైన ఎస్ఆర్పీ-1లో కార్మికులు యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను వందశాతం సాధిస్తూ ప్రతి ఏడాది ఉత్పత్తి, ఉత్పాదకతలో ముందంజలో ఉంటున్నారని నాయకులు పేర్కొన్నారు. గని అభివృద్ధికి కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ, వారి వృత్తిపరమైన ఎదుగుదలకు అవసరమైన పదోన్నతులు కల్పించకపోవడం బాధాకరమన్నారు. గత సెప్టెంబరులో 50 వసంతాలు పూర్తి చేసుకున్న ఈ గని శ్రీరాంపూర్ అండర్గ్రౌండ్ గనులకు ఆదర్శంగా నిలిచిందని గుర్తుచేశారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన గనిలో పనిచేస్తున్న కార్మికులకు ప్రమోషన్లు కల్పించకపోవడం వారి మనోధైర్యాన్ని దెబ్బతీస్తోందన్నారు.ఖాళీలను భర్తీ చేసి న్యాయం చేయాలిగత మూడేళ్లుగా పెండింగ్లో ఉన్న కోల్కట్టర్, సపోర్ట్మెన్, లైన్మెన్, ట్రామర్, సర్వే అసిస్టెంట్, అసిస్టెంట్ చైన్మెన్, చైన్మెన్ తదితర కేటగిరీల్లో ఖాళీలను గుర్తించి వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇతర గనుల్లో అనుసరిస్తున్న విధానాన్నే ఎస్ఆర్పీ-1లోనూ అమలు చేసి కార్మికులందరికీ సమాన న్యాయం చేయాలని కోరారు. యాజమాన్యం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఫిట్ కార్యదర్శి దాడి రాజయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఉపాధ్యక్షులు అనంతరెడ్డి, సహాయ కార్యదర్శులు పరశురాం, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి అండగా అంబేద్కర్ యువజన సంఘం



సిద్దిపేట, నవంబర్ 21(సింగిడి):

ప్రమాదవశాత్తు మరణించిన పుల్లూరి యాదయ్య కుటుంబానికి అంబేద్కర్ యువజన సంఘం అండగా నిలిచింది. రంగధాంపల్లి యువజన సంఘం తరపున 10,000/- ఆర్థిక సహాయం అందించడం జరిగింది. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఐరేనీ రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు దబ్బెట శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఐరేనీ విజయ్ కుమార్ , కోశాధికారి దబ్బెట తిరుపతి, సహాయ కార్యదర్శి ఐరేనీ మల్లేశం, సలహాదారులు ముత్యాల కనకయ్య, ఐరేనీ కనకయ్య, ఐరేని రవీందర్, గాజుల అంకుశం మరియు సంఘ సభ్యులు, ఐరేనీ మల్లేశం, పుల్లూరు కనకయ్య, దబ్బేట దర్శన్, బాకీ కిషన్, ఐరేనీ లింగం, దబ్బెట పర్షరాములు తదితరులు పాల్గొన్నారు,

మోడల్ టౌన్ @పెద్దపల్లి



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 21 (సింగిడి):

పెద్దపల్లి పట్టణ సుందరీకరణ, మౌలిక వసతుల కల్పనలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణాన్ని మోడల్ టౌన్ గా తీర్చిదిద్దుతున్నామని పట్టణంలో అన్ని వసతులతో పాటు సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల మైదానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేసి ప్రజల సౌకర్యార్థం నూతన వాకింగ్ ట్రాక్, ఆధునిక లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్విమ్మింగ్ పూల్ త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అనంతరం, పట్టణంలోని జెండా చౌరస్తా నుండి మసీదు చౌరస్తా వరకు జరుగుతున్న ప్రధాన రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా జెండా చౌరస్తాలో ఏర్పాటు చేయనున్న 150 అడుగుల భారీ జాతీయ జెండా స్థలాన్ని ఆయన సందర్శించారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా ఇటీవల తొలగించిన పాత కమాన్ స్థానంలో, త్వరలోనే నూతన హంగులతో కూడిన ఆకర్షణీయమైన కమాన్ను నిర్మిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

పెద్దపల్లి మండలంలోని నిట్టూరు, నిమ్మనపల్లి గ్రామాల్లో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే విజయరమణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, పట్టణ కౌన్సిలర్లు మంతిని నర్సింగ్, దొడ్డుపల్లి జగదీష్, సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భూత గడ్డ సంపత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ శౌచాలయం గౌరవప్రదమైన భవిష్యత్'

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 21(సింగిడి):



స్వచ్ఛ శౌచాలయం గౌరవప్రదమైన భవిష్యత్ అనే నినాదంతో జిల్లాలో కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ప్రపంచ మరుగు దొడ్ల దినోత్సవం, స్వచ్ఛ శౌచాలయం గౌరవప్రదమైన భవిష్యత్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులతో కలిసి పోస్టర్లు, బ్యానర్ ను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం ఆవిష్కరించారు.జిల్లాలోని అన్ని గ్రామాల్ల స్వచ్ఛ శౌచాలయం గౌరవప్రదమైన భవిష్యత్ అనే నినాదంతో అక్టోబర్ 19 నుంచి మొదలై డిసెంబర్ పదవ తేదీ మానవ హక్కుల దినోత్సవం వరకు కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.మరుగుదొడ్డి లేనివారు నిర్మించుకోవాలని, నిర్మించుకున్న మరుగుదొడ్లను ఉపయోగంలో ఉండేలా చూడాలని సూచించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాలు, వీపో భవనాలు, పాఠశాలలు, పబ్లిక్ ప్రదేశాల్లో కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలు చేయాలని, వాటికి తప్పని సరిగా నీటి సదుపాయం ఉండేలా వినియోగించుకునేలా చూడాలని ఆదేశించారు. ఈ మేరకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామంలో ఇప్పటికే నిర్మించిన ఇందిరమ్మ గృహాల మరుగు దొడ్లు, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, వీపో బిల్డింగ్ వద్ద నిర్మించిన కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, అంగన్వాడీ భవనాల వద్ద నిర్మించిన కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, ఇండ్లలో నిర్మించిన నూతన మరుగుదొడ్లను అలంకరించి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని తెలిపారు. గ్రామాలలో ఇంకా మరుగుదొడ్లు నిర్మించుకొని వారిని గుర్తించాలని సూచించారు. పాఠశాలల విద్యార్థులు,మహిళలకు చేతుల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసేలా అవగాహన కల్పించాలని, చెత్త బండికి ఇచ్చేలా తెలియజేయాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, ఎస్ బీఎం బాధ్యులు సురేష్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

28న కాకతీయ యూనివర్సిటీ స్నాతకోత్సవ వేడుకలు



హనుమకొండ, (నవంబర్ 21)సింగిడి:

కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 28 తేదీనాడు యూనివర్సిటీ 24వ స్నాతకోత్సవ వేడుకలను యూనివర్సిటీలోని ఆడిటోరియంలో ఏర్పాటు చేయడానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాపరెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ వడ్లూరి రామచంద్రం పర్యవేక్షణలో పనులను పూర్తి చేశారు. యూనివర్సిటీ ఆవరణంలోని పిచ్చి మొక్కలను, పొదలను చదును చేయించారు. వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ను ఏర్పాటు చేశారు. ఈ స్నాతకోత్సవాలకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హాజరై యూనివర్సిటీలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు, డాక్టరేట్ సాధించిన వారికి గవర్నర్ చేతుల మీదుగా అందచేస్తారని తెలిపారు. యూనివర్సిటీ అధికారులు ఇచ్చిన పాస్ ఉన్నవారికి అనుమతి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండ

వేములవాడ నవంబర్ 21(సింగిడి)



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములవాడ రూరల్ పరిధిలోని అర్హులైన 38 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల 92 వేల, అర్బన్ మండల పరిధిలో 31 మంది లబ్ధిదారులకు 9 లక్షల 47 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు.వారు మాట్లాడుతూ అనారోగ్యంతో వైద్య చికిత్సలు చేయించుకుంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసానిస్తోందని పేర్కొన్నారు. ఆర్థిక స్థోమత లేక వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ, వారి కష్టాల్లో భాగస్వామి అవుతోందన్నారు.ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని పేర్కొన్నారు.

హిత చింతక్ అభియాన్లో భాగస్వామ్యం కావాలి



వేములవాడ, నవంబర్ 21: (సింగిడి)

హిందూ ఐక్యత, ధర్మ రక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న హిత చింతక్ అభియాన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి హిందువు భాగస్వామ్యం కావాలని నాయకులు గజం రాజు పిలుపునిచ్చారు. శనివారం వేములవాడలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం నుంచి వేములవాడ పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ హిత చింతక్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. హిందూ సమాజంలో ధార్మిక, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, సమాజ హితం కోసం ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయడమే ఈ అభియాన్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.యువత, మహిళలు, మేధావులు, వ్యాపారులు, ఉద్యోగులు, ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి హిత చింతక్ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. సభ్యత్వ నమోదు కోసం కార్యకర్తలు ఇంటింటికీ వచ్చినప్పుడు ప్రజలందరూ సానుకూలంగా స్పందించి సహకరించాలని, ఈ అభియాన్ను విజయవంతం చేయా లని విజ్ఞప్తి చేశారు. గడప కిషోర్ రావు, నాగుల రాము, గన్నమనేని ప్రదీప్ రావు, పల్లె శ్యాంసుందర్ రెడ్డి, గుండోజు గోపాల్, భాస్కర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ యోగా..వాకింగ్ చేయాలి

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 21(సింగిడి):





ఆర్.ఐ అడ్మిన్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ మైదానంలో ఆర్మ్డ్ రిజర్వ్, సివిల్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రదర్శించిన వివిధ డ్రిల్స్ను ఆర్.ఐ అడ్మిన్ పరిశీలించారు.ఈసందర్భంగా ఆర్.ఐ సురేష్ మాట్లాడుతూ.ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ ఉదయం కనీసం అరగంట పాటు యోగా, ధ్యానం లేదా నడక అలవాటు చేసుకోవాలని సూచించారు. సాధ్యమైనంత వరకు బయట ఆహారం తీసుకోవడం తగ్గించాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.వీక్లీ పరేడ్ ద్వారా పోలీస్ సిబ్బందిలో క్రమశిక్షణ, ఐక్యత, సమన్వయం, శారీరక దృఢత్వం పెంపొందుతాయని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం.పోలీస్ సిబ్బందిలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆర్. సతీష్ కుమార్ సిబ్బందికి గుండె ఆరోగ్యం, గుండెపోటు నివారణ, రక్తపోటు, మధుమేహం, ఆరోగ్యకరమైన జీవన శైలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు.ఆర్.ఐ రమేష్, పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్.ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు

వేములవాడ నవంబర్ 21(సింగిడి)



వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 196 మందికి శుక్రవారం రోజున వేములవాడ పోలీస్ స్టేషన్లో కౌన్సెలింగ్ నిర్వహించి, కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ మేఘన వారికి మొత్తం రూ.6,30,000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ మాట్లాడుతూ...మద్యం సేవించి, నిర్లక్ష్యపు డ్రైవింగ్తో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురై తమ కుటుంబాల్లో, ఎదుటివారి కుటుంబాల్లో విషాదం నింపవద్దని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపిన కేసుల్లో పట్టుబడితే భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉంటుందన్నారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లావ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన (పీఎం రహత్ రా వీర్)పథకాల గురించి వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు సహాయం అందించడం, గోల్డెన్ అవర్లో వైద్యం అందేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ట్రాఫిక్ ఆర్.ఎస్.ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా మత్స్యకారుల దినోత్సవం

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 20 (సింగిడి):

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సిరిసిల్ల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ లు హాజరై మాట్లాడుతూ ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని,ఇంత గొప్పగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న గంగపుత్ర సంఘం వారికి మా అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పథకాలను రూపొందించాలని అన్నారు. గత ప్రభుత్వంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్ర శేఖర రావు మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పూడిక తీయించి, కొత్త రిజర్వాయర్లు నిర్మించి రాష్ట్రంలో జల వనరులను పెంచి అందులో చేప పిల్లలను వదిలి తద్వారా మత్స్యకారులకు ఉపాధిని కల్పించారు వారి వ్యాపారాల కోసం వాహనాలను కూడా అందించారని అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కూర భాగ్యలక్ష్మి దేవేందర్, కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ప్రకాష్, మత్స్యకారుల పారిశ్రామిక సంఘం , గంగపుత్ర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం చైర్మన్‌గా కనుకయ్య ఎన్నిక



కరీంనగర్, నవంబర్21(సింగిడి)

కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ (బావుపేట) గ్రామ మత్స్య సహకార సంఘం చైర్మన్‌గా రావణవేని కనుకయ్య ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రావణవేని రాజేందర్, కార్యదర్శిగా రావణవేని నర్సయ్య ఎన్నికయ్యారు.సంఘం డైరెక్టర్లుగా రావణవేని వెంకట స్వామి, రావణవేని పరశురాములు, రావణవేని సిద్ధార్థ, రావణవేని పోషమల్లు, ఆవ రాములు, బీమారి నరేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధుముదిరాజ్, ప్రస్తుత డైరెక్టర్ రావణవేని సంపత్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల అందరి భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం



హనుమకొండ ప్రతినిధి నవంబర్ 21 (సింగిడి)

ప్రజలందరి భాగస్వామ్యం తోటే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని కమలాపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పబ్బు సతీష్ అన్నారు. స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా ప్రతి శనివారం నిర్వహిస్తున్న ఊరు కోసం ఒక రోజు శ్రమదాన కార్యక్రమం కమలాపూర్ పట్టణంలోని మూడో వార్డు పరిధిలో గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలక వర్గం, సిబ్బంది, తో కలిసి శ్రమదానం నిర్వహించారు. మూడో వార్డులో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు ముళ్ళపొదలు తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు విద్యాసంస్థలు, గ్రామంలోని అన్ని వార్డులు ఎవరి పరిసరాలను వారు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు మార్క అశోక్, అవునూరి తిరుపతి, పిల్లి సతీష్, ఎండవెల్లి మల్లారెడ్డి, రాంశెట్టి రాజయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టుక నుంచి మరణం దాకా ప్రతీ అంశం చట్టంతోనే ముడిపడి ఉంది

జడ్జి లక్ష్మణాచారి
మారుపాకలో న్యాయ విజ్ఞాన అవగాహన శిబిరం
ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి
డిసెంబర్ 12న మెగా లోక్ అదాలత్
సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవాలి
చట్టాలపై కనీస అవగాహనతో ప్రజలకు మేలు
పాఠశాలలో మొక్కలు నాటిన జడ్జీలు

వేములవాడ నవంబర్ 21(సింగిడి)





వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామంలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్ ఏ ఎల్ ఎస్ ఏ)మార్గదర్శకత్వంలో, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన శిబిరం శనివారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దొబ్బల మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీనియర్ జడ్జిలు లక్ష్మణాచారి, అనిల్ కుమార్ జాదవ్, డీఎస్పీ శ్రీనివాసులు, వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ పాల్గొన్నారు. ప్రజలకు చట్టపరమైన హక్కులు, ఉచిత న్యాయ సహాయం పొందే విధానాలపై అవగాహన కల్పించడం, న్యాయ సేవాధికార సంస్థ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి లక్ష్మణాచారి మాట్లాడుతూ.. దేశంలో వేల సంఖ్యలో చట్టాలు ఉన్నందున వాటన్నింటినీ పూర్తిగా వివరించలేక పోయినా, ప్రజలకు కనీస అవగాహన కల్పించి కొందరికైనా మేలు చేయడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రజలు చట్టాలను సద్వినియోగం చేసుకుంటారా లేదా అన్నది వారి విజ్ఞతకే వదిలేసినప్పటికీ, చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందని పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా న్యాయ సేవాధికార సంస్థతో పాటు హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, ప్రత్యేక చట్టబద్ధతతోనే ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు, పుట్టుక నుంచి మరణం దాకా ప్రతి అంశం చట్టంతో ముడిపడి ఉంటుందని సులభంగా వివరించారు. పొద్దున్నే లేచి బ్రష్ చేసుకునే సమయంలో ఆ బ్రష్ నాణ్యత సరిగా లేక పళ్లు పాడైనా, నకిలీ పాల ప్యాకెట్లు కొనుక్కుని తాగి అనారోగ్యానికి గురైనా, కొనుగోలు చేసిన వస్తువుల్లో ఎలాంటి లోపాలు ఉన్నా వినియోగదారుల ఫోరం చట్టం ద్వారా ఫిర్యాదు చేసే హక్కు ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే కల్తీ నీరు, కలుషిత ఆహారం, పండ్ల వల్ల అనారోగ్యం తలెత్తినా అందుకు సంబంధించిన చట్టాలు ఉన్నాయని చెప్పారు.గతంలో 'వందేమాతరం' పాటలో చెప్పినట్లు 'సుజలం, సుఫలం, సస్యశ్యామలం'గా ఉండే పరిస్థితుల నుంచి ఇప్పుడు వాతావరణం, నీరు, పండ్లు, గాలి కలుషితమవుతున్న పరిస్థితులు వచ్చాయని లక్ష్మణాచారి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వాగులు, వంకల్లో ఊట చెలుమ తీసుకుని స్వచ్ఛమైన నీరు తాగేవారని, ఇప్పుడు ఫిల్టర్ చేసినా అనారోగ్యం బారిన పడుతున్నారని, పండ్లను కూడా ఉప్పు నీళ్లలో నానబెట్టి తినాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. సిరిసిల్ల వంటి చోట్ల బంగళా మీద పడుకున్నా, ఇంట్లో వస్తువులు ఉంచినా దుమ్ము పేరుకుపోయే పరిస్థితి వచ్చిందని, ఇవన్నీ కూడా చట్టంతో ముడిపడి ఉన్న అంశాలేనని ప్రజలు పూర్తిగా అవగాహన చేసుకోవాలని సూచించారు. ఇక జీవితంలోని కీలక ఘట్టాల విషయానికి వస్తే, పిల్లలు పుట్టిన వెంటనే ఆసుపత్రి నుంచి సర్టిఫికెట్ తీసుకుని, ఆయా పరిధిలోని మున్సిపాలిటీలో తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం నమోదు చేయించుకోవాలని, భవిష్యత్తులో ఆధార్, ఇతర పత్రాల కోసం ఇది ఎంతో అవసరమని సూచించారు.తమ పరిధిలోని సమస్యలపై ప్రజలు దరఖాస్తు ఇస్తే ఉచితంగా సేవలు అందిస్తామని జడ్జి లక్ష్మణాచారి తెలిపారు. వచ్చే నెల డిసెంబర్ 12న మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భూముల గట్టు వివాదాలు, ప్రామిసరీ నోట్ల ఆర్థిక సమస్యలు, కుటుంబ తగాదాలు, సివిల్ వివాదాలు వంటి పరిష్కారయోగ్యమైన సమస్యలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. దీనివల్ల ఖర్చులు తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుందని, ఇరువర్గాలకు మనశ్శాంతి, ప్రశాంతత లభించి ఇద్దరూ గెలుపు సాధించినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన గ్రామ సర్పంచ్ దొబ్బల మల్లేశంకు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఉద్దేశంతో మారుపాక గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీనియర్ జడ్జిలు లక్ష్మణాచారి, అనిల్ కుమార్ జాదవ్ శనివారం మొక్కలను నాటారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. తరువాత పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొబ్బల మల్లేశం, డీఎస్పీ శ్రీనివాసులు, వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు.. ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 21 (సింగిడి):

జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



జిల్లాలో నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువుల విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్, వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాలను విక్రయించినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, తరచూ ఇటువంటి కేసుల్లో పట్టుబడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.శనివారం రోజున పోలీస్ , వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, లైసెన్సులు, ఎరువులు, విత్తనాల నిల్వలు, బిల్లులు, రసీదులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.జిల్లాలో నకిలీ విత్తనాల అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఒక్క రైతు కూడా నకిలీ విత్తనాలతో మోసపోకుండా చూడాల్సిన బాధ్యత పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులపై ఉందని, జిల్లాలోని ఫర్టిలైజర్, సీడ్స్ షాపులపై నిరంతరం నిఘా ఉంచి నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువుల విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషి చేస్తున్నారు.ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, నాణ్యతపై అనుమానం ఉన్నా లేదా ఎవరైనా నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా ప్రజలకు, రైతులకు సూచించారు.రైతులను నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువుల బారి నుంచి రక్షించేందుకు జిల్లా పోలీస్, వ్యవసాయ శాఖ సమన్వయంతో నిరంతరం తనిఖీలు కొనసాగిస్తాయని తెలిపారు.ఈతనిఖీల్లో పోలీస్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



కామారెడ్డి టూ శబరిమల భక్తులకు ఆర్టీసీ ఆఫర్

(కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 21 సింగిడి)

కామారెడ్డి జిల్లా ప్రజలకు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ దినేష్ కుమార్ శుభవార్త చెప్పారు అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములకు మరియు శబరిమల వెళ్ళు భక్తులకు టీజీవిఎస్ఆర్టిసి కామారెడ్డి బస్సు డిపో నుండి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు కల్పించబడినది అని తెలుపుటకు సంతోషిస్తున్నాము అని పి.దినేష్ కుమార్ డిపో మేనేజర్ కామారెడ్డి గారు తెలిపినారు శబరిమల వెళ్ళుటకు గురుస్వామి బస్సు బుక్కు చేసుకున్నచో వారికి ప్రయాణం చార్జీలు మినహాయింపు కలదు మరియు బస్సు సీటింగ్ కెపాసిటీ తో పాటుగా ఇద్దరు వంట మనుషులు ఇద్దరు మణికంఠ స్వామి లను అనుమతించ బడును శబరిమల వెళ్ళు బస్సులకు టోల్గేట్ రుసుము మరియు కర్ణాటక తమిళనాడు రాష్ట్రాలకు బార్డర్ టాక్సు భక్తులు చెల్లించవలసిన అవసరం లేదు టి జి ఎస్ ఆర్ టి సి బస్సులకు కేరళ రాష్ట్రంలో బోర్డర్ టాక్స్ లు మినాయింపు కలదు బస్సుల పార్కింగ్ చార్జీలు భక్తులు చెల్లించవలసి ఉంటుంది శబరిమల వెళ్ళు ఆర్టీసీ బస్సులలో అనుభవిజ్ఞులైన మరియు రూటు తెలిసినా మంచి నైపుణ్యం ఉన్న డ్రైవర్లను ప్రతి బస్సుకు ఇద్దరి చొప్పున ఇవ్వడం జరుగుతుంది అలాగే కార్తీక మాసం పురస్కరించుకొని భక్తుల కోసం ప్రముఖ పుణ్య శైవ క్షేత్రాలు అయినా శ్రీశైలం కాణిపాకం స్వర్ణ దేవాలయం జోగులాంబ కంచి కామాక్షి మరియు అరుణాచలం క్షేత్రాలను దర్శించుకొనుటకు కామారెడ్డి డిపో నుండి సూపర్ లగ్జరీ బస్సులను అదే ప్రతిపాదికంగా ఇవ్వబడును అని కామారెడ్డి పి దినేష్ కుమార్ బస్ డిపో మేనేజర్ కామారెడ్డి ఒక ప్రకటనలో తెలిపినారు.

వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

వేములవాడ నవంబర్ 21(సింగిడి)



మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించాలి.శనివారం రోజున జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, సిబ్బంది పనితీరు , శాంతి భద్రతలకి తీసుకున్నా చర్యలపై అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న సీసీటీఎన్ఎస్ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, రహదారి భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని,ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని నిరంతరం సమీక్షించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సూచించారు.వివిధ ప్రాంతాల నుంచి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాసులు, సి.ఐ వీరప్రసాద్ సిబ్బంది ఉన్నారు.

అర్హులను ఓటరు జాబితాలో చేర్చేందుకు చివరి అవకాశం

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లతో సమీక్ష
హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 21 (సింగిడి):



అర్హులైన వారిని ఓటర్ జాబితాలో చేర్చేందుకు ఇదే చివరి అవకాశమని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఎస్ ఐ ఆర్ లో భాగంగా ఏఎస్ డీ డీ అంశాలపై శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు/జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి హాజరయ్యారు.రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. బూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాలతో పాటు మరోసారి క్షేత్రస్థాయికి వెళ్లి సంబంధిత ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అర్హులైన ఓటర్లు ఎవరూ ఓటు హక్కును కోల్పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణకు లభించిన ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్లు, అధికారుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే ప్రచారం చేసినప్పటికీ దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోయిన అర్హులైన ఓటర్లను గుర్తించి, వారికి మరోసారి అవగాహన కల్పించాలని తెలిపారు. ఏ ఎస్ డీ డీ జాబితాలో ఉన్నప్పటికీ నివాసం మారని ఓటర్లు నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించవలసిన అవసరం లేదని, నివాసం మారిన వారు మాత్రం ఎన్యుమరేషన్ ఫారంతో పాటు అనాక్సర్–సి సమర్పించాలని వివరించారు. ఈ ప్రక్రియపై సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, బూత్ స్థాయి అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు .వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, తహసీల్దార్లు మహేష్, జయంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ఉమారాణి, ఎలక్షన్ సెక్షన్ అధికారి రెహమాన్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ బీమా అందించాలి

కరీంనగర్, నవంబర్21(సింగిడి)

నగరంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అందేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో బీమా నమోదు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, తొలి విడత ఇళ్ల నిర్మాణ పురోగతిపై చర్చించారు.నగరంలోని 66 డివిజన్లలో ఏర్పాటు చేసిన శిబిరాల ద్వారా 18 నుంచి 59 ఏళ్ల వయస్సున్న అర్హుల వివరాలను ఆధార్, రేషన్ కార్డుల ఆధారంగా తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ప్రతిరోజూ శిబిరాలను పర్యవేక్షించి, నమోదు వివరాలను అధికారులకు అందించాలని ఆదేశించారు.రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి తుది జాబితా సిద్ధం చేయాలని, నిజమైన నిరుపేదలనే లబ్ధిదారులుగా ఎంపిక చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపాలని తెలిపారు. తొలి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు లబ్ధిదారులతో సంప్రదిస్తూ పనులను పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ అయాజ్, ఉప కమిషనర్లు ఖాదర్ మొహియుద్దీన్, వేణుమాధవ్, సహాయ కమిషనర్ రాజమనోహర్, రెవెన్యూ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రాజనర్సు వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం

సిద్దిపేట, నవంబర్21(సింగిడి)

కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిపై సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు కడవెరుగు రాజనర్సు చేసిన అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, ప్రజాప్రతినిధుల స్థాయిని దిగజార్చే విధంగా బూతు పదజాలం ఉపయోగించడం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిరి కొండల్ రెడ్డి, నంగునూరు ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ సిద్దిపేట పట్టణ మున్సిపల్ చైర్మన్‌గా మూడుసార్లు బాధ్యతలు నిర్వహించిన రాజనర్సు తన హోదా, అనుభవాన్ని గుర్తుంచుకుని మాట్లాడాలని హితవు పలికారు.

సిద్దిపేట జిల్లాకు 'సురక్షిత్' గుర్తింపు



సిద్దిపేట, నవంబర్21(సింగిడి)

ఎయిడ్స్ నియంత్రణకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న మొబిలైజేషన్ ఫర్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాకు 'సురక్షిత్' హోదాను సాధించింది. ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. విద్యాసాగర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ తన్నీరు, వారి బృందం సిద్దిపేట కలెక్టర్ హైమావతిని కలిశారు. డాక్టర్ అనురాధ తన్నీరు మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ , నియంత్రణలో సిద్దిపేట జిల్లా సాధించిన ఈ గుర్తింపు సమష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం అందించిన సహకారం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ప్రోగ్రామ్ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ సపోర్ట్ సెంటర్ సిబ్బంది సమన్వయంతో పని చేయడం వల్ల ఈ మైలురాయిని సాధించడం సాధ్యమైందని తెలిపారు.

దీక్షా దివస్‌కు అలుగునూరు సిద్ధం

కరీంనగర్, నవంబర్21(సింగిడి)



తెలంగాణ ఉద్యమ చరిత్రలో అలుగునూరుకు ప్రత్యేక స్థానం ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. 2009 నవంబర్ 29న తెలంగాణ సాధన కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు బయలుదేరిన సమయంలో అలుగునూరు వద్ద అరెస్టు కావడం ఉద్యమంలో కీలక ఘట్టమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 29న అలుగునూరులో దీక్షా దివస్ సభను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.శనివారం మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులతో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం గంగుల మాట్లాడారు. దీక్షా దివస్ కేవలం పార్టీ కార్యక్రమం కాదని, తెలంగాణ ప్రజల చారిత్రక దినమని అన్నారు. రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటం, అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంతకాలం దీక్షా దివస్‌ను పవిత్ర దినంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.సభకు బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్నామని, కవులు, కళాకారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, ఉద్యమకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సభకు వచ్చే వారికి అవసరమైన సదుపాయాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమీకృత కలెక్టరేట్ సముదాయం ప్రారంభం



కరీంనగర్, నవంబర్21(సింగిడి)

కరీంనగర్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ సముదాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సముదాయంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక

విటమిన్స్ లోపం పోగొట్టే మినుముల అన్నం

ముందుగా గ్యాస్ వెలిగించి స్టవ్ మీద ఒక పాన్ పెట్టి, రెండు టేబుల్ స్పూన్ల నూనె వేడి చేయాలి. నూనె వేడి అయిన తర్వాత, మూడు టేబుల్ స్పూన్ల పొట్టు మినప్పప్పు వేసి స్టవ్ సిమ్ లో పెట్టి దోరగా వేయించాలి.

సాయి మినప్పప్పు కన్నా పొట్టు మినప్పప్పు వాడితేనే ఈ అన్నం రుచిగా ఉంటుంది. మినప్పప్పు ఎర్రగా, మంచి సువాసన వచ్చే వరకు వేయించాలి. మినప్పప్పు మంచిగా వేగిన తర్వాత, ఒక టేబుల్ స్పూన్ ధనియాలు, 30 గ్రాముల పచ్చి కొబ్బరి ముక్కలు, 10 ఎండుమిర్చి, ఒక టీస్పూన్ జీలకర్ర వేసి మరో నిమిషం పాటు వేయించుకోవాలి. ఈ దినుసులన్నీ బాగా వేగిన తర్వాత, స్టవ్ ఆఫ్ చేసి చల్లార్చుకోవాలి. చల్లారిన తర్వాత, ఈ వేయించిన దినుసులను మిక్సీ జార్ లోకి తీసుకోవాలి. ఇందులోనే అర టేబుల్ స్పూన్ ఉప్పు, పావు టేబుల్ స్పూన్ పసుపు వేసి బరకగా గ్రైండ్ చేసుకోవాలి. ఇంకా దీనిలో ఉప్పు వేయడం వల్ల కారప్పొడితో పాటు అన్నానికి మంచిగా పడుతుంది. ఈ కారం పొడిని పక్కన పెట్టుకోవాలి.

ఇప్పుడు స్టవ్ మీద ఒక కడాయి పెట్టుకుని ఒక టేబుల్ స్పూన్ నెయ్యి వేయాలి. నెయ్యి కొద్దిగా వేడి అయిన తర్వాత, 20 గ్రాముల జీడిపప్పు వేసి దోరగా వేయించాలి. జీడిపప్పు ఐచ్ఛికం. పిల్లల కోసం అయితే జీడిపప్పు వేస్తే ఇంకా రుచిగా ఉంటుంది. జీడిపప్పు వేగిన తర్వాత, అర టేబుల్ స్పూన్ ఆవాలు, అర టేబుల్ స్పూన్ జీలకర్ర వేసి చిటపటలాడనివ్వాలి. ఆ తర్వాత కొద్దిగా ఇంగువ, రెండు రెబ్బల కరివేపాకు వేసి వేయించాలి. ఇప్పుడు మనం ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న కారం పొడిని కూడా వేసి అర నిమిషం పాటు వేపుకోవాలి. కారం పొడి వేగిన తర్వాత, బియ్యాన్ని ఉడికించి తీసుకున్న అన్నాన్ని పాన్ లో వేయాలి. స్టవ్ ని హై ఫ్లేమ్‌లో పెట్టి అన్నాన్ని కారంతో పాటు స్పీడ్‌గా కలుపుకోవాలి. ఇలా హై ఫ్లేమ్‌లో పెట్టి కలపడం వల్ల ఉప్పు, కారాలు అన్నానికి చక్కగా పట్టి మంచి రుచి వస్తుంది.

దీనిని మీరు బాగా కలిపిన తర్వాత, చివరిగా ఒక టేబుల్ స్పూన్ నెయ్యి , అలాగే కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి మరోసారి కలుపుకుని స్టవ్ ఆఫ్ చేయాలి. అంతే, నోరూరించే మినప్పప్పు అన్నం సిద్ధం. ఈ మినప్పప్పు రుచితో తినేకొద్దీ తినాలనిపించేంత కమ్మగా ఉంటుంది. ఇది లంచ్ బాక్సులకు ఇంకా భోజనాలకు మంచి ఎంపిక.

అతివ Athiva Singidi

బరువు తగ్గాలంటే ఎంత నడవాలి?



బరువు తగ్గేందుకు నడక ఎంత ముఖ్యమో, దానిని ఏ విధంగా కొనసాగించాలనేది కూడా అంతే ముఖ్యం. రోజు ఒకేసారి ఎక్కువ దూరం నడవలేకపోయినా, చిన్న చిన్న నడకలను రోజువారీ పనుల్లో భాగం చేసుకోవచ్చు.

నడక వల్ల కేలరీలు ఖర్చవుతాయి. శరీర చురుకుదనం పెరుగుతుంది. అయితే కేవలం అడుగుల సంఖ్యను మాత్రమే లక్ష్యంగా పెట్టుకోవడం కాకుండా, నడక వేగం, ఆహారపు అలవాట్లు, శరీర పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

రోజూ ఎన్ని అడుగులు నడిస్తే బరువు తగ్గుతారు?

బరువు తగ్గాలనుకునే వారు రోజుకు 7,000 నుంచి 10,000 అడుగులు నడవడాన్ని ఒక లక్ష్యంగా పెట్టుకోవచ్చు. అయితే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా 10 వేల అడుగులు నడవాలనే నియమం లేదు. మీ వయస్సు, బరువు, ఆరోగ్య పరిస్థితి, శారీరక సామర్థ్యాన్ని బట్టి నడక లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. రోజూ తక్కువ అడుగులు నడిచేవారు మొదట తమ ప్రస్తుత స్థాయిని తెలుసుకుని, క్రమంగా అడుగుల సంఖ్యను పెంచుకోవడం మంచిది.

రోజుకు 5 వేల అడుగులు నడిచే వారు ఒక్కసారిగా 10 వేల అడుగులకు చేరుకోవడానికి ప్రయత్నించకుండా, వారానికి కొద్దికొద్దిగా అడుగుల సంఖ్యను పెంచుకోవచ్చు. ఇలా చేయడం వల్ల శరీరం కొత్త వ్యాయామ అలవాటుకు అలవాటు పడుతుంది. కాళ్ల నొప్పులు, అలసట వంటి సమస్యలు రాకుండా జాగ్రత్త పడవచ్చు.

రోజులో ఒకేసారి ఎక్కువ సమయం నడవడం కుదరకపోతే ఉదయం, సాయంత్రం రెండు భాగాలుగా నడవవచ్చు. ఉదయం 20 నుంచి 30 నిమిషాలు, సాయంత్రం మరో 20 నిమిషాలు నడవడం ద్వారా రోజువారీ శారీరక చురుకుదనాన్ని పెంచుకోవచ్చు.

బరువు తగ్గాలంటే ఈ విషయాలు గుర్తుంచుకోండి

నడక వేగం కూడా ముఖ్యమే

నడిచే సమయంలో అడుగుల సంఖ్యతో పాటు వేగం కూడా బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తుంది. నెమ్మదిగా నడవడం కంటే కొంచెం వేగంగా, శ్వాస వేగం పెరిగేలా నడవడం వల్ల శరీరానికి మెరుగైన వ్యాయామం అందుతుంది. అయితే నడుస్తున్నప్పుడు మాట్లాడగలిగేంత సౌకర్యం ఉండాలి. మరీ ఎక్కువగా ఆయాసపడేలా నడవకూడదు.

రోజులో ఎక్కువసేపు కూర్చోవడం తగ్గించండి

ఆఫీసుల్లో పనిచేసేవారు లేదా ఇంటి వద్ద ఎక్కువసేపు కూర్చునేవారు మధ్యమధ్యలో లేచి నడవాలి. ప్రతి గంటకు కనీసం కొన్ని నిమిషాలు నడవడం, మెట్లు ఉపయోగించడం, దగ్గర్లోని పనులకు వాహనాల బదులు నడిచి వెళ్లడం వంటి అలవాట్లు శారీరక చురుకుదనాన్ని పెంచుతాయి.

రోజంతా కూర్చుని ఉండి, సాయంత్రం ఒక్కసారే ఎక్కువ దూరం నడవడం కంటే రోజంతా శరీరాన్ని చురుకుగా ఉంచుకోవడం మంచిది.

నడకతో పాటు ఆహార నియమాలు పాటించాలి

బరువు తగ్గేందుకు నడక మాత్రమే సరిపోదు. తీసుకునే ఆహారంలోనూ మార్పులు చేసుకోవాలి. అధిక కేలరీలు కలిగిన ఆహారాలు, నూనెలో వేయించిన పదార్థాలు, చక్కెర ఎక్కువగా ఉండే పానీయాలను తగ్గించాలి. కూరగాయలు, పండ్లు, పప్పులు, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి.

శరీరానికి అవసరమైన పోషకాలు అందేలా ఆహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా నడిస్తే బరువు నియంత్రణకు సహాయపడుతుంది. నడక ద్వారా ఖర్చయ్యే కేలరీల కంటే ఆహారం ద్వారా అధిక కేలరీలు తీసుకుంటే బరువు తగ్గడం కష్టమవుతుంది. అందుకే వ్యాయామం, ఆహారం రెండింటిపై దృష్టి పెట్టాలి.

రోజూ మీ అడుగుల సంఖ్యను మొబైల్ లేదా ఫిట్‌నెస్ వాచ్ ద్వారా ట్రాక్ చేయండి.

మొదట మీ ప్రస్తుత నడక స్థాయిని తెలుసుకోండి.

క్రమంగా అడుగుల సంఖ్యను పెంచుకోండి.

వీలైనంత వరకు వేగంగా నడవడానికి ప్రయత్నించండి.

రోజూ ఒకే సమయంలో నడిచే అలవాటు చేసుకోండి.

నడకతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి.

తగినంత నీరు తాగుతూ, నిద్రకు ప్రాధాన్యత ఇవ్వండి.

గమనిక: రోజుకు 10 వేల అడుగులు నడవడం అందరికీ తప్పనిసరి కాదు. మీ శారీరక సామర్థ్యానికి అనుగుణంగా నడకను ప్రారంభించి క్రమంగా పెంచుకోవడం మంచిది. గుండె సంబంధిత సమస్యలు, కీళ్ల నొప్పులు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వ్యాయామం ప్రారంభించే ముందు వైద్యుల సలహా తీసుకోవాలి.

స్టాక్ మార్కెట్ Stock Market

భారీగా పతనమైన బిట్ కాయిన్ విలువ



ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ కరెన్సీ అయిన బిట్ కాయిన్ విలువ భారీగా తగ్గింది. రెండేళ్ల తరువాత తొలిసారిగా 56 వేల డాలర్లకు కుప్పకూలింది.

క్రిప్టో కరెన్సీ అయిన బిట్ కాయిన్ విలువ అంతర్జాతీయ స్థాయిలో భారీగా తగ్గింది. 2024 సెప్టెంబర్‌లో తొలిసారిగా భారీ స్థాయిలో 55,533 డాలర్లకు తగ్గిన దీని విలువ మళ్లీ రెండేళ్ల తరువాత.. ప్రస్తుతం అదే స్థాయిలో తగ్గిపోయింది. 2024 సెప్టెంబర్ తరువాత దీని విలువ నెమ్మదిగా పురోగమిస్తూ 2025 అక్టోబర్ నాటికి గరిష్ఠంగా 1,26,000 డాలర్లకు చేరుకోగా.. ప్రస్తుతం దీని విలువ సగానికి సగానికి సగం పడిపోయింది. ఇంత భారీ స్థాయిలో బిట్ కాయిన్ విలువ తగ్గిపోవడం రెండేళ్లలో ఇదే తొలిసారి. ఏఐ స్టాక్స్‌పై అందోళనలు ఉన్న నేపథ్యంలో వడ్డీ రేట్లు పెరుగుతాయన్న భయంతో క్రిప్టో ఈటీఎఫ్‌ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణల కారణంగానే.. బిట్ కాయిన్ కరెన్సీ విలువ సగానికి సగం పడిపోయిందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

కుప్పకూలిన గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లు

అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు అంచనాలు, 19 నెలల గరిష్ఠానికి చేరిన డాలర్, రూపాయి బలపడటంతో దేశీయ మార్కెట్లో సిల్వర్ ఈటీఎఫ్‌లు 9 శాతం వరకు, గోల్డ్ ఈటీఎఫ్‌లు 6 శాతం వరకు పతనమయ్యాయి. వెండి ధరలు మరింత తగ్గే అవకాశం ఉన్నందున, ఒకేసారి కాకుండా ధరలు స్థిరపడే వరకు వేచి చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లో గోల్డ్, సిల్వర్ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ETFs) ఇన్వెస్టర్లకు భారీ షాక్ తగిలింది. ఉదయం మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్ (MCX)లో ధరలు కాస్త సానుకూలంగానే ప్రారంభమైనప్పటికీ, అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలతో ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఫలితంగా సిల్వర్ ఈటీఎఫ్‌లు ఏకంగా 9 శాతం వరకు, గోల్డ్ ఈటీఎఫ్‌లు 6 శాతం వరకు కుప్పకూలాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ డిసెంబర్‌లో వడ్డీ రేట్లు పెంచుతుందనే అంచనాలు, 19 నెలల గరిష్ఠానికి చేరిన డాలర్ విలువ, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల వల్ల పెరుగుతున్న చమురు ధరలు బులియన్ మార్కెట్‌ను కుదిపేశాయి.

ఎస్‌బీఐ సిల్వర్ ఈటీఎఫ్‌కు అత్యధిక నష్టం!

మార్కెట్లో ఉన్న 20 సిల్వర్ ఈటీఎఫ్‌లలో ఎస్‌బీఐ సిల్వర్ ఈటీఎఫ్ అత్యధికంగా 9 శాతం పతనమై రూ. 142.64 కనిష్ఠ స్థాయిని తాకింది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, నిప్పాన్ ఇండియా సహా 16 సిల్వర్ ఫండ్స్ 7 శాతం చొప్పున నష్టపోయాయి. 26 గోల్డ్ ఈటీఎఫ్‌లలో యాక్సిస్, ఇన్వెస్కో, మోతీలాల్ ఓస్వాల్, ఛాయిస్ గోల్డ్ ఈటీఎఫ్‌లు 6 శాతం వరకు పడిపోగా, మిగిలిన 22 ఫండ్స్ 5 శాతం చొప్పున క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్సుకు 3,551.68 డాలర్లకు, వెండి 41.90 డాలర్లకు దిగివచ్చాయి.

ధరలు ఎందుకు పడిపోతున్నాయి?

ఈ ఆకస్మిక పతనాన్ని ప్లాన్ అహెడ్ వెల్త్ అడ్వైజర్స్ వ్యవస్థాపకుడు విశాల్ ధావన్ విశ్లేషిస్తూ.. "అమెరికాలో ద్రవ్యోల్బణ ఆందోళనలు, డిసెంబర్‌లో ఫెడ్ వడ్డీ రేట్లు పెంచే అవకాశం ఎక్కువగా ఉండటం ప్రపంచవ్యాప్తంగా బంగారం, వెండి ధరలపై ఒత్తిడి తెస్తోంది. వడ్డీ ఆదాయం ఇవ్వని ఆస్తులను కలిగి ఉండటం ఇలాంటి సమయాల్లో కష్టమవుతుంది. దీనికి తోడు భారత రూపాయి బలపడటం వల్ల దేశీయంగా ధరలు మరింత తగ్గుతున్నాయి" అని వివరించారు.

ఇన్వెస్టర్లు ఇప్పుడు ఏం చేయాలి?

జియోటస్ సీఈఓ విక్రమ్ సుబ్బురాజ్ మాట్లాడుతూ.. "ఇన్వెస్టర్లు బంగారం, వెండిని వేర్వేరుగా అంచనా వేయాలి. పోర్ట్‌ఫోలియో వైవిధ్యం కోసం ఇతర రంగాల్లో ఎక్కువగా ఉన్న వాటాను తగ్గించి బంగారాన్ని కొంత జోడించుకోవచ్చు. కానీ వెండి ధర గరిష్ఠాల నుంచి బాగా తగ్గింది కదా అని ఇప్పుడే పెంచకూడదు. సరఫరా లోటు మద్దతు ఇవ్వాలంటే ముందుగా ఇన్వెస్ట్‌మెంట్ అమ్మకాలు తగ్గాలి" అని సూచించారు.



ఎన్‌రిచ్ మనీ సీఈఓ పొన్ముడి ఆర్ టెక్నికల్ విశ్లేషణ అందిస్తూ.. "బంగారంతో పోలిస్తే వెండిలో ఒడిదుడుకులు ఎక్కువ. ఎంసీఎక్స్ సిల్వర్ స్థిరపడాలంటే రూ. 1,58,000 పైన నిలదొక్కుకోవాలి. ఒకవేళ రూ. 1,48,000 స్థాయి కంటే కిందకు పడిపోతే, రూ. 1,42,000 వరకు నష్టాలు పెరిగే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు. కాబట్టి రిటైల్ ఇన్వెస్టర్లు ధరలు స్థిరపడే వరకు వేచి చూడటం ఉత్తమం.



మీరు కొనే పసిడి అసలైనదేనా?

బంగారు ఆభరణాల స్వచ్ఛతకు హామీ ఇచ్చే హాల్ మార్కింగ్ వ్యవస్థలో భారీ లోపాలు ఉన్నాయని కాగ్ ముసాయిదా నివేదిక హెచ్చరించింది. గత 5 ఏళ్లలో 81 శాతానికి పైగా నగల దుకాణాలను బీఐఎస్ తనిఖీ చేయలేదని వెల్లడైంది. ఈ నేపథ్యంలో బంగారం కొనుగోలు చేసేటప్పుడు మోసపోకుండా ఉండాలంటే వినియోగదారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్ యూఐడీ నంబర్ ఎలా చెక్ చేయాలో తెలుసుకుందాం.

బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు చాలామంది కేవలం ఆ రోజు బంగారం ధర, తయారీ ఛార్జీలు, మొత్తం బిల్లు ఎంతైంది అనే అంశాలను మాత్రమే చూస్తారు. కానీ మనం కొంటున్న నగలు నిజంగానే స్వచ్ఛమైనవా, వాటిపై ఉన్న హాల్‌మార్క్ సరైనదేనా అనే విషయాన్ని పరిశీలించడం కూడా అంతే ముఖ్యం. బంగారం నాణ్యతకు హామీగా భావించే హాల్‌మార్కింగ్ వ్యవస్థలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ అంటే కాగ్ ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఆడిట్ నివేదిక హెచ్చరించింది. దిగ్భ్రాంతికర వాస్తవాలు కాగ్ నివేదిక ప్రకారం, గత 5 ఏళ్లలో దేశవ్యాప్తంగా నమోదైన నగల దుకాణాలలో 81 శాతానికి పైగా దుకాణాలను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అంటే బీఐఎస్ అధికారులు అసలు తనిఖీ చేయలేదు. నిబంధనల ప్రకారం లైసెన్స్ పొందిన ప్రతి నగల వ్యాపారి దుకాణాన్ని ఏడాదికి కనీసం ఒక్కసారైనా తనిఖీ చేయాల్సి ఉంటుంది.

కానీ ఆ నిబంధన సరిగ్గా అమలు కావడం లేదు. ప్రస్తుతం దేశంలోని 392 జిల్లాల్లో సుమారు 1,565 బీఐఎస్ ఆమోదిత హాల్‌మార్కింగ్ కేంద్రాలు ఉన్నాయి. 2.32 లక్షలకు పైగా నగల వ్యాపారులు బీఐఎస్ వద్ద నమోదు చేసుకున్నారు. అలాగే వెండి నాణ్యతను పరీక్షించేందుకు 327 కేంద్రాలు ఉన్నాయి. సిబ్బంది కొరత , మౌలిక సదుపాయాల సమస్యల వల్లే తనిఖీలు సరిగ్గా జరగడం లేదని బీఐఎస్ అధికారులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా తనిఖీలు లేకపోతే హాల్‌మార్కింగ్ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతింటుందని, సాంకేతికత , థర్డ్ పార్టీ ఆడిట్ల ద్వారా దీనిని బలోపేతం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

పాటించాల్సిన 6 జాగ్రత్తలు

బంగారం కొనుగోలు అనేది ఒక పెద్ద ఆర్థిక పెట్టుబడి కాబట్టి వినియోగదారులు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ముందుగా ఎప్పుడూ మంచి పేరున్న నమ్మకమైన దుకాణం నుంచే ఆభరణాలు కొనాలి. తక్కువ ధరలకు ఇస్తామనే తెలియని దుకాణాలకు దూరంగా ఉండటం మంచిది. రెండోది, ఆభరణాలపై బీఐఎస్ లోగో, స్వచ్ఛత గుర్తు అంటే 22K916 లేదా 18K750 వంటివి, 6 అంకెల హెచ్‌యూఐడీ నంబర్ ఉందో లేదో తప్పనిసరిగా తనిఖీ చేయాలి. మూడోది, ఆభరణం కొనుగోలు చేసే ముందే మీ మొబైల్‌లోని బీఐఎస్ కేర్ యాప్‌లో 6 అంకెల హెచ్‌యూఐడీ నంబర్‌ను నమోదు చేసి, ఆ నగకు సంబంధించిన పూర్తి వివరాలు సరైనవేనా అని నిర్ధారించుకోవాలి.

బిల్లు, రాళ్ల బరువులో అప్రమత్తత

నాలుగోది, కొనుగోలు చేసిన తర్వాత వ్యాపారి నుంచి వివరమైన పక్కా బిల్లు తీసుకోవాలి. ఆ బిల్లులో బంగారం స్వచ్ఛత , స్థూల బరువు, నికర బంగారం బరువు, హెచ్‌యూఐడీ నంబర్, బంగారం ధర, తయారీ ఛార్జీలు, జీఎస్టీ వివరాలు స్పష్టంగా ఉండాలి. ఐదోది, ఒకవేళ ఆభరణంలో వజ్రాలు లేదా ఇతర రాళ్లు పొదిగి ఉంటే, మొత్తం బరువును బంగారం బరువుగా లెక్కించకుండా, రాళ్ల బరువును తీసేసి నికర బంగారం బరువును బిల్లులో విడిగా రాయించుకోవాలి.

ఆరోది, ఆ బిల్లును ఎప్పుడూ సురక్షితంగా భద్రపరుచుకోవాలి. ఒకవేళ భవిష్యత్తులో ఆభరణం స్వచ్ఛతపై ఏదైనా సందేహం కలిగితే, దానిని బీఐఎస్ ఆమోదించిన అసెయింగ్, హాల్‌మార్కింగ్ కేంద్రంలో పరీక్షించుకోవచ్చు. వినియోగదారులు ఈ జాగ్రత్తలు పాటిస్తే మోసపోయే ప్రమాదం ఉండదు, మీ డబ్బు, నమ్మకం రెండూ సురక్షితంగా ఉంటాయి.

కాగా భారత్‌లో అమ్ముతున్న బంగారంలో కల్తీ బయటపడింది. చైనా నుంచి దిగుమతి అవుతున్న రీనియం అనే పౌడర్‌ను బంగారంలో కలిపి వినియోగదారులను చాలా మంది వ్యాపారులు మోసం చేస్తున్నారు. ఈ రీనియం మెటల్ ద్వారా చేసే గోల్డ్ కల్తీని గుర్తించడంలో అత్యాధునిక హాల్‌మార్కింగ్ యంత్రాలు కూడా ఫెయిల్ కావటం కస్టమర్లను టెన్షన్ పెడుతోంది. ఒకటికి రెండుసార్లు చెక్ చేస్తే కానీ కల్తీ జరిగిన విషయం తెలియట్లేదు. కాబట్టి వినియోగదారులు అప్రమత్తంగా ఉండటం మంచిది.

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం

నాగర్ కర్నూల్, నవంబర్ 21 (సింగిడి):
ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగర్ కర్నూల్ జిల్లాలోని మత్స్యకారులందరికీ మత్స్యశాఖ సీనియర్ అసిస్టెంట్ అచ్చన్న శుభాకాంక్షలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, మత్స్య సంపద అభివృద్ధి, వారి ఆర్థిక అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ 21న నిర్వహిస్తున్నామని, 1997 నవంబర్ 21న తొలిసారిగా ఈ దినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, చేపల ఉత్పత్తిని పెంచడం, జలవనరులను సంరక్షించడం, మత్స్య రంగం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేపల ఉత్పత్తిని పెంచడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని నీలి విప్లవం దిశగా మత్స్య రంగం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. జలవనరులను కాలుష్యం నుంచి కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. చేపల పెంపకం, విక్రయాలు, మార్కెటింగ్ ద్వారా మత్స్యకారుల ఆదాయాన్ని పెంపొందించడంతో పాటు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మత్స్య రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (PMMSY), ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ-యోజన (PM-MKSSY), మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డు వంటి పథకాలను అమలు చేస్తోందని వివరించారు. చేపల పెంపకానికి సబ్సిడీలు, ఆర్థిక సహాయం, చేపల విత్తన కేంద్రాల అభివృద్ధి, కోల్డ్ స్టోరేజ్, రవాణా, మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు ఈ పథకాలు దోహదపడతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మత్స్య రంగం మరింత అభివృద్ధి చెందాలంటే జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలను మత్స్యకార సహకార సంఘాలకు కేటాయించాలని, నాణ్యమైన చేప పిల్లలను విడుదల చేయాలని సూచించారు. మత్స్యకారులకు ఆధునిక చేపల పెంపకం పద్ధతులపై శిక్షణ, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు మహిళా మత్స్యకారులకు చేపల విక్రయానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. మత్స్య రంగం కేవలం ఆహార ఉత్పత్తికే పరిమితం కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి, ఉపాధి కల్పనకు, పోషకాహార భద్రతకు కీలకంగా నిలుస్తోందని అచ్చన్న పేర్కొన్నారు. చేపల సంపదను కాపాడుదాం మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుదాం మత్స్య రంగాన్ని అభివృద్ధి చేద్దాం అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా మత్స్యశాఖ జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఫిషర్మెన్ రాజకుమార్ నాగర్ కర్నూల్ అధ్యక్షులు తేప్పబాబు నాగనూలు అధ్యక్షులు తిరుపతయ్య సంఘ సభ్యులు తవిటి నిరంజన్ తెప్ప రుద్రయ్య తవిటి నరసింహ తవిటి నిరంజన్ తవిటి శంకర్ సోప్పరి యాదయ్య రవి తదితరులు పాల్గొన్నారు.



బీసీలను విస్మరిస్తే ప్రభుత్వాన్ని గద్దెదించుతాం

జాజుల శ్రీనివాస్

ఇల్లందు, నవంబర్ 21(సింగిడి) :
వచ్చేయదాది మార్చిలో జరిగే దేశవ్యాప్త జనాభా గణనకు ముందే జనాభా గణన జాబితాలో ఓబీసీ కాలాన్ని కచ్చితంగా చేర్చాలని బిసి సంఘాలా జే ఏ సి చైర్మన్ జాజుల శ్రీనివాస్ బిజెపి, ప్రధాని మోడీ డిమాండ్ చేశారు. శనివారం ఏక్త హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడుతూ, కేంద్రాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసే అందుకే జనగణన జాబితాలో ఓబీసీ కాలంను చేర్చలేదని ఆరోపించారు. దేశ జనాభాలో 80 కోట్లకు పైగా బీసీలు ఉన్నారని కానీ అన్ని రాష్ట్రాల్లో పాలకులంతా అగ్రవర్ణాలే కొనసాగుతున్నారు అన్నారు. జనగణనలో బీసీల జనాభా శాతాన్ని చేర్చి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దీనికోసం డిసెంబర్ 14న రామ్ లీలా మైదానంలో అలో బీసీ చలో ఢిల్లీ అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. దీనికి ముందే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి 2027 మార్చి జనాభా లెక్కల జాబితాలో ఓబీసీ కాలంను చేర్చాలని లేని పక్షంలో బిజెపిని గద్దదించి పుతామన్నారు. అనంతరం బిసి జేఏసీ రాష్ట్ర నాయకులు మడత వెంకట్ గౌడ్ మాట్లాడుతూ, రాబోయే కాలంలో బీసీ ఓటర్లు పాలక ప్రభుత్వాలకు ఓటు బ్యాంకు ద్వారా అగ్రవర్ణాల ఆధిపత్యానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా బీసీలంతా ఐక్యంగా పోరాటం చేస్తూ బీసీల సత్తా చాటాల్సిన అవసరం ఉందన్నారు. డిసెంబర్ 14న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి ఇల్లందు నుండి సుమారు 200 మంది బయలుదేరుతారని తెలిపారు. సమావేశా అనంతరం చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు.ఈ సమావేశంలో 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య, బంధం నాగయ్య, సరోజ, మునాఫ్,రామచందర్ తదితరులు పాల్గొన్నారు.



ఉప సర్పంచుల ఫోరం ఇన్చార్జిగా నరేష్ గౌడ్

బోధన్ ప్రతినిధి, నవంబర్ 21:(సింగిడి):
బోధన్ నియోజకవర్గ ఉప సర్పంచుల ఫోరం ఇంచార్జ్ గా బోధన్ మండలం ఉట్ పల్లి ఉప సర్పంచ్ నరేష్ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియోజకవర్గ ఉపసర్పంచుల ఫోరం ఇంచార్జ్ గా నియమించినందుకు ఉప సర్పంచు లఫోరం రాష్ట్ర అధ్యక్షులు కార్తిక్,రాష్ట్ర ఉపాధ్యక్షులు వికర్ పాషా, జిల్లా అధ్యక్షులు మహేష్, సహకరించిన ప్రతీఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



నీటి చుక్కే ప్రాణాధారం..



అమీన్ పూర్ నవంబర్ 21 సింగిడి:
పర్యావరణ పరిరక్షణ మరియు వ్యక్తిగత ఆరోగ్యం పై ప్రజల్లో చైతన్యం నింపేందుకు సాయి హై స్కూల్ విద్యార్థులు నడుం బిగించారు. అమీన్పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని బీరంగూడ సాయి స్కూల్ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సేవ్ వాటర్ నీటిని పొదుపు చేద్దాం ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు అవగాహన ర్యాలీ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల ఆవరణలో ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన రహదారుల గుండా సాగింది. విద్యార్థులు ప్లక్కార్డు చేత భూమి నీటిని వృధా చేయకండి భావితరాలకు అందించండి సేవ్ వాటర్ సేవ్ లైఫ్ జంక్ ఫుడ్ వద్దు ఆరోగ్యకరమైన ఆహారమే ముద్దు అంటూ చేసిన నినాదాలు పురవీధుల్లో మార్మోగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమేష్ బాబు.. నేటి ఆధునిక యుగంలో మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. మనం తిని ఫుడ్ విషయంలో అప్రమత్తంగా ఉండి పోస్టికాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యంగా ఉంటే అదే మన భవిష్యత్తుకు అసలైన బలం అవుతుంది అని విద్యార్థులకు తల్లిదండ్రులకు సూచించారు. కలుషిత ఆహారం ఫాస్ట్ ఫుడ్లకు దూరంగా ఉండి ఇంట్లో తయారు చేసిన పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే దృఢమైన సమాజాన్ని నిర్మించగలమని ఆయన చాటిచెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన కుటుంబాలు పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్
గద్వాల ప్రతినిధి, నవంబర్ 21 (సింగిడి):
జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ విషయాన్ని ఐజ మున్సిపల్ కమిషనర్ పి. చంద్రశేఖర రావు తెలిపారు.ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మరణిస్తే, ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం అందుతుందని వివరించారు.
ఈ బీమాకు సంబంధించిన పూర్తి ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని, లబ్ధిదారులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. శనివారం కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది భరత్, ఆర్పీల ఆధ్వర్యంలో ఐజ మున్సిపాలిటీ 19వ వార్డుకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక నమోదు కేంద్రంలో ప్రజల వివరాలను సేకరించి ఆన్లైన్లో నమోదు చేస్తున్నారు. దరఖాస్తు చేసుకునే వారు బీమా పొందే వ్యక్తి ఆధార్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ వివరాలు, రేషన్ కార్డు నంబర్, మొబైల్ నంబర్, నామినీ వివరాలను సమర్పించాలని సూచించారు.19వ వార్డు పరిధిలోని అర్హులైన కుటుంబాలన్నీ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.



పాఠశాలకు రెండు సీలింగ్ ఫ్యాన్లు వితరణ

ఇల్లందు,నవంబర్ 21(నినాదం) :
మండలం ఎంపీపీస్ ముత్తారపుకట్ట పాఠశాల అవసరాలను గుర్తించిna కుంజ రాంబాబు రెండు సీలింగ్ ఫ్యాన్లు వితరణగా అందజేశారు. సందర్భంగా పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ చైతన్యవంతమైన వారిని అన్నారు. సామాజిక స్పృహ సేవా బావ ఆలోచనలతో ఉన్న గ్రామస్తులు వారి గ్రామంలో ఉన్న పాఠశాల కు అవసరమైన మౌలిక సదుపాయాలను స్వయంగా కల్పించడం అభినందనీయమన్నారు. గతంలో ఈ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందించగా నేడు విద్యార్థులకు ఫ్యాన్స్ సౌకర్యాలు ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ విషయం అన్నరు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ కుంజా కృష్ణవేణి, హెచ్ఎం కబ్బాకుల రవి, ఉపాధ్యాయులు అరెం రవికుమార్, కిన్నెర మౌని ప్రత్యూష, ఇర్ప నందిని విద్యార్థుల తల్లిదండ్రులు కుంజా రాంబాబుకి కృతజ్ఞతలు తెలిపారు.

బిజేపి చీఫ్ నితిన్ నబిన్ పర్యటన రద్దు



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 11 (సింగిడి):
ఈ నెల 23న భారతీయ జనతా పార్టీ చీఫ్ నితిన్ నబిన్ నిజామాబాద్ పర్యటన రద్దయిందని ఎంపీ అర్వింద్ ధర్మపురి తెలిపారు. శనివారం బీజేపీ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరులతో ఎంపీ మాట్లాడుతూ కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలో ఒక్కరోజే కార్యక్రమాల వలన ఇబ్బందుల కారణంగా నిజామాబాద్ లో నితిన్ నబిన్ రావడం కుదరడం లేదని, ఆయన కరీంనగర్ లో పర్యటిస్తారని తెలిపారు. డిసెంబర్ మాసంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటన ఉంటుందని బిజేపి నేత సునీల్ బన్సాల్ ఖరారు చేశారన్నారు. సీఎం రేవంత్ ఏనాడు కూడా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన లేదు, రేవంత్ రెడ్డి ఎన్నడూ కూడా జై తెలంగాణ అనలేదు అన్నారు. కేసీఆర్ ప్రాణమిత్రుడు ఉత్తమ్ కుమార్ ను గెలిపించేందుకు అమరుడు శ్రీకాంతాచారి తల్లి కి హుజుర్ నగర్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని విమర్శించారు. ఉత్తమ్ కుమార్ ను గెలిపించేందుకు ఆనాడు శంకరమ్మ ను బలి చేశారని, కవిత ఓడిపోతే ఎమ్మెల్సీ ఇచ్చిన కేసీఆర్ శంకరమ్మ కు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. బి ఆర్ ఎస్ పాలన లో కాళేశ్వరం డిజైన్ లో లోపాలు ఉంటే తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రిపేర్ చేయడంలో విఫలమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ సునామీ సృష్టిస్తుందని జోస్యం చెప్పారు. కేటీఆర్ గర్జన సభలు కాదు తొందరపాటు చర్య అని ఎంపీ అర్వింద్ అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని, తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి తదితరులున్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సమీక్ష



ఖమ్మం, నవంబర్ 21(సింగిడి):
ఖమ్మం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం పై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామారావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు ఆర్.బి.ఎస్.కె బృందాలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. చిన్నారులలో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, రక్తహీనత మరియు ఇతర అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి, సకాలంలో మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. అలాగే, గుర్తించిన బాధిత చిన్నారులను తదుపరి చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రిలోని (జిల్లా సత్వర చికిత్స కేంద్రం) లేదా ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేసి, వారు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో ఆర్.బి.ఎస్.కె మొబైల్ హెల్త్ టీమ్స్ మరింత సమర్థవంతంగా పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి



గద్వాల ప్రతినిధి నవంబర్ 21 (సింగిడి):
ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్‌ను ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగించారంటూ బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ షావలి ఆచారి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు, 16వ వార్డు కౌన్సిలర్ మద్దిలేటి తీవ్రంగా ఖండించారు. ఒక రాష్ట్రానికి ఇన్‌చార్జిగా నియమించకపోవడం అంటే ఏఐసీసీ కార్యదర్శి పదవి నుంచి తొలగించినట్లు కాదని, ఏఐసీసీ సెక్రెటరీ ఎక్కడికి పోదని, స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల ఇన్‌చార్జిల నియామక సమయంలో సంపత్ కుమార్‌ను ఏ రాష్ట్రానికి బాధ్యతలు తీసుకుంటారని అడగగా, తెలంగాణలోనే పార్టీకి సేవ చేయాలనే ఉద్దేశంతో ఇక్కడ బాధ్యతలు కోరుకున్నారని తెలిపారు. అంతమాత్రాన ఆయనను పదవి నుంచి తొలగించినట్లు తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. తెలంగాణలో సంపత్ కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ తప్పకుండా సముచిత గౌరవం, మంచి అవకాశం కల్పిస్తుంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని పిలుపునిచ్చారు. సంపత్ కుమార్‌కు తగిన అవకాశం వచ్చినప్పుడు ఆయన సత్తా ఏమిటో తెలుస్తుందని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు.

మాతృశ్రీ పాఠశాలలో ఫుడ్ కార్నివాల్



బోధన్ ప్రతినిధి, నవంబర్ 21:(సింగిడి):
బోధన్ పట్టణంలోని మాతృశ్రీ హైస్కూల్ లో ఫుడ్ కార్నివాల్ ను ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులే స్వయంగా వివిధ రకాల వంటలను తయారుచేసి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ లు ప్రారంభించారు. విద్యార్థులు తయారుచేసిన ఆహార పదార్థాలను రుచి చూసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను, వ్యాపార నైపుణ్యాలను వెలికి తీసే అద్భుతమైన వేదిక అని అన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, పాఠశాల కరస్పాండెంట్ జయశ్రీ, డైరెక్టర్లు శశాంక్, శృతి,మేనేజర్ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ



ఆర్మూర్, నవంబర్ 21 (సింగిడి) :
బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం రోజున ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను స్థానిక గ్రామ సర్పంచ్ పుప్పాల నరేష్, ఉపసర్పంచ్ సదానంద్ గౌడ్, వార్డు సభ్యులు, స్థానిక కార్యదర్శి, బాస నరేందర్ లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుప్పల నరేష్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పారదర్శకంగా అందాలనే లక్ష్యంతో పథకాలను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. లబ్ధిదారులు పెన్షన్ మంజూరు పత్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధితో పాటు, అర్హులైన పేదలకు చేయూత అందించడానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ముందుండి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, లబ్ధిదారులు, గ్రామస్తులు, తదితరులు,పాల్గొన్నారు.

అర్హులైన కుటుంబానికి 5 లక్షల బీమా రక్షణ..



కల్వకుర్తి నవంబర్ 21 (సింగిడి):
తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని కల్వకుర్తి మండలం లోని మార్చాల గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ గొప్ప అవకాశాన్ని ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుటుంబ పెద్దకు అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేలా ఈ బీమా పథకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమం, కుటుంబాల ఆర్థిక భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంపై గ్రామస్థులందరికీ అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ బీమా పరిధిలోకి వచ్చేలా కృషి చేస్తామని సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో, ఉపసర్పంచ్ నిజాముద్దీన్, పంచాయతీ కార్యదర్శి గణేష్, వార్డు సభ్యులు ఆదిరాల యాదయ్య, పలుస అనురాధ, జంగయ్య గౌడ్, దొక్కా రజిత మల్లేష్, బిజినేపల్లి స్వాతి, బాలరాజు, అలివేలు, జంగమయ్య, ఎండీ సికిందర్, పర్వత్ రెడ్డి, అక్షయ, విశ్వేశ్వర్, సుమంత్, రాజశేఖర్ తదితరులతో పాటు గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

పీ.హెచ్.సీ ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 21 (సింగిడి) :
కమ్మర్పల్లి మండలం చౌట్పల్లిలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఆయా విభాగాలను సందర్శించి, పీ.హెచ్.సీ నిర్వహణ తీరును పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల స్టాక్, వైద్యులు, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. స్టాఫ్ నర్సు, స్వీపర్ మినహా ఇతర వైద్యులు, సిబ్బంది ఎవరూ లేకపోవడంతో కలెక్టర్ వారి గురించి ఆరా తీశారు. మెడికల్ ఆఫీసర్, మరికొందరు సిబ్బంది డిప్యూటేషన్ పై ఇతర చోట్ల పని చేస్తున్నారని చెప్పడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అక్కడి నుంచే జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ కి ఫోన్ చేసి రౌండ్ ది క్లాక్ పీ.హెచ్.సీలో వైద్యులు, సిబ్బంది లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే డిప్యూటేషన్ లను రద్దు చేయాలని ఆదేశించారు. పీ.హెచ్.సీ లోని రిసెప్షన్ సెంటర్, ఇన్ పేషంట్,, జనరల్ వార్డులు, ఫార్మసీ, ల్యాబ్, వ్యాక్సినేషన్ గది తదితర విభాగాలను సందర్శించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. మందులను నిల్వ ఉంచే డ్రగ్ స్టోర్ రూం అస్తవ్యస్తంగా ఉండడం పట్ల స్టాఫ్ నర్సును మందలించారు. మధుమేహం, మలేరియా, డెంగీ వంటి వ్యాధుల నిర్ధారణ, వాటి బారిన పడిన వారికి అందిస్తున్న చికిత్సల గురించి స్టాఫ్ నర్సును ప్రశ్నిస్తూ సమాధానాలు రాబట్టారు. కొన్ని రకాల ఔషధాల కాల పరిమితి ముగియనున్నట్లు గమనించిన కలెక్టర్, తక్షణమే ఇండెంట్ పంపించి అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. శీతలీకరణలో ఉంచాల్సిన ఔషధాలను ఫ్రిడ్జ్ లలోనే భద్రపరచాలని అన్నారు. గర్భిణీలకు ఏ.ఎన్.సీ చెకప్ లు క్రమం తప్పకుండా నిర్వహించాలని, హై రిస్క్ కేసులను ఏరియా హాస్పిటల్ కు రిఫర్ చేయాలని, ఈ.డీ.డీ క్యాలెండర్ ను పక్కాగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో పని చేయాలని సూచించారు. తాను మళ్లీ ఆకస్మిక తనిఖీకి వస్తానని, పరిస్థితిలో మార్పు కనిపించకపోతే చర్యలు తీసుకుంటానని కలెక్టర్ స్పష్టం చేశారు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిఫామ్స్ కొనుగోలుకు ఓపెన్ టెండర్లు..

నాగర్‌కర్నూల్, నవంబర్ 21 (సింగిడి):
జిల్లాలోని 20 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పీఎం శ్రీ (PM SHRI) పథకంలో భాగంగా హబ్ అండ్ స్పోక్ మోడల్ కింద అమలు చేస్తున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమానికి అవసరమైన యూనిఫామ్స్ కొనుగోలు చేసేందుకు ఓపెన్ టెండర్లు ఆహ్వానించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఏ. రమేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులతో పాటు స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు అవసరమైన యూనిఫామ్స్ సరఫరా చేసేందుకు అర్హత కలిగిన సంస్థలు, ఫర్మ్‌ల నుంచి టెండర్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన సంస్థలు 2026 నవంబర్ 23 నుంచి 27వ తేదీ వరకు తమ టెండర్లను సమర్పించవచ్చని తెలిపారు. టెండర్లకు సంబంధించిన పూర్తి వివరాలు, యూనిఫామ్స్ స్పెసిఫికేషన్లు, సరఫరా నిబంధనలు, ఇతర మార్గదర్శకాలను నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పొందవచ్చని వెల్లడించారు. అర్హత కలిగిన సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్ణీత గడువులోగా టెండర్లను సమర్పించి కొనుగోలు ప్రక్రియలో పాల్గొనాలని జిల్లా విద్యాశాఖాధికారి ఏ. రమేష్ కుమార్ కోరారు.

సుంకేట్ లో నూతన చేయూత పెన్షన్ల పంపిణీ

ఆర్మూర్, నవంబర్ 21 (సింగిడి):
నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని సుంకేట్ గ్రామంలో శనివారం సుంకేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.సీ.గంగాధర్ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ వనజ గౌడ్, ఉప సర్పంచ్ ఆకుల రాజేశ్వర్, పాలకవర్గ సభ్యులు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.సీ. గంగాధర్ సుంకేట్ గ్రామానికి నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 21 మంది వితంతువులకు, వికలాంగులకు 9 మంది లబ్ధిదారులకు, 8 మంది ఒంటరి మహిళలకు, ఆరు గీత కార్మిక లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ల లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంజూరుకు కృషి చేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి, సీఎం రేవంత్ రెడ్డికి లబ్ధిదారుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

సంక్షేమ పథకాలను అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఆర్మూర్, నవంబర్ 21 (సింగిడి) :
బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని దొనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన నూతన చేయూత పెన్షన్లను నూతన లబ్ధిదారులకు శనివారం రోజున స్థానిక సర్పంచ్ గడ్డం అనిల్, ఉప సర్పంచ్ భూమారెడ్డి, వార్డు సభ్యులు, స్థానిక కార్యదర్శి స్వప్న, దొనకల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు జిన్నా, అరుణ్, భాష మల్లికార్జున్, అలలా రాజ్ కుమార్, చింతకింది రవి, గడ్డం సతీష్, అల్లపు ముత్యం, భాష మహేందర్ ల సమక్షంలో లబ్ధిదారులకు నూతన పెన్షన్లను స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ గడ్డం అనిల్ ,ఉప సర్పంచ్ భూమా రెడ్డి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, నూతన చేయూత పెన్షన్లు అర్హులై ఉండి కూడా రాని వారికి దరఖాస్తులు ఉంటే అర్హులైన వారికి, అందించేలా స్థానిక బాల్కొండ ఇన్చార్జ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అర్హులైన వారికి అందించేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇన్చార్జి పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, గ్రామంలో అర్హులైన వారికి అందించేందుకు కృషి చేస్తున్నారని స్థానిక ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు, గ్రామస్తులు, తదితరులు,పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ప్రభుత్వం భరోసా



ఖమ్మం, నవంబర్21(సింగిడి):
రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తూ అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రవేశపెట్టిందని దీన్ని అందరూ సద్వినియోగ పరచుకోవాలని సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, గ్రంధాలయ చైర్మన్ ఖాదర్ బాబులు అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలో ప్రతి డివిజన్లలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో జరుగుచున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం నమోదు శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, దేశం లో మొట్ట మొదటి సారిగా మన రాష్ట్రము ప్రవేశ పెట్టిన ఈ పథకం గురించి వివరించి ప్రతి డివిజన్ లో మున్సిపల్ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలలో ఉచితంగా ప్రజలు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు, కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు ఆ కుటుంబానికి అండగా నిలవడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని ఇరువురు తెలిపారు. ప్రజల సంక్షేమం, కుటుంబాల భద్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకం ప్రయోజనాలను పొందేలా సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యం వెంకటేశ్వర్లు, మాలిదు మనీష్, కొట్టే సుధాకర్, పల్లెబోయిన చంద్రం, రజనీ, శశి, ఏలూరు శ్రీను వివిధ డివిజన్ల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు సాంకేతిక కోర్సుల్లో శిక్షణ

సద్వినియోగం చేసుకోవాలి టాస్క్ సి ఓ ఓ సంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

కల్వకుర్తి నవంబర్ 21 (సింగిడి):
గ్రామీణ ప్రాంతాల యువతకు ఆధునిక సాంకేతిక విద్యను చేరువ చేసి, వారిలో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలకు మార్గం చూపించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రత్యేక చొరవతో సుంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీ పేరుతో కల్వకుర్తిలో ఉచిత సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.డిసెంబర్ 1వ తేదీ మంగళవారం నుంచి ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభం కానుంది. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న పాత కృష్ణవేణి జూనియర్ కళాశాల భవనంలో కంప్యూటర్ ల్యాబ్ సదుపాయంతో పూర్తిగా ఉచితంగా శిక్షణ అందించనున్నారు. హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు పెట్టి ఆధునిక కోర్సులు నేర్చుకోలేని గ్రామీణ యువతకు స్థానికంగానే నాణ్యమైన సాంకేతిక విద్యను అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,
సుంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీలో ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా పలు కోర్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, జావా ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్, పైథాన్ ప్రోగ్రామింగ్, ఎస్క్యూఎల్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి ఐటీ, సాంకేతిక కోర్సులతో పాటు డిజిటల్ మార్కెటింగ్, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, జీఎస్‌టీ, ట్యాలీ, టాక్సేషన్ వంటి ఫైనాన్స్, అకౌంట్స్ కోర్సులు కూడా బోధించనున్నారు. వీటితో పాటు నాన్-ఐటీ కోర్సులు, వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

ఏఐ, మెషిన్ లెర్నింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం..
ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు), మెషిన్ లెర్నింగ్ (యంత్ర అభ్యాసం) కీలకంగా మారుతున్నాయి. కంప్యూటర్లు సమాచారాన్ని అర్థం చేసుకోవడం, ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం, సమస్యలను పరిష్కరించడం వంటి పనులు చేయడానికి ఉపయోగపడే సాంకేతిక తను ఏఐగా పేర్కొంటారు. అదే విధంగా డేటా ఆధారంగా కంప్యూటర్లు నేర్చుకుని అంచనాలు వేయడం, నిర్ణయాలకు సహాయపడే విధానాన్ని మెషిన్ లెర్నింగ్ అంటారు.చాట్‌జీపీటీ ద్వారా సమాధానాలు పొందడం, ఏఐతో ఫొటోలు రూపొందించడం, యూట్యూబ్‌లో మన అభిరుచులకు అనుగుణంగా వీడియోల సూచనలు రావడం, బ్యాంకుల్లో మోసపూరిత లావాదేవీలను గుర్తించడం వంటి అనేక ఉదాహరణలు ఈ సాంకేతికత వినియోగాన్ని తెలియజేస్తున్నాయి.
ఈ కోర్సులో ఏఐ ప్రాథమిక అంశాలు, మెషిన్ లెర్నింగ్ పరిచయం, పైథాన్ ప్రోగ్రామింగ్, డేటా విశ్లేషణ, ఏఐ సాధనాల వినియోగం, డేటా ఆధారంగా అంచనాలు రూపొందించడం, చిన్న ప్రాజెక్టుల పరిచయం వంటి అంశాలపై శిక్షణ అందించనున్నారు.

విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు మంచి అవకాశం..



ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు, డిగ్రీ చదువుతున్న యువత, బీఏ, బీకాం, బీఎస్సీ, బీటెక్, ఎంటెక్, డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులతో పాటు కంప్యూటర్ రంగంపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ శిక్షణకు అర్హులు. సాఫ్ట్‌వేర్ రంగంలో కెరీర్ ప్రారంభించాలనుకునే వారు, ఐటీ ఉద్యోగాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న వారు, తమ సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలనుకునే వారికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడనుంది.

శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలకు సహకారం..
కేవలం కోర్సుల బోధనకే పరిమితం కాకుండా యువతకు ఉద్యోగ రంగంలో అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, ఇంటర్వ్యూలకు సిద్ధం చేయడం, ఉద్యోగ మార్గదర్శకత్వం అందించడం, ప్లేస్‌మెంట్ అవకాశాలకు సహకరించడం వంటి కార్యక్రమాలను కూడా చేపట్టనున్నారు. తద్వారా శిక్షణ పొందిన యువత తమ ప్రతిభను నిరూపించుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన పునాది ఏర్పడనుంది.

గ్రామీణ యువత అభ్యున్నతే లక్ష్యం..
ఆర్థిక పరిస్థితులు యువత భవిష్యత్తుకు అడ్డంకిగా మారకూడదని, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక విద్య గ్రామీణ ప్రాంతాల యువతకు కూడా చేరాలనే ఆశయంతో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలకు చెందిన ప్రతిభావంతులైన యువత ఖరీదైన శిక్షణ కేంద్రాలకు వెళ్లలేక అవకాశాలను కోల్పోకూడదనే ఉద్దేశంతో కల్వకుర్తిలోనే ఉచిత కంప్యూటర్ ఆధారిత శిక్షణ అందించేందుకు ముందుకొచ్చారు.గ్రామీణ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వారిని నైపుణ్యం కలిగిన యువతగా తీర్చిదిద్దడమే సుంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీ ప్రధాన లక్ష్యంగా నిలుస్తోంది అని టాస్క్ సి ఓ ఓ సుంకి రడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు.

శతాబ్ది వైభవానికి శాంతినగర్ హైస్కూల్ ముస్తాబు

ఖమ్మం, నవంబర్ 21(సింగిడి):
ఖమ్మం నగరంలోని శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వందేళ్ల విద్యా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబవుతోంది. 1927లో ప్రారంభమైన ఈ విద్యాలయం 2026 -27 విద్యా సంవత్సరం నాటికి వంద సంవత్సరాల మైలురాయిని చేరుకోవడం విశేషం. ఎన్నో తరాల విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకునేలా తీర్చిదిద్దిన ఈ పాఠశాల చరిత్రలో శతాబ్ది వేడుకలు చిరస్మరణీయ ఘట్టంగా నిలవనున్నాయి.ఈ సందర్భంగా ఈ నెల 29వ తేదీ ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడం, గతంలో విద్యాబోధన చేసిన గురువులను సాదరంగా ఆహ్వానించి సత్కరించడం, పాఠశాల వందేళ్ల ప్రస్థానాన్ని స్మరించుకోవడం ఈ వేడుకల ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక, పూర్వ మరియు ప్రస్తుత ఉపాధ్యాయులకు ఘన సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ప్రముఖులు, పూర్వ విద్యార్థులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను గౌరవ అతిథులుగా ఆహ్వానించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.వందేళ్ల విద్యా ప్రస్థానం అంటే



కేవలం ఒక పాఠశాల చరిత్ర మాత్రమే కాదు, వేలాది మంది విద్యార్థుల బాల్య జ్ఞాపకాలు, గురువుల త్యాగాలు, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యా బోధనకు నిలువెత్తు నిదర్శనం. ఒకప్పుడు ఒకే తరగతి గదిలో చదువుకున్న స్నేహితులు, నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారు మళ్లీ కలుసుకునే అరుదైన అవకాశం ఈ శతాబ్ది వేడుకలు కల్పించనున్నాయి.
ఈ చారిత్రాత్మక వేడుకలను విజయవంతం చేయడానికి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు, తుమ్మల నాగేశ్వరరావు గారు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, జిల్లా కలెక్టర్ గారు, జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్ గారు, మున్సిపల్ కమిషనర్ గారు జిల్లా విద్యాశాఖ అధికారి గారు, పూర్వ / ప్రస్తుత ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొంటున్నారు అని, శాంతి నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్లగాని కృపా బాలానందం, పూర్వ విద్యార్థి కొప్పుల నరేశ్, కుంచకర్ల నగేశ్, పాస్యం బ్రహ్మారెడ్డి, భోగా గిరి, పుల్లఖండం రామకృష్ణ, రాఘవాచార్యులు, శ్రీగాధ శ్రీనివాస్‌లతో పాటు పలువురు విద్యార్థులు, డీ. నాగభూషణం, రాములు, శ్రీనివాస్, రాంబాబు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ పార్లమెంట్

బోధన్ ప్రతినిధి, నవంబర్ 21:(సింగిడి):
సాలురా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రధాన మంత్రి గా,స్పీకర్ గా, మంత్రులు గా, ప్రతిపక్ష నాయకులుగా పాత్రలు పోషించారు. ఎంపీలుగా వ్యవహరించిన విద్యార్థులు వివిధ ప్రజా సమస్యలను లేవ నెత్తిన ప్రశ్నలకు మంత్రులుగా ఉన్న విద్యార్థులు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాజీ మంజుషా మాట్లాడుతూ మాక్ పార్లమెంట్ ముఖ్య ఉద్దేశం విద్యార్థులకు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ పై ప్రత్యక్ష అవగాహన కల్పించడం, పుస్తకాల ద్వారా తెలుసుకునే విషయాలను ఆచరణలో అనుభవించేలా చేయడం, ప్రజాస్వామ్యం పై అవగాహన, పార్లమెంటరీ వ్యవస్థ పరిచయం, రాజ్యాంగ విలువల పెంపు, ప్రశ్నించే తత్వం, ప్రతిపక్ష పాత్ర అవగాహన, నాయకత్వ లక్షణాల అభివృద్ధి, వాక్చాతుర్యం ఆత్మవిశ్వాసం చర్చలు, సంప్రదింపుల నైపుణ్యం, పౌర బాధ్యతల అవగాహన రాజకీయ చైతన్యం లాంటి లక్షణాలను విద్యార్థులలో పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని అన్నారు.విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ సబ్ స్టేషన్‌లో శ్రమదానం

ఆర్మూర్, నవంబర్ 21 (సింగిడి) :
బాల్కొండ నియోజకవర్గం తిమ్మాపూర్ గ్రామంలో గల విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగిపోయి, విద్యుత్ అంతరాయానికి కలగడం వల్ల శనివారం రోజున స్థానిక సర్పంచ్ పుప్పల నరేష్, ఉప సర్పంచ్ సదానంద్ గౌడ్, వార్డు సభ్యులు, స్థానిక కార్యదర్శి, కారోబార్, తిమ్మాపూర్ సబ్ స్టేషన్ విద్యుత్ లైన్మెన్ రామచందర్, విద్యుత్ సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. శ్రమదాన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, విద్యుత్ సిబ్బంది, గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు సమిష్టిగా సబ్స్టేషన్ చుట్టూ, సబ్ స్టేషన్ లోపల పెరిగిన పిచ్చి మొక్కలను, ముళ్ళ పొదలను, చెత్త చెదారం తొలగింప చేశారు.సర్పంచ్ పుప్పాల నరేష్ స్వయంగా శ్రమదానం పనులను పర్యవేక్షించి పూర్తి



చేయించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుప్పల నరేష్ మాట్లాడుతూ సబ్ స్టేషన్ ఆవరణ నిండా పిచ్చి మొక్కలు తొలగించడం వల్ల, పరిసరాలు శుభ్రంగా ఉంటే విద్యుత్ సరఫరాకు ఆటంకం ఉండదు అని అన్నారు. విద్యుత్ సిబ్బంది కూడా సురక్షితంగా విధులు నిర్వర్తించడమే కాకుండా, విద్యుత్ ఆటంకాలు లేకుండా విద్యుత్ సక్రమంగా సరఫరా చేస్తారని, అందుకే సమాధానం నిర్వహించి శుభ్రత పనులు చేపట్టడం జరిగిందన్నారు. మౌలిక సదుపాయాలు, ప్రజల భద్రత, సేవలు, ఇవి తన బాధ్యత అని సర్పంచ్ చెప్పారు. కర్తవ్యనిష్ఠతో పని చేస్తున్నానన్నారు. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలిస్తూనే, సంక్షేమ పథకాల, అభివృద్ధి పనులలో ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ, అందరికీ ఆదర్శంగా నిలవాలని, సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిపి పాలకవర్గ సభ్యులు, విద్యుత్ సిబ్బంది, పారిశుద్ధ కార్మికులు, తదితరులు, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను అందించేందుకు ఎనలేని కృషి

ఆర్మూర్, నవంబర్ 21 (సింగిడి) :
బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని సెట్పల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ముందు స్థానిక సర్పంచ్ పెగడ విజయ్ కుమార్, ఉపసర్పంచ్ బడే సాయిరాం, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు లక్ష్మ రంజిత్, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్, నరసయ్య, రాజు, నరేష్, నర్సారెడ్డి, స్థానిక గ్రామ కార్యదర్శి ప్రియాంక, సమక్షంలో ప్రభుత్వం మంజూరు చేసిన నూతన చేయూత పెన్షన్లను స్థానిక ప్రజాప్రతినిధులు శనివారం రోజున లబ్ధిదారులకు అందజేశారు. సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందించే విధంగా బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి చొరవ తో ప్రత్యేక కృషి చేస్తున్నారని స్థానిక గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి లబ్ధిదారుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఘనంగా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు

కల్వకుర్తి నవంబర్ 21 (సింగిడి):
యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగడంతో పాటు సమాజంలో మంచి మార్పు తీసుకురావడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఆర్ఎస్పీ లీగ్ సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. క్రీడలు కేవలం బహుమతులు, గెలుపోటములకే పరిమితం కాకూడదని, యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదల, ఐక్యత వంటి సుగుణాలను పెంపొందిస్తాయని తెలిపారు. ప్రస్తుత సమాజంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం పెరుగుతూ నేరాలకు కారణమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా ఇలాంటి వ్యసనాలకు దూరంగా

రహదారి ఆక్రమణలను తొలగించిన మున్సిపల్ అధికారులు

కుత్బుల్లాపూర్, నవంబర్ 21 (సింగిడి): సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు గాజులరామారం సర్కిల్ లోని బాలాజీ లేఔట్లో ఉన్న రహదారి ఆక్రమణలను అధికారులు తొలగించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పోలీసుల సహాయంతో ఈ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. సర్కిల్ పరిధిలో అక్రమ కట్టడాలు కట్టినచో కఠిన చర్యలు తీసుకోబడుతాయని గాజులరామారం ఉప కమిషనర్ యు . వెంకట్రాములు హెచ్చరించారు. ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏ సి పి) ఆర్. సుమిత్ర, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (టి పి ఎస్) సంతోష్ కుమార్ తమ సిబ్బందితో కలిసి పాల్గొని పర్యవేక్షించారు. రహదారులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.



లకడారం అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్చెరు, నవంబర్ 21(సింగిడి): ప్రజలలో భక్తి భావం పెంపొందించడంలో భాగంగా నూతన దేవాలయాలు నిర్మించడం అత్యంత ఆవశ్యకమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లకడారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కౌన్సిలర్ మమత అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు రాములు గౌడ్, శంకర్ గౌడ్, కొమిరిశెట్టి శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో ఘనంగాతోపాజీ అనంత్ కిషన్ జన్మదిన వేడుకలు

ఐబీ గెస్ట్ హౌస్‌లో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డి ప్రతినిధి నవంబర్ 21 (సింగిడి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్ జన్మదిన వేడుకలు సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఐబీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో జన్మదిన వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఐబీ గెస్ట్ హౌస్‌కు చేరుకుని తోపాజీ అనంత్ కిషన్‌తో కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తోపాజీ అనంత్ కిషన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జార్జ్, మహేష్ ముదిరాజ్, రమేష్, గంగేరి శ్రీహరి, కుమార్, కరంజీత్ సింగ్ తదితరులతో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి ప్రసంగంలో సౌండ్ ఎక్కువ.. సొల్యూషన్ తక్కువ!

- అభివృద్ధి, నిధుల ప్రస్తావన లేకుండా ప్రతిపక్షాలపై విమర్శలకే సీఎం సభ పరిమితం
- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తీవ్ర విమర్శలు



సంగారెడ్డి ప్రతినిధి నవంబర్ 21 (సింగిడి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగంలో సౌండ్ ఎక్కువ.. సొల్యూషన్ తక్కువగా ఉందని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష నేతలను విమర్శించడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. ముఖ్యమంత్రి ప్రసంగ తీరు కాంగ్రెస్ పార్టీ పతనానికి పునాదులు వేస్తోందని ఆయన ఆరోపించారు. సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన బహిరంగ సభపై సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, మాజీ జణజ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి – చింతా ప్రభాకర్

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సభకు వస్తున్నారంటే నియోజక వర్గ అభివృద్ధికి నిధులు కేటాయిస్తారని, ప్రజలకు ఏదైనా వరం ప్రకటిస్తారని ఆశిస్తారని అన్నారు. అయితే సిద్దిపేట సభలో 26 నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలను తరలించి, ప్రభుత్వ ఖర్చుతో పార్టీ ప్లీనరీ నిర్వహించినట్లుగా వ్యవహరించారని విమర్శించారు. సభలో ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపులపై ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయకుండా ప్రతిపక్ష నేతలను దూషించడానికే సమయం కేటాయించారని ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడుతున్నారనే రాజకీయ కక్షతోనే ముఖ్యమంత్రి ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దల వద్ద తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. సొంత పార్టీ ఎమ్మెల్యేల సైతం ప్రభుత్వ పనితీరుపై బహిరంగంగా ప్రశ్నలు లేవనెత్తుతున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ పాలనలో 20 శాతం కమిషన్లు నడుస్తున్నాయని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆరోపించగా, ప్రభుత్వ పనితీరుపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా అసంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని హితవు పలికారు.

ముఖ్యమంత్రి భాష మార్చుకోవాలి: చంటి క్రాంతి కిరణ్

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న భాష, చేస్తున్న వ్యాఖ్యల్లో హుందాతనం కనిపించడం లేదని విమర్శించారు. సిద్దిపేటలో నిర్వహించిన సభలో కేసీఆర్, హరీశ్ రావు, కేటీఆర్‌లను విమర్శించడానికే ప్రాధాన్యత ఇచ్చారని, జిల్లా అభివృద్ధి గురించి ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయలేదని అన్నారు. గతంలో కేసీఆర్ బహిరంగ సభలకు వచ్చినప్పుడు చుట్టుపక్కల నియోజకవర్గాలకు అభివృద్ధి పనులు, నిధులు మంజూరు చేసేవారని గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి సభలు మాత్రం ప్రతిపక్ష నేతలపై విమర్శలకే పరిమితమవుతున్నాయని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి తన ప్రసంగాల్లో సంయమనం పాటించాలని, రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేలా వ్యవహరించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ కారుల త్యాగాలను గౌరవించాలని, వారి గురించి మాట్లాడే టప్పుడు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటు పడిందని, ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందని విమర్శించారు.

హామీలు అమలు చేయకపోతే పోరాటం: కాసాల బుచ్చిరెడ్డి.

మాజీ జణజ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. సంగారెడ్డి ప్రాంతానికి ముఖ్యమంత్రి వచ్చి అభివృద్ధికి ఎలాంటి నిధులు ప్రకటించకుండా హడావుడి చేసి వెళ్లిపోయారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ప్రతి వార్డుకు రూ.8 కోట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లలేదని, కనీసం నిధుల కేటాయింపుపై కూడా ప్రకటన చేయలేదని అన్నారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన రోడ్డు పనులు సైతం ఇప్పటివరకు పూర్తికాలేదని, అభివృద్ధి పనుల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ జణజ చైర్మన్ విజేందర్ రెడ్డి, మనోహర్ గౌడ్, వేణుగోపాలస్వామి, వాడే మల్లేశం, కసిని శ్రీకాంత్, నాయికోటి నవీన్, శ్రవణ్ రెడ్డి, జీవీ శ్రీనివాస్, నందకిషోర్, అంజాద్, అజీమ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలకు నా మద్దతు ఉంటుంది

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్, నవంబర్ 21 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 – జీడిమెట్ల డివిజన్ వెంకన్న హిల్స్ కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ వాసులంతా ఐకమత్యంతో ఉన్నపుడే అభివృద్ధి సాధ్యమని, కాలనీ అభివృద్ధిలో నూతన సంక్షేమ సంఘానికి నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు మురళీ, ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, హరిప్రసాద్, రామకృష్ణా రెడ్డి, గణేష్, కోశాధికారి మల్లేశ్వర్ రావు, సభ్యులు అప్పా రావు, రాజు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, దేవరకొండ శ్రీనివాస్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుబ్బడిఫత్తేపూర్‌లో వివాదస్పదమైన ప్రభుత్వ భూమి



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 21(సింగిడి): జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం గుబ్బడి ఫత్తే పూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమి గుట్ట స్థలం వివాదస్పదంగా మారింది. ఇదివరకే ఈ గుట్టపై కొంత భాగంలో చిన్న ఆలయం, కొంత భాగంలో మరో ప్రార్థన మందిరం నిర్మాణాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కృష్ణగిరి గుట్టగా ఆరాధిస్తూ దూపదీప నైవేద్యం కార్యాక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్న పాటి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తరుణంలో మరో సాంప్రదాయంకు చెందిన వారు వారికి చెందిన మతానికి సంబంధించిన గుర్తును ఏర్పాటు చేసి గుట్ట స్థలంలో మేము సహితం అంటూ వాదిస్తున్నారు. దీంతో ఈ స్థలం వివాదంగా మారింది. ఈ నేపథ్యంలో స్పరస్పరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. దీంతో అధికారులు చర్యలు ప్రారంభించారు. పోలీసులు కూడా ఈ విషయంలో ఇరువర్గాలతో సమన్వయ చర్యలు ప్రారంభించారు. అయితే ఈ సమస్య చిలికి చిలికి గాలివానగా మారకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల విస్తృత నాకాబంధీ

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా





వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 21 (సింగిడి): జిల్లా వ్యాప్తంగా విస్తృత నాకబంధీ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణ, నేర నియంత్రణ అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా నాకాబందీ ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది ప్రధాన రహదారులు, కూడళ్లు, ముఖ్యమైన ప్రాంతాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వాహనదారుల పత్రాలు, ట్రాఫిక్ నిబంధనల అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా మొత్తం 1,287 వాహనాలను తనిఖీ చేశారు. వీటిలో 610 ద్విచక్ర వాహనాలు, 218 త్రిచక్ర వాహనాలు, 296 నాలుగు చక్రాల వాహనాలు, 163 భారీ వాహనాలు ఉన్నాయి. తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటూ 120 ఈ-పెట్టీ కేసులు, 83 డీడీ కేసులు నమోదు చేశారు. అదేవిధంగా 272 ఈ-చలాన్లు జారీ చేసి మొత్తం రూ. 98,730 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేర నియంత్రణతో పాటు ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. నాకాబందీ వంటి ప్రత్యేక తనిఖీల ద్వారా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనల అమలును పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా జిల్లావ్యాప్తంగా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, చట్టాలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, నేరరహిత, సురక్షిత వికారాబాద్ జిల్లాకు భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

నాగారం డివిజన్‌లో సర్వే నంబర్ 291లో అక్రమ నిర్మాణాలు!

ప్రభుత్వ భూమి కబ్జాపై స్థానికుల అనుమానాలు..

అధికారుల మౌనంపై ప్రశ్నలు!



కీసర, నవంబర్ 21 (సింగిడి): ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్‌లో గల సర్వే నంబర్ 291 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత మున్సిపల్ అనుమతులు లేకుండానే కొందరు ప్రభుత్వ భూమిలో విచ్చలవిడిగా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత తహసీల్దార్, రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయా? లేక సంబంధిత అధికారుల పర్యవేక్షణలోనే ఈ వ్యవహారం జరుగుతోందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సర్వే నంబర్ 291లో ప్రభుత్వ భూమిపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమిలో కబ్జాలను తొలగించి, అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

- బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమంపై నిర్లక్ష్యం..
- కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు చేరుతున్న సంక్షేమ ఫలాలు
- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్, నవంబర్ 21(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం సర్కిల్ రోడ్ మేస్త్రీ నగర్ డివిజన్ లోని శ్రీరాంనగర్, ఎన్టీఆర్ నగర్‌లలో 1.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పిసిసి అధికార ప్రతినిధి సొంటి రెడ్డి పున్నారెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గానికి డిగ్రీ కళాశాల, రెసిడెన్షియల్ పాఠశాల, ఆసుపత్రి వంటి కీలక అభివృద్ధి సంస్థలను తీసుకువచ్చానని, బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో వున్నా ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యే నిర్లక్ష్యం కారణంగా అవి పక్క నియోజకవర్గానికి తరలిపోయాయని విమర్శించారు. తన హయాంలో సుమారు 40 వేల మందికి పెన్షన్లు మంజూరు చేయించానని, ప్రస్తుత ఎమ్మెల్యేగా కొనసాగుతున్న నాయకుడు ఒక్క పెన్షన్ కూడా మంజూరు చేయించలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 6,600 చేయూత పెన్షన్లు అందించడంతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. గాజులరామారం సర్వే నంబర్ 307లో ప్రభుత్వ భూములను బీఆర్ఎస్ నాయకులు విక్రయించి, నిరుపేదలకు అమ్మి వారిని నేడు రోడ్డున పడేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక స్థాయి ప్రస్తుత ఎమ్మెల్యేకు లేదని అన్నారు. కేసీఆర్ బొమ్మను చూపించి విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేసి ఎమ్మెల్యేగా గెలిచారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, స్థానిక డివిజన్ అధ్యక్షుడు మధుసూదన్, కాంగ్రెస్ నాయకులు డిసిసి సెక్రెటరీ బుచ్చిరెడ్డి, డిసిసి జనరల్ సెక్రెటరీ జిమ్మి దేవేందర్, రషీద్, ఐలయ్య, సలీం, బలరాం,రఘు,రజాక్, కాలనీ వాసులు నాగభూషణం, వెంకటేష్, నరసింహ,సాయి ప్రవీణ్, శ్రీనివాస్ గౌడ్, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ప్రతిఒక్కరూ సైక్లింగ్ అలవరుచుకోండి.. ఆరోగ్యంగా ఉండండి

- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



కుత్బుల్లాపూర్, నవంబర్ 21 (సింగిడి): కూకట్ పల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీలో బషీర్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టార్ సైకిల్ స్టోర్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శారీరకంగా దృఢంగా ఉండేందుకు ప్రతీ ఒక్కరూ సైక్లింగ్ ను అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు శ్రీధర్, కమలాకర్ , మూసా ఖాన్, మక్సూద్ అలీ, మెట్ల శీను, జునైద్ పాల్గొన్నారు.

కార్తీక దీపాలతో...
కీసరగుట్టలో ఆధ్యాత్మిక శోభ

కీసరగుట్ట ఆలయానికి పోటెత్తిన భక్తులు
ప్రత్యేకత సంతరించుకున్న దీపాల శోభ





మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 21 (సింగిడి): మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ కీసరగుట్టలో కొలువైయున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్తీక మాసం సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం కావడంతో కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. శనివారం కార్తీక దీపాల అలంకరణతో కీసరగుట్ట దేదీప్యమానమైంది. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఆలయ ప్రాంగణంలోని భక్తులు కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గర్భాలయంలోని కొలువుదీరిన శ్రీ భవాని రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్తిక మాసంలో ప్రతిరోజు ఉదయం సాయంత్రం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నారు. సంధ్యా సమయంలో దీపారాధన చేయడం కార్తీక మాసంలో నదీ స్నానం చేయడం ఎంతో విశేషమని ఆలయ ప్రధాన అర్చకులు రవి శర్మ తెలిపారు. అలాగే కార్తీక పౌర్ణమి రోజున కీసరగుట్ట ఆలయ ప్రాంగణంలో నిర్వహించే జ్వాలాతోరణం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అర్చకులు తెలిపారు.

భక్తులకు సకల సౌకర్యాలు..

కార్తీక మాసం సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రవి శర్మ మాట్లాడుతూ కార్తీక మాసంలో పరమశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ముఖ్యంగా కార్తీక మాసంలో దీపారాధన చేయడం ఎంతో విశేషం అన్నారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు జరుగుతున్నాయని కార్తీక పౌర్ణమి రోజున ఆలయ ప్రాంగణంలో నిర్వహించే జ్వాలాతోరణం ప్రత్యేక ఆకర్షణ అని తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా కీసరగుట్టకు వచ్చే భక్తులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక భక్తి శోభను సంతరించుకున్నాయి. ప్రతి ఏటా కార్తీక మాసంలో నిర్వహించే ప్రత్యేక పూజలకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పరిధిలోనే కాక రాష్ట్రంలోని నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారని తెలిపారు. స్వామి వారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కీసర గుట్ట భక్తసంద్రంగా మారిందని తెలిపారు.

జిల్లా స్థాయి ఎన్నికల క్విజ్‌లో
శ్రీరంగాపురం విద్యార్థిని విజయకేతనం

50 మార్కులకు 49 మార్కులు.. జిల్లా ప్రథమ స్థానంలో షిజా

చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ.. ప్రశంసా పత్రంతో సత్కారం



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 21 (సింగిడి): చదువులో పట్టుదల, ప్రతిభకు వయసుతో సంబంధం లేదని నిరూపించింది శ్రీరంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని కుమారి షిజా. వనపర్తి జిల్లా ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ఎన్నికల క్విజ్ పోటీల్లో 50 మార్కులకు గాను ఏకంగా 49 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. చిన్న వయసులోనే ఎన్నికల వ్యవస్థ, ప్రజాస్వామ్య అంశాలపై విశేష అవగాహనతో అద్భుత ప్రతిభ కనబరిచిన షిజా అందరి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారులు ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డిఆర్ఓ రామ్ రెడ్డి, జిల్లా క్రీడల అధికారి సుధీర్ రెడ్డిలు శనివారం కలెక్టరేట్‌లో ఆమెకు ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ విజయంతో శ్రీరంగాపురం పాఠశాల కీర్తిని జిల్లా స్థాయిలో చాటిన షిజాపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థినిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఈ.జ్యోతి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు సి. బుచ్చమ్మ లు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు. 49 మార్కులతో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం షిజా ప్రతిభకు నిదర్శనమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

పాఠశాలల అభివృద్ధికి యూఎస్‌టీ సంస్థ సహకారం అభినందనీయం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హనుమకొండ, నవంబర్ 21 (సింగిడి): విద్యార్థులు చదువుకున్న పాఠశాలలను విస్మరించకుండా సమాజ సేవలో భాగస్వాములు కావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి అన్నారు. యూఎస్‌టీ సంస్థ సహకారంతో నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో , యువ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి ప్రత్యేక ప్రోత్సాహంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మర్మజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శాయంపేట ప్రభుత్వ పాఠశాలలకు పాఠశాల మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సీ ఎస్ ద్వారా ఆర్వో వాటర్ ప్లాంట్లు, కంప్యూటర్లను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూఎస్‌టీ సంస్థ తరఫున విచ్చేసిన విజయ్ కుమార్ తో పాటు వారి బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. తాను చదువుకున్న పాఠశాలను గుర్తు పెట్టుకొని, అక్కడి విద్యార్థుల అభ్యున్నతి కోసం ముందుకు వచ్చి సేవ చేయడం అభినందనీయమని అన్నారు. మంచి ఉద్యోగాలు, ఉన్నత స్థాయికి చేరుకున్న ప్రతి ఒక్కరూ చదువుకున్న పాఠశాలలు, కళాశాలలు, సొంత ప్రాంతాలను మర్చిపోకుండా తమకు తోచిన సహాయం అందించాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ, క్రీడలకు కూడా ప్రోత్సాహం అందిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. వరంగల్ జిల్లాను విద్యా హబ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని, ఇందుకోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. శాయంపేట ప్రాంత అభివృద్ధి గతంలో ఉన్న పరిస్థితులకు, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధికి ఎంతో వ్యత్యాసం ఉందని అన్నారు. రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ దీన్ దయాళ్ నగర్ , బోడగుట్ట ,సుజిత్ నగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని ఆయన వివరించారు.

46వ రోజూ అన్నప్రసాద వితరణ..

340 మందికి పైగా స్వాములకు అన్నదానం



కోదాడ, నవంబర్ 21 (సింగిడి): తెలంగాణ శబరిమలగా ప్రసిద్ధి చెందిన అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో చేపట్టిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తుల ఆదరణతో కొనసాగుతోంది. శనివారం 46వ రోజు సుమారు 340 మందికి పైగా అయ్యప్ప స్వాములు అన్నప్రసాదం స్వీకరించారు. ఖానాపురం గ్రామానికి చెందిన కనగాల నరసింహారావు--రాధమ్మ దంపతులు, వారి కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించారు. భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పందిరి వీరయ్య, గింజుపల్లి సురేష్ దంపతులు, గింజుపల్లి రమేష్, కనగాల వీరయ్య, ఐతనబోయిన వెంకటేశ్వర్లు, ఈదుల యాదగిరి, దందు రమేష్‌తో పాటు పలువురు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు అర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హనుమకొండ, నవంబరు 21 (సింగిడి): పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిరంతరం సేవలందిస్తున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన సుమారు 120 మంది లబ్ధిదారులకు రూ.65, 25 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం పొందేందుకు ఎవరూ దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని, మధ్యవర్తులకు వందలు, ఐదువందలు, వేల రూపాయలు ఇచ్చి మోసపోవద్దని ఆయన సూచించారు. ప్రజలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లేదా తమ తమ డివిజన్లలోని



కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా దరఖాస్తు చేసుకుంటే, వాటిని స్వయంగా పరిశీలించి హైదరాబాద్‌కు తీసుకెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి మంజూరు చేయించే బాధ్యతను తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ప్రతి నెలా రెండుసార్లు సీఎం సహాయ నిధి చెక్కులను తీసుకొచ్చి లబ్ధిదారులకు అందిస్తున్నామని, లబ్ధిదారులు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా వారి ఇళ్ల వద్దకే చెక్కులు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఆయా డివిజన్ల నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షుల ద్వారా లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తూ పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 2,700 మందికి చేయూత ఆసరా పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు, ప్రతి డివిజన్‌కు సగటున 110 మంది చొప్పున కొత్త లబ్ధిదారులకు పెన్షన్లు అందించామని వివరించారు.

అదేవిధంగా నియోజకవర్గంలో సుమారు 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. సన్నబియ్యం పంపిణీతో పాటు అనేక సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు.ప్రజలకు ఏ అవసరం వచ్చినా 24 గంటలూ అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు బీమా ఆర్థిక భద్రత

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ నవంబర్ 21 (సింగిడి): పేద కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఆయన మిర్యాలగూడ మున్సిపల్ పరిధిలోని బంగారుగడ్డ వార్డులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు, నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి నన్న బియ్యం, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు వంటి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, 1500 ఇండ్లకు



డిసెంబర్ 9న భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద 5 లక్షల పరిమితిని 10 లక్షలు చేయడం జరిగిందని, ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించి రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రస్తుతం రేషన్ కార్డు ఉన్నప్రతి కుటుంబం ఈ పథకానికి అర్హులని రాష్ట్ర ప్రభుత్వం దురదృష్టితో ఆలోచించి ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఇదివరకే వివిధ రకాల జీవిత బీమా పథకాలు ఉన్నప్పటికీ ఈ పథకం వర్తిస్తుందని, అందువల్ల మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రజలందరూ ఈ పథకం కింద నమోదు కావాలని, ఇందుకు అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డులలో కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి ఒక్కరు ఈ పథకం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద ప్రతి కుటుంబం నమోదు కావాలని, 18 నుండి 59 సంవత్సరాల లోపు ఉండి రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఉన్న ప్రతి కుటుంబం నమోదు చేసుకోవచ్చని, రేషన్ కార్డులేని వారికి తర్వాత నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలోమిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ సుధా బాలకృష్ణ, ఆర్డీవో రమణ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ శ్రీజా రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్ ,ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ప్రకృతి వ్యవసాయంపై కృషి సఖీలకు రెండు రోజుల శిక్షణ

- సహజ వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను వివరించిన నిపుణులు

వనపర్తి ప్రతినిధి, నవంబర్ 21 (సింగిడి): జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్--2026లో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని నాగవరం రైతు వేదికలో శనివారం కృషి సఖీలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఘనపురం, రేవల్లి మండలాలకు చెందిన కృషి సఖీలు ఒక్కో మండలం నుంచి ఇద్దరు చొప్పున ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుస్థిర వ్యవసాయ కేంద్రం నుంచి వచ్చిన



ఉదయ్ కుమార్ ప్రకృతి వ్యవసాయం, సహజ వ్యవసాయ విధానాలపై కృషి సఖీలకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి సిద్ధమైన పద్ధతులతో సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నేల సారాన్ని కాపాడుకోవడం, పర్యావరణ పరిరక్షణ, రైతులకు తక్కువ పెట్టుబడితో సుస్థిర వ్యవసాయం అందుబాటులోకి తీసుకురావడంలో ప్రకృతి వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడంలో కృషి సఖీలు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి, కృషి సఖీలు పాల్గొన్నారు.

ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలి

- మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి
- సంఘ అధ్యక్షుడు బాలరాజు విజ్ఞప్తి

వనపర్తి ప్రతినిధి, నవంబర్ 21 (సింగిడి): ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా గోపాల్ పేట మండల కేంద్రంలోని మత్స్యకారుల భవనంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘం అధ్యక్షుడు బి.బాలరాజు సంఘ సభ్యులతో కలిసి మత్స్యకారుల జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ముదిరాజులను బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలని కోరారు. ముదిరాజుల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ లిమిటెడ్‌కు వెయ్యి కోట్ల కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి మత్స్యకారుడికి పింఛన్ సౌకర్యం కల్పించాలని, విద్యలో వెనుకబడిన ముదిరాజు మత్స్యకారుల పిల్లల కోసం ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ



రాష్ట్రమత్స్యశాఖకు రూ. 3,000 కోట్లు కేటాయించి వివిధ సంక్షేమ పథకాల ద్వారా మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు మేస్త్రి బాలయ్య, ఉపాధ్యక్షుడు ఎస్.రాములు, డైరెక్టర్లు పోతురాజు రాములు, గంగాన వెంకటయ్య, టెలిఫోన్ బాలయ్య, డీలర్ వెంకటయ్య, బి.సాయిబాబు, బి.నరసింహ, ఎస్.చిన్న బక్కన్న, వెంకటయ్య, సతీష్, రాములు, శ్రీనివాసు, ఈ.రమేష్, చెన్నకేశవులు, కే.రాములు, బి.రాములు, బోయిని మన్యం, కండక్టర్ బాలరాజు, ఎస్.దామోదర్, బి.ఆంజనేయులు, ఎస్.రామస్వామి, ఎస్.చందు, కే.బాలకృష్ణ, బి.కురుమయ్య, గోకం నిరంజన్, కేతపల్లి కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం నేటి అవసరం

మున్సిపల్ కమిషనర్ శ్రీజా రెడ్డి



మిర్యాలగూడ నవంబర్ 21 (సింగిడి): శాస్త్రీయ దృక్పథం నేటి యువతకు ఎంతో అవసరమని మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి అన్నారు శనివారం జ్యోతిరావు పూలే భవన్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మిర్యాలగూడ మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు . బహుమతి ప్రధానానికి ముఖ్య అతిథిగా హాజరై . మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత పెంపొందించుకోవాలని, మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ సాంకేతిక ప్రపంచంలోని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ధర్మ నాయక్, కృష్ణమూర్తి కేశవులు వెంకటేశ్వర్లు ఉమారాణి జ్యోతి , మాదవి, సైదిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, పద్మావతి 34 పాఠశాలల గైడ్ టీచర్లు, 102 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు పట్టణానికి చెందిన వైద్యులు మునీర్ తన కుమార్తె సాధియా పుట్టినరోజు సందర్భంగా పెన్నులను వ్యాపారవేత్త రాజేంద్రప్రసాద్ బిస్కెట్లు ప్యాకెట్లను పంపిణీ చేశారు.

73 ఏళ్ల మహిళకు జాగ్రత్తగా కీమోథెరపీ..

మలక్‌పేట్ యశోదా వైద్యుల సేవలు



మిర్యాలగూడ నవంబర్ 21(సింగిడి): ఎముకల నొప్పి, రక్తహీనత, నిరంతర నీరసం వంటి లక్షణాలు మల్టిపుల్ మైలోమా అనే రక్త క్యాన్సర్‌కు సంకేతాలు కావచ్చని యశోదా ఆసుపత్రి ఆంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్ రెడ్డి సూచించారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నల్లగొండ జిల్లా వడపల్లికి చెందిన 73 ఏళ్ల మహిళ మల్టిపుల్ మైలోమా మూడో దశతో పాటు షుగర్, బీపీ, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతుండగా హైదరాబాద్ మలక్‌పేట్ యశోదా ఆసుపత్రి వైద్యులు ప్రత్యేక జాగ్రత్తలతో కీమోథెరపీ అందించారు. పల్మనాలజీ నిపుణుల సలహాతో ఇన్ఫెక్షన్‌కు చికిత్స చేస్తూనే వీఆర్‌డీ లైట్ విధానంలో కీమోథెరపీ కొనసాగించారు. చికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో అవసరమైన మందులు అందించి డిశ్చార్జ్ చేశారు. వృద్ధుల్లో ఎముకల నొప్పి, రక్తహీనత, మూత్రపిండాల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించు కోవాలన్నారు.



Singidi Sports
స్పోర్ట్స్ సింగిడి

306 పరుగుల తేడాతో..
భారత్-ఎ ఘనవిజయం

దోహా: ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో భారత్-ఎ ఘనవిజయం సాధించింది. నేపాల్‌ను 306 పరుగుల భారీ తేడాతో ఓడించింది. ముందు బ్యాటింగ్ చేసిన భారత్-ఎ 50 ఓవర్లలో 332/9 చేసింది. కెప్టెన్ తిలక్ వర్మ 107 పరుగులు, కుమార్ కుశాగ్ర 117 పరుగులు చేసి శతకాలు బాదారు. ఇద్దరూ కలిసి 206 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 333 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ 11.3 ఓవర్లలో కేవలం 26 పరుగులకే ఆలౌట్ అయింది. ప్రిన్స్ యాదవ్ 5/6, హర్షిత్ రాణా 4/16తో చెలరేగారు. ఈ విజయంతో భారత్-ఎ లిస్ట్-ఎ క్రికెట్‌లో అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది. నేపాల్ 26 పరుగులు లిస్ట్-ఎ చరిత్రలో 5వ అత్యల్ప స్కోరుగా నిలిచింది.

సిరాజ్ విషయంలో
మనం మాట్లాడొద్దు

మాజీ కెప్టెన్ కపిల్ దేవ్







న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో సిరాజ్‌ను తప్పించడంపై మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ స్పందించారు. "సెలక్టర్లనే అడగండి. మాలాంటి వాళ్లు మాట్లాడకూడదు. వాళ్లు మంచి పని చేస్తున్నారు. జట్టు ఎంపిక సెలక్టర్, కెప్టెన్‌దే" అని అన్నారు. సిరాజ్‌ను పేరు కారణంగా పక్కన పెట్టారన్న కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ ఆరోపణలను కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు ఖండించారు. అవకాశాలు మెరిట్ ఆధారంగానే ఇస్తారని స్పష్టం చేశారు. మ్యాచ్ మొత్తాన్ని దృష్టిలో పెట్టుకునే నిర్ణయం తీసుకున్నామని జట్టు నిర్వహణ తెలిపింది.

సురేష్ రైనాను CSK వాడుకుని వదిలేసింది..
అంబటి రాయుడు సంచలనం

చెన్నై: చెన్నై సూపర్ కింగ్స్‌పై మాజీ ఆటగాడు అంబటి రాయుడు సంచలన వ్యాఖ్యలు చేశాడు. సురేష్ రైనాను CSK వాడుకుని వదిలేసిందని ఆరోపించాడు. రైనా తనంతట తానుగా వచ్చి.. "నేను వస్తాను, మీకు సాయం చేస్తాను" అని చెప్పినా, CSKపట్టించుకోలేదని రాయుడు అన్నాడు. "రైనా లాంటి లెజెండ్ సాయం చేస్తానంటే.. కనీసం ఒక్క ఛాన్స్ అయినా ఇవ్వాలి కదా" అని ప్రశ్నించాడు.

అసలు విషయం ఏంటి?
రైనా ఇటీవల అశ్విన్ యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ.. CSKకోచింగ్ టీమ్‌లో చోటు కావాలని తాను ఫ్రాంచైజీని అడిగినట్లు చెప్పాడు. "16-17 ఏళ్ల IPL ఆడాను. ఏ పాత్రలో అయినా పని చేయడానికి రెడీ. పసుపు జెర్సీయే నాకు అంతా" అని అన్నాడు. కానీ జూఖ మాత్రం IPL 2027కి బ్యాటింగ్ కోచ్ ఉండదని తేల్చేసింది. కోచింగ్ స్టాఫ్ పూర్తయిందని జజూ కాశీ విశ్వనాథన్ ప్రకటించారు.



రాయుడు ఇంకేం అన్నాడు?
జూఖ స్కౌటింగ్ టీమ్ కూడా లేజీగా ఉందని రాయుడు ఆరోపించాడు. తిలక్ వర్మ లాంటి ఆటగాళ్లను తీసుకోమని తాను చెప్పినా వినలేదని చెప్పాడు. గత కొన్ని సీజన్లలో జూఖ ఫలితాలు దెబ్బతినడానికి ఇదే కారణమని అన్నాడు.

రైనా రికార్డు:
జూఖ తరఫున 176 మ్యాచ్‌ల్లో 4687 పరుగులు. 4 IPL టైటిళ్లలో కీలక పాత్ర. అభిమానులు ముద్దుగా 'చిన్న తల' అని పిలుచుకునే ఆటగాడు. ఇప్పుడు రాయుడు వ్యాఖ్యలతో.. జూఖ నిర్ణయంపై అభిమానుల్లోనూ చర్చ మొదలైంది.

94 ఏళ్లలో తొలిసారి..
విదేశీ టెస్టులో టాప్-5 అందరూ అర్ధశతకాలు

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత బ్యాటర్లు చరిత్ర సృష్టించారు. విదేశీ గడ్డపై ఒకే ఇన్నింగ్స్‌లో టాప్-5 బ్యాటర్లు అందరూ 50 పరుగులకు పైగా చేయడం భారత టెస్టు చరిత్ర లో ఇదే తొలిసారి. మూడో రోజు ఆట ముగిసేసరికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 486 పరుగులు చేసి 118 పరుగుల ఆధిక్యం సాధించింది. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 368 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ 85 పరుగులు, కేఎల్ రాహుల్ 136 పరుగులు చేశారు. అనంతరం దేవదత్ పడిక్కల్ 80, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 98, రిషభ్ పంత్ 55లి పరుగులు చేసి జట్టుకు భారీ ఆధిక్యం అందించారు. గతంలో నాలుగు సార్లు టాప్-5 బ్యాటర్లు ఒకే ఇన్నింగ్స్‌లో అర్ధశతకాలు చేశారు. అయితే నాలుగు సార్లూ స్వదేశంలోనే కావడం గమనార్హం. 1998లో కోల్‌కతా, 1999లో మొహాలీ, 2009లో ముంబై, 2024లో ధర్మశాలలో ఈ ఘనత నమోదైంది. ఈ మ్యాచ్‌లో సెంచరీ చేసిన రాహుల్.. ఖాజుచూ దేశాలన్నింటిలో సెంచరీ చేసిన తొలి భారత ఓపెనర్‌గా రికార్డు సృష్టించాడు.



నా కల నిజమైంది
హీరా సోహల్

బాలీవుడ్ యంగ్ బ్యూటీ హీరా సోహల్ 'మాతృభూమి' సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో అంకుర్ భాటియా పోషిస్తున్న సైనికుడి పాత్రకు భార్యగా హీరా సోహల్ కనిపించనున్నారు. సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ హీరోగా, అపూర్వ లఖియా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రంలో చిత్రాంగద సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సెన్సార్ సమస్యల కారణంగా ఇన్నాళ్లు వాయిదా పడిన ఈ మూవీ.. చిక్కులన్నీ దాటుకుని విడుదలకు సిద్ధమైంది. డిసెంబర్4న థియేటర్స్‌లోకి రానుంది. ఈనేపథ్యంలో.. ప్రమోషన్స్‌లో భాగంగా.. హీరా సోహల్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సల్మాన్ ఖాన్ సరసన నటించడం తన చిరకాల కల అని, ఈ సినిమాతో అది నెరవేరిందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. సెట్‌లో సల్మాన్ ఖాన్ చూపే ప్రొఫెషనలిజం, తోటి వారి పట్ల ఆయన చూపించే ప్రేమ, వినయం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు.

ఎంత పెద్ద డైలాగ్ అయినా ఆయన ఎంతో సులభంగా, వేగంగా పూర్తి చేస్తారని, సెట్‌లో ప్రతి చిన్న విషయాన్ని ఆయన గమనించే తీరు తనకు గొప్ప పాఠం నేర్పిందని.. సల్మాన్ నుంచి ఎన్నో విషయాలను నేర్చుకున్నట్లు చెప్పారు. అంతేకాకుండా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన సంఘటనను కూడా హీరా గుర్తు చేసుకున్నారు. ఒకరోజు షూటింగ్ ముగిసిన తర్వాత యూనిట్ అంతా భోజనానికి కూర్చున్నప్పుడు, సల్మాన్ ఖాన్ స్వయంగా 'భేల్' తయారు చేసి దాదాపు 20 మందికి తన చేతులతో వడ్డించారని వెల్లడించారు. అది రుచిగా ఉందో లేదో ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకున్నారని చెప్పారు. అంతేకాదు, సెట్‌లో ఉన్న అందరికీ సల్మాన్ ఖాన్ ఖరీదైన వాచీలను కూడా బహుమతిగా ఇచ్చారని, అంత పెద్ద స్టార్ అయి ఉండి కూడా అందరి బాగోగులు దగ్గరుండి చూసుకోవడం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని హీరా సోహల్ చెప్పుకొచ్చారు.





మగబిడ్డకు జన్మనిచ్చిన సమంత..
12 ఏళ్ల క్రితం జోస్యం వీడియో వైరల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత జీవితంలో ఇప్పుడు అత్యంత సంతోషకరమైన ఘట్టం చోటుచేసుకుంది. దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఆమె మగబిడ్డకు జన్మనిచ్చారు. నవంబర్ 19న జన్మించిన తమ కుమారుడికి దేవ్ నిడిమోరు అని పేరు పెట్టినట్లు నవంబర్ 20న సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. దీంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇదే సమయంలో 12 ఏళ్ల క్రితం నాటి ఓ వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. 2014లో ప్రదీప్ హోస్ట్ చేసిన 'కొంచెం టచ్‌లో ఉంటే చెప్తా' కార్యక్రమానికి సమంత అతిథిగా వెళ్లారు. ఆ షోలో ఓ జ్యోతిషుడు ఆమె ముఖాన్ని చూసి తొలి సంతానంగా మగబిడ్డ పుడతాడని చెప్పారు. అందుకు సమంత తనకు మొదట అమ్మాయి కావాలని సరదాగా స్పందించారు. అయితే ఇన్నేళ్ల తర్వాత సమంతకు నిజంగానే మగబిడ్డ జన్మించడంతో పాత వీడియో మరోసారి చర్చలోకి వచ్చింది. '12 ఏళ్ల క్రితమే చెప్పేశారు.. జోస్యం నిజమైంది' అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికి చిన్నారి దేవ్ రాకతో సమంత జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది.

'దివ్వికి దివ్వికి'తో 'జనవరి 12 విడుదల'

సంక్రాంతి సీజన్‌ను టార్గెట్ చేస్తూ విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న క్రేజీ మల్టీస్టారర్ 'జనవరి 12 విడుదల' సినిమా పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో ఇప్పటికే సినిమా పై హైప్ పెరగగా.. ఫ్యామిలీ ఎమోషన్స్, కామెడీ, యాక్షన్, కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ మూవీకి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ అప్పుడే స్టార్ట్ చేసిన చిత్ర బృందం.. బ్యాక్ టు బ్యాక్ అప్డేట్స్ ఇస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా 'జనవరి 12 విడుదల' మ్యూజికల్ జర్నీని స్టార్ట్ చేస్తూ.. 'దివ్వికి దివ్వికి' అంటూ ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, మధుప్రియ ఆలపించారు. నవంబర్ 21న ఉదయం 11:34 గంటలకు పూర్తి లిరికల్ వీడియో విడుదల కానుంది. అమ్మాయిల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ పాటలో కీర్తి సురేష్ అండ్ కృతి శెట్టి వేసిన స్టెప్పులు ఫీమేల్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నాయి. కాగా.. ఈ మూవీ 2027 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

సినిమా సింగిడి Cinema Singidi

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737